సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder . K. NAGESWARA RAO

సంపుటము
సంచిక 17
17.12-52

నందన మార్గశిర బహుళ అమావాస్య బుధవారము



హంపీలోని పద్మమహల్

—ఫొటో: శ్రీ పి. వి. సీతారామశర్మ, మద్రాసు

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫోటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులు అంటించి చిరునామా వ్రాసిన కవర్లనుగాని చేర్చి పంపవలసిందని మనవి. స్టాంపులను పంపేవారికి మాత్రమే వారి రచనలను గాని, చిత్రాలనుగాని ప్రచురించే ముందు ప్రచురణ విషయమై తెలియ పరచగలము. ఈ సందర్భంలో రచయితలు, చిత్రకారులు మాకు సహకార మివ్వగలరని ఆశిస్తున్నాము.

—సంపాదకుడు.

"గోడమీద బొమ్మ"

జనవరి మూడోవారం నుంచి శ్రీ. బలివాడ కాంతారావుగారి "గోడమీద బొమ్మ" ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా ప్రారంభమవుతుంది. —సం.

ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రిక



4 అణాలు

17-12-'52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



పల్లవులచే నిర్మించబడిన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, తాడిపత్రి.

—ఫోటో : శ్రీ పి. రాఘవరావు

కాలక్షేపం

వరకృప భృత్యులందు;
నిజవర్గమునం దనుకూలవృత్తి; కా
పురుషులయందు శాఠ్యము;-
సుబుద్ధులయం దనురక్తి; దాల్మి స
ద్గురువులయందు;-గౌరవము
కోవిదులందు;-నయంబు రాజులం;-
దరిజనులందు శౌర్యము;-మృ
గాక్షులయందు ప్రగల్భభావ;- మీ
వరుస, కళాప్రవీణులగు
వారలయందు వసించు లోకముల్.

తా॥ సేవకులయందు దయ ఉండాలి. స బంధువర్గము విషయములో అనుకూలముగా కలిసి మెలసి ఉండాలి. చెడ్డపురుషుల యందు కఠినంగా ఉండాలి. సద్బుద్ధిగల వారియందు ప్రీతితో ప్రవర్తించాలి. సద్గురువులయందు ఓర్పు వహించాలి. విద్వాంసులయెడల గౌరవం ఉండాలి. రాజుల విషయంలో వినయము ఉండాలి. శత్రువుల యెడల (అరిజనులందు) శౌర్యము చూపించాలి. స్త్రీలయందు తాను దిట్టమైనవాడనన్నట్లుగా ప్రవర్తించాలి. ఈ విధముగా తమ భావములను నేర్పరులై ఎవరు ప్రవర్తింప జేస్తారో, అట్టి వారికి యీ మానవ లోకము వశమై, హస్తగతమై ఉంటుంది.

అటువంటి వాళ్లు లోకజ్ఞాన చతురులు. అటువంటివాళ్లు కళాప్రవీణులు. ఈ జీవిత వ్యాపారప్రవృత్తినే ఒక కళగా పరిగణించి, ఎవరితో ఎట్లా ప్రవర్తించాలో ఆయా మెళుకువలను, లోక మర్యాదలను సరిగ్గా తెలిసికొని ప్రవర్తించినట్లయితే, యీ లౌక్య మర్యాదలనే కళలో ప్రవీణులవుతారు. సంఘంలో పాటించవలసిన మర్యాదలను కొన్ని నేర్పుతో పాటించేటటువంటివారిని యింగ్లీష్‌భాషలో "జెంటిల్మన్"(*Gentleman*)"సరసుడు"అంటారు. కాని, యీ "సరసుడు" అనే మాటకు మన తెనుగుభాషలో కొన్ని జిల్లాలప్రాంతంలో పూర్వం ఉన్నటువంటి భావం పోయి, సానివారి యిండ్లకు వెళ్లివస్తూ ఉండే "రసికుడు"లేదా "విటుడు"అనేఅర్థం ఏర్పడింది. ఏమైనప్పటికీ, "జెంటిల్మన్" అనే యింగ్లీషుమాటకుకూడా ఇంగ్లీషు భాషలోని పాతకాలపు గౌరవభావం క్రమేణా పోయింది. బర్న్స అనే స్కాట్లండు దేశపు ఒక మహాకవి యీ"జెంటిల్మన్" అనే మాటకు ఉన్న గౌరవార్థం అంతా వట్టి బూటకం అని చెప్పి పటాపంచలు చేశాడు.

"They are but barber-made and tailor-made gentlemen"

"వారు కేవలము మంగలి కల్పిత దర్జీ కల్పిత దర్జాపురుషులు" (జెంటిల్మెన్) అన్నాడు—ఎందుచేతనంటే, మంగలి హెయిర్ కట్టింగు సెలూన్‌కు (క్షౌరశాలకు) వెళ్ళి, చక్కగా క్రాపింగు చేయించుకొని, మంచీ దర్జీవాడు కుట్టియిచ్చిన కొత్తఫ్యాషను కొత్తదుస్తులను ధరించి, కాఫీహోటలుకు బయలుదేరి వెళ్లుతూ, తోవలో ఎవరైనా మిత్రుడు కన్పిస్తే "హలో! గుడ్ మార్నింగ్!" అని పలకరించి, "గుడ్ బై! చీరో!" అని చిరునవ్వుతో సెలవుతీసికొని టీక్, టాక్‌గా వెళ్లిపోతూ ఉంటే, ప్రక్కనున్న ఖిల్లీదుకాణం వానికి డబ్బుయివ్వకపోయినా, ఖిల్లీ, సిగరెట్లు వగైరా వాయినం యిచ్చి సత్వరంగా సత్కరించి యితర ఖాతాదార్లందరికంటె ఎంతో ఎక్కువగా ఆదరించి పంపివేస్తాడు.

(1) *Good Morning* (2) *Good-Night* (3) *Good Bye* ((1) గుడ్-మార్నింగ్ (2) గుడ్-నైట్ (3) గుడ్-బై—(1) శుభోదయమ్ (2) శుభరాత్రమ్ (3) శుభమస్తు) అనే మూడు అభివందన పదములను ఆంగ్లవాసన గల అభిజ్ఞులు ఆంగ్లేయులను అనుకరించి ప్రావీణ్యంతో ప్రయోగిస్తూ ఉంటారు. పైజెప్పిన పదత్రయమే కాకుండా:—

(1) *Hallo!* (2) *Thank you* (3) *Sorry* (4) *O. K.* (5) *Cheer oh!* (1) హలో (2) థాంక్యూ (3) సారీ (4) ఓ. కే. (5) చీర్-ఓ—(1) అహో (2) కృతజ్ఞుడన్ (3) చింతించెదన్ (4) సర్వం సవ్యం (బహుత్ ఠీక్ హై), (5) ఖుషీహో!)—ఈ అయిదు మాటలతో ఆంగ్ల సంస్కారం చాలావరకు పూర్తి అవుతుంది. ఈ పంచ పదజాల మహేంద్రజాలమును పంచబాణములవలె ప్రయోగించి ప్రపంచమంతా జయించవచ్చు ననియు, ఇది సకలజన వశీకరణైకతంత్ర మహామంత్రోక్త శబ్దపంచక మనియు, ఆంగ్ల దొరల వగల తెర గెరింగిన పలువురు జనుల తలంపు.

ఈ గౌరవముయొక్క, యీ జనవశీకరణ శక్తియొక్క రహస్యం ఎందులో ఉన్నదంటారా? ఆకీవిలో ఉంది. "దానివయసు, దాని హొవుసు, దానిసొగసు" అన్నట్లుగా, స్త్రీయొక్క భావాభినయకళా సౌందర్యము ఆమెయొక్క "టెక్కు"లోనూ, "నిక్కు"లోనూ ఉంటుంది. వివరించి చెప్పినట్లయితే, కళాప్రవీణులగు వారి "టెక్‌నిక్" (*Technique*) ఇదే అని బోధపడుతుంది. ఇదంతా బాహ్యపటాటోపమేగాని అసలైన అంతర్గతమైన సత్తాకాదు అని త్రోసివేయడానికి వీలు లేదు.

నిజమైన మేల్మిబంగారం అయినప్పటికీ, దానికి మెరుగు పెట్టక తప్పదు. "పూత మెరుంగులున్ పసరు పూప బెడంగులు" అనేవి కూడా జనవశీకరణార్థం అవసరం. వజ్రమైనా, సానబెట్టిన తర్వాతనే దానికి విలువ పూర్తిగా ఏర్పడుతుంది. లోకాన్ని పరిత్యజించి, సర్వసంగ పరిత్యాగిగా సంచరించేటటువంటి యోగిపుంగవుల సంగతిగాని, మహాతపస్సమాధిలో ఉన్న వారి సంగతిగాని ఈ లోకమర్యాదలకూ, ఈలౌక్యనీతికీ అతీతమైనటువంటిది. వాయుభక్షులు, పర్ణభక్షులు, ఉదకభక్షులు అయినటువంటివారి విషయములోనూ, నిర్వికల్ప సమాధిలో ఉంటూ ఉన్నటువంటి వారి విషయములోను, యీ లోకమర్యాదలు వర్తించవు.

కాని, యీ లోకమర్యాదలను పాటించిఅనుసరించవలెనని నొక్కి వక్కాణించేటప్పుడు, అంతశ్శుద్ధి అనవసరం అనేభావం ఎక్కడా లేదు. రుచిగా ఉండాలి అంటే

కాలక్షేపం

శుచిగా ఉండనక్కరలేదనే భావం లేదు. "శుచిగా ఉండాలి" అని చెప్పినప్పుడు, "బాహ్యశుచి శుభ్రతలు మాత్రం ఉంటే చాలును" అనే అర్థం ఎక్కడా లేదు. పైన వేసికొనే డ్రెస్ (దుస్తులు) శుభ్రంగా ఉండడం అవసరం. అంతమాత్రం చాలదు. చెమటతో తడిసినమురికి దేహమంతటను బురదవలె వుంటుంది. బురదలోనుంచి పుట్టినదే పంకజమన్నట్లుగా, మన దేహ మాలిన్యములోనుండియే తామర ఉద్భవిస్తున్నది. అది సిరికి నెలవు కాదు గాని, చీడకు మవుతుంది.

శరీరముమీద బురద, దురద, తామర, గజ్జి, తీట, పొడ, చీడకూడా లేకుండా శరీర పైభాగం శుభ్రంగా శుచిగా ఉంచుకోవాలి అంతే కాదు. రక్తం కూడా శుద్ధంగా ఉండాలి. జీర్ణకోశం, పైత్యకోశం కూడా సరిగ్గా పనిచేస్తూ శ్లేష్మవాత పైత్యప్రకోపములు లేకుండా పరిశుద్ధమైన స్థితిలో ఉండాలి. దేహములోని భాగమేయైన మెదడు కూడా ఆరోగ్యంగా నిర్మలంగా ఉంటూ ఉండాలి. మెదడులోని భావాలనన్నింటినీ, సక్రమంగా నడిపించగల ఆత్మ సంస్కారం కూడా విశుద్ధమైనదిగా ఉండాలి. ఈ విధంగా బాహ్యశుచి మొదలుకొని, అంతశ్శుచి, అభ్యంతరశుచి వరకూ సంపూర్ణమైన బాహ్యాభ్యంతర శుచి ఉండాలి. పైపై ఉత్తశుద్ధిమాత్రమే గాక చిత్తశుద్ధి కూడా ఉండవలసినదే — కాదని, కూడదని వాదించేవారు ఉండరు.

కాని, యీ విధమైన సంస్కారము ముందుగా లోపలినుంచి రావాలని ఒకరంటారు. బయటనుంచి ప్రారంభం కావాలని ఇంకొకరంటారు. ఏమైనప్పటికీ, సంస్కారం అనేది సాధకం వల్లనే రావాలి అన్నారు పిల్లవానికి పుట్టుకతోనే లోకజ్ఞానం కలుగదు. పుట్టుకతోనే ఆత్మజ్ఞాని కాజాలడు. వాల్మీకి అంతవాడు కూడా, కొంతకాలము రామ నామ జపం చేసిన తర్వాతనే, రామకథామృతపుపుట్ట అయినాడు. ఆ కారణం చేత జప, తప, ధ్యాన, మనన, భజనవగైరా సాధకములు కొన్ని డ్రిల్లు కవాతు చేసినట్లుగా చేయవలసిన అగత్యం కలుగుతోంది.

"పెద్దల బొడగన్న — భృత్యుని కైవడి
చేరి నమస్కృతుల్ - సేయువాడు
. .. .
లలిత మర్యాదుడైన-ప్రహ్లాదు డధిప"

అని ప్రహ్లాదుని విషయంలో పోతన్న గారు వర్ణించారు. అప్పటికి ప్రహ్లాదుని వయస్సు ఎంత అంటే, "పంచాబ్దంబుల వాడు" అన్నారు. అయిదేండ్ల వయస్సువాడు - అంత చిన్న వయస్సులోనే, పెద్దవాళ్ళకు ఎంతో భక్తితో నమస్కారం చేసేవాడు. ప్రహ్లాదునివంటి మహాజ్ఞాని, మహాభక్తుడు కూడా లోకమర్యాదలెరిగి ప్రవర్తించేవాడు. లోక మర్యాదలను శ్రద్ధగా పాటించాడు.

అయితే యింత చిన్న వయస్సులోనే యింత పరిపక్వం కావడం అసాధారణమైన అపూర్వమైన విషయం. కాని, అంత చిన్న వయస్సులోని పిల్లలకు కూడా అటువంటి మర్యాదలను నేర్పి సాధకం చేయించవచ్చు. అటువంటి మర్యాదలను ఆ వయస్సునుంచీన్నీ సాధకం చేయించినట్లయితే, వాళ్లు పెద్దవాళ్ళయిన తర్వాత, వాళ్ళపిల్లలకు కూడా అటువంటి మర్యాదలే నేర్పి సాధకం చేయిస్తారు. అప్పుడు "నమస్కారం చేయడం" అనేది సంఘంలో ఒక స్థిరమైన సంప్రదాయంగా ఉంటుంది.

అయితే, పెద్దవాళ్ళయందు గౌరవ భావం అనేది మనస్సులో ఉండాలి గాని, నమస్కారం చేసినంతమాత్రం చేత గౌరవ భావం చూపించి నట్లవుతుందా? అని కొందరు ప్రశ్నిస్తారు. ఆ మాట నిజమే. "గౌరవభావం" అనేది "భావం" లోనే ఉండాలిగాని, భాషలో కాదు. వంగి నమస్కరించే వాని భంగిమంలో లేదు.

కాని, ఒక్క విషయం గ్రహించాలి. పాము కరచి దాని విషం రక్తంలోకి ఎక్కినప్పుడే, ఆ పాముకాటువల్ల ఆ మనిషి మరణిస్తాడు అని మనము వాదిస్తాము. కాని, లోకానుభవ జ్ఞానంవల్ల పరిశీలించి చూస్తే, పాము విషం రక్తంలోకి ఎక్కకపోయినప్పటికీ, తన్ను కరచినది తాచుపామే అని తెలిసి, ఆ భయ భ్రాంతితోనే ప్రాణాలు విడిచినవాళ్లూ చాలామంది ఉన్నారు. ఒక పల్లెవాడు తెల్లవారకపూర్వం చీకట్లో ఏటిలో వల వేసి చేపలు పట్టుతూ ఉన్నాడు. కాలి పిక్కను ఏదో జలగ పట్టుకొని కొంచెం గీకింది. కాలు విదిలించి దానిని తొలగించి, ఆ రేవులో మరొక చోటునకు మారి, చేపలుపట్టి వానినన్నింటిని ఒక పెద్ద గంపలోకి రాల్చి, గంపను బిగించి కట్టి, యింటికి వచ్చాడు. కొంతసేపు విశ్రాంతి తీసికొని, కాలికి ఏర్పడిన గాయానికి, ఏదో చమురు పూసి, గంటసేపయినతర్వాత గంపమూత విప్పిచూచాడు. అందులో ఉన్న చేపలతోపాటు, సహజంగా ఒక సర్పం ఉంది.

ఆ గంపను ఒడ్డున పెట్టినప్పుడు, ఎప్పుడో అది ఆ గంపలో దూరింది. ఆపల్లెవాని భార్య అదిచూచి "అమ్మబాబో! ఈపామే నీకాలుకరిచింది" అని కేక వేసింది. వెంటనే వానికి ఆ మాట నిజమనే ఊహ కలిగింది. పాము కరచినా కరవక పోయినా, వాని నోటివెంట నురుగులువచ్చి, గుండె ఆగి పోయి, హఠాత్తుగా ప్రాణం పోయింది. పరుగెత్తినకొద్దీ కుక్క మనవెంటబడి కరుస్తుంది అన్నట్లుగా "మరణభీతి" కూడా కుక్కవలె మనవెంటబడి కరచి మనలను చంపుతుంది.

భయం పుట్టినప్పుడు మనము వడిగా పరుగెత్తుతాము. ఆ మాట నిజమే. కాని, పరుగెత్తడంవల్ల కూడా మనలో అధైర్యం వృద్ధి అవుతుంది.

దుఃఖరసం అభినయించడంకోసం, ఒక గొప్ప నటుడు తన ముఖవైఖరి అంతా ఒక విధంగా మార్చివేసేవాడు. వెంటనే అతని కండ్లలోనుంచి కన్నీళ్లు కూడా వచ్చేవి. గొప్ప గొప్ప విషాదాంత నాటకాలలో ఇతడు కథానాయకుని పాత్ర వహించేవాడు. అతడు,ఆ ముఖవైఖరిని విషాదసూచకంగా, పొట్ట అక్కళించినట్లుగా, పొంగు పరచగానే, నాటకం స్టేజిమీద అతడు నిజంగా విషాదభరితుడై దుఃఖభరితుడై ఆ శోకరసమును అద్భుతంగా ఒప్పించేవాడు. ఈవిధంగా విషాదాంత నాటకములలో విషాదభరితుడైన, కథానాయకుని పాత్రనే అతడు అనేక ఏండ్లు నటించాడు. చివరకు నాటకరంగంనుంచి విరమించిన తర్వాత కూడా, అతడెప్పుడూ విషాదభరిత హృదయుడై ఉంటూఉండేవాడు. అతనికి సిరిసంపత్తు అన్నీ ఉన్నాయి సంసారయాత్ర సుఖంగా సాగుతోంది. దేహారోగ్యం సక్రమంగా ఉంది. అయితే నేం! అతని చిత్తప్రవృత్తి ఆ శోకరస సాధకంతో చింతాక్రాంత చిత్తప్రవృత్తిగా మారిపోయింది. నిజంగా విచారం వచ్చినప్పుడు మన ముఖము ఏ విధంగా బావురుమన్నట్లుగా ఉంటుందో బాగా పరిశీలించవచ్చు. నిజంగా విచారం లేనప్పుడు కూడా అటువంటి ఏడ్పు మొగమునే పెట్టుతూ, అటువంటి ఏడ్పు మొగంతోనే ఉంటూ ఉండడం అలవాటు చేసినట్లయితే, అటువంటి బాహ్య వైఖరి సాధకంవల్లనే కొన్నాళ్ళకు నిజంగాలేని ఏడ్పు పుట్టుకొనివస్తుంది. భయపడినందువల్ల పరుగెత్తి పారిపోతాడా? పరుగెత్తి పారిపోవడంవల్ల భయంహెచ్చుతుందా? అని ప్రశ్నిస్తే రెండూ నిజమే అని అనేక సందర్భా

తల్లీ! ఈ వెధవని కూడా, మెడికల్ కాలేజీలో చేర్పిస్తే నాకీగతి పట్టేదే కాదేమో! అయితే అమ్మాయీ, ఆ వెటనస్సు ఏం చేస్తుంది?

సై: అది చాలా భయంకరమయిన క్రిమి నాన్నగారూ! అది ఏదో సూక్ష్మమయిన గాయం గుండా శరీరంలో ప్రవేశిస్తుంది.

రామ: దొంగపీనుగ! ఈ క్రిములు దొంగలకన్నా దొంగపీనుగులల్లే వున్నారు. ఇక్కడ కొట్టుకుపోయిందే! దానిలో నించి కూడా ప్రవేసిస్తుందా?

సైరంధ్రి: ఆహా అంతటితో పూరుకోదు. నరాలమీద పొరల్లోకి పోతుంది.

రామ: నరాల్లోకే పోతుందీ; మెదళ్ళోకికూడా పోతుందా?

సైరంధ్రి: ఊ; ఉఁ;

రామ: పోయేం చేస్తుందమ్మా;

దామో: మెదళ్లోకి పోయి జ్ఞాపకశక్తిని తగ్గిస్తుందనుకుంటాను.

రామ: నీకేం తెలుసని చెబుతున్నావురా! నిన్ను డాక్టర్ని చెయ్యకపోవడం నాదే బుద్ధి తక్కువయిపోంది. ఇద్దరు పిల్లలు డాక్టర్లయి క్రిమిసంహారం చేస్తుంటే నన్నీ క్రిములిట్లా బాధపెట్టేవా? ఇంతకీ నాకా బుద్ధి లేకపోయింది. పాపం వొంటరిగా అదేం చేస్తుంది, అయితే తల్లీ మెదళ్ళోకి పోయి ఆ క్రిమి ఏంచేస్తుందీ?

సై: మెదణ్ణి బాగా ఇర్రిటేట్- అంటే కెలుకుతుంది.

రామ: దానంపతెగా. మెదణ్ణే కెలుకుతుందీ. స్టూవర్ట్ దొర కలెక్టరుగానూ, నేను జిల్లాబోర్డు ప్రెసిడెంటుగాను ఉన్నపుడు మెదడంటే నీదేనయ్యా బ్రహ్మాండం రామదాసుగారూ అనేవాడు. అట్లా కలెక్టర్లు మెచ్చుకున్న మెదడు వెధవ క్రిములు కెలుకుతూవుంటే చూస్తూ వూరకుంటూంది. ఇంతకన్నా అవమానమేముంది. ఈ క్రిములకు లోబడే కర్మకంటే, విశ్వాసరాహిత్య తీర్మానం పెట్టించుకున్నా బాగా వుండేదేమో, అయితే అమ్మా అట్లా అవి మెదణ్ణి కలికితే ఏమవుతుందీ?

సై: మూర్ఛ వచ్చిన వాడికిలాగా కాళ్లూ చేతులూ కొట్టుకుంటాయి. శరీరం విల్లంబు వొంగినట్లుగా వెనక్కి వంగిపోతుంది.

దామో: దాన్నేగామల్ను ఆయుర్వేద వైద్యులు ధనుర్వాత మంటారు. మా బ్యాంకు డైరెక్టరుకు ఇది వచ్చి పాపం చచ్చిపోయినాడు.

రామ: దుర్మార్గుడా; నా చావు కోరుతున్నావుట్రా...

దామో: ఛీఛీ; అట్లా అనుకుంటారేమిటి నాన్నగారూ...


రామ: నోరు ముయ్యి. నేను మాట్లాడుతుంటే ఛీఛీ అంటావా? నీకు బుద్ధి లేదూ, నూతేసుకోగానే సరే, క్రొాపు దువ్వుకోంగానే సరా? ఫో నా ఎదటనుంచి అవతలకు ఫో. పోండి. నాకు నిద్దరొస్తోంది పోండి, ధనుర్వాతం! ధనుర్వాతం! వాతాలన్నింటిలోకీ నాకూ ధనుర్వాతమే రావాలీ.

దామో: భయపడకండి నాన్నగారూ. పొన్నుస్వామి పెళ్లైగా రున్నంతకాలం ధనుర్వాతం వచ్చినా ఫరవాలేదు. శిరవాతం వచ్చినా ఫరవాలేదు.

రామ: ఇంకేం అర్థమయిన వాతాలూ తీసుకురా; పో, అవతలకు పో, పోనేం...

దామో: ఏమిటి నాన్నగారూ మీతో నుంచుంటే మరా మేకు, కూచుంటే మరా మేకుగా వుంది. ఎందుకల్లా తిట్టి ఉద్రేకం తెచ్చుకుంటారు?

(54-వ పేజీ చూడండి)



ఆకలితో

(గతసంచిక తరువాయి)

తెల్లతెర మెల్లిగా లేస్తుంది... రంగాని కొకప్రక్కగా పెద్దచెట్టుమోడు. దాని మొదలుదగ్గర సుందమ్మ వంటచేస్తూంటుంది. ప్రక్కనే కోటయ్య పట్టుపంచె కట్టుకుని ఆంజనేయ దండకం చదువుతున్నాడు. రెండోవైపున ఒక ముళ్ళకంప ప్రక్కనే బంగారం, గౌరి, చిట్టెయ్య, చంటిది. అందరివీ ఎండిపోయిన దీనవదనాలు...రంగంలో వెనకతెర దగ్గరలో నలుగురు అభాగ్యులు ఎంగిలాకులు నాకుతూంటారు—సుందమ్మ చేసే వంటకాల వాసనలు చూస్తూ నోళ్లు చప్పరిస్తూంటారు. అంతా మూలుగులు.]

కోటయ్య: (చదువుతున్నాడు) "ప్రసన్నాంజనేయం - ప్రభాదివ్యకాయం - ప్రకీర్తిప్రదాయం - భజే వాయుపుత్రం - భజే వాలిమిత్రం."—ఏమేవ్—యింకా కాలా - వంటా?

సుందమ్మ: అంత తొందరైతే ఎట్లా - అవుతోందిలే.

కో: ఒంటిగంటైతే యింకా తెమల దయ్యే.

సుం: కూర తాలింపు వేస్తున్నానండీ - కాస్సేపా దండకం చదువుతూండండి - అయిపోతుంది!!

కో:- (చదువుతున్నాడు) "ప్రసన్నాంజనేయం - ప్రభాదివ్యకాయం".. ఛీ- ఒకటే ఈ దవీ ళ్ళ-(సోట్లోచదువుకుంటాడు.)

చి: అత్తా...ఆకలేస్తాందీ.

గౌరి: కాస్సేపాగు చిట్టీ - నాన్నొస్తారుగా.

చి: (చెట్టువైపు చూపుతూ) ఆళ్ళేం వండుకుంటున్నారూ?

గౌరి: బంగాళాదుంప లిగురుగావల్ను. (నోరుచప్పరిస్తుంది)

చి: (గుటకలుమింగుతూ) భలేవాస నేస్తాందత్తయ్యా.

గౌరి: ఊ...మనూరెళ్ళినాక మనమూ వండుకుందాంలే బాబూ.

చి: ఊ...(మారాంగా) నా కిప్పుడే కావాల—

గౌరి: కావాలంటే ఎట్లా వస్తుందిరా-గంజికూడా లేక చస్తూంటే-మనం.

చి: ఊ-నాక్కావాలీ-

బం: (కోపంగా) కావాలీ... ఉండు-రెండొడ్డిస్తాను.

చి: ఊఁ...నా కాక లేస్తాంటేనూ—

బం: (విసుగ్గా) దరిద్రాని కాక లెక్కువేరా—(చెయ్యెత్తుతుంది)

గౌరి: (చిట్టిని వళ్ళోకితీసుకుని) రెండు రోజుల్నుంచీ గంజిచుక్కైనా లేదుపాపం! కోప్పడమాకు వదినా-!

బం: లేదంటే-ఎక్కణ్ణుంచొస్తుందీ? మనంమాత్రం తిన్నామా?

గౌరి. పసివాడు-వాడికేం తెల్సు - మన గోడు!

బం: తెలవకపోతే; మారాంచేస్తే వస్తుందా?

చిట్టి: ఆకలే—

బం: మీనాన్న గంజిపోయించుకొస్తా కెళ్ళారుగా; రానియ్‌రా.

చి: (పొట్టసవరించుకుంటూ, ఏడ్పు)

గౌరి: ఏడ్వకు చిట్టీ - కాస్సేపూరుకో- (కన్నీళ్ళు.)

కో: "ఆసంద్రముం దాటి- ఆ లంకనుం జేరి - సీతామహాదేవినిం జూచి"- ఏమేవ్, అయిందా?

సుం: అయింది బాబూ అయింది - ఆకులిట్లా తీసుకురండి.

కో: (పెద్దమూటలోంచి ఆకులు తీస్తాడు)

[కోటయ్య, సుందమ్మ ఆకులుతడిపి వడ్డించుకుంటూంటారు]

[గుడ్డియ్య, సుంటిది. నమ్మదుంపలు నములుతూ ప్రవేశించారు.]

సుంటిది: (బంగారంను చూచి) దర్శ నెబువులు-మీరూ యిట్టావొచ్చారేంతల్లీ?

బం: మా ఖర్మకాలి.

గుడ్డియ్య: ఎవరే సుంటీ?

సుం: రామారం రైతులా... ఎల్లినప్పుడల్లా యిన్నొడ్డెట్టేవోరు.

గు: అటువంటి మారాజులకే కరువు రావాల్సొచ్చిపడె. (భార్య ఆసరాతో ముందుకు నడుస్తాడు.)

సుం: అడుక్కోటం తెలయిన మనకే వారానికో గుక్కెడు దొరకటం లేదు చెయి చాపటం తెలగాని ఆరికెంతిదిగా వుందో...ఎంత కట్టకాలం!? (భర్తను కూచోబెట్టి, జోలిదింపి) నువ్విక్కడ కూచోరా, మన దుంపల్లో రొండారికిచ్చొత్తా. (అటువైపు - దుంపలు తీసుకు వెళుతుంది)

గు: ఆరు తింటారంటేమనియ్. (దుంపలు నములుతున్నాడు)

సుం: (బంగారందగ్గరకెళ్లి) ఈదుంపలు తినండమ్మ.

బం: మీదగ్గరకూడా పంచుకోమా— (దీనంగా).

చి: నాకియ్య - (లాక్కోబోయి, తల్లి వంక చూస్తాడు.)

సుం: (దుంపలు చిట్టియ్యకిచ్చి) తినండి చిన్నదొరా...కిందటిసారొచ్చినపుడు గుప్పెడొడ్డెట్టావు.

చి: (దుంపలు నములుతూ) నువ్వు మంచిదానివి.

సుం: వెయ్యేళ్ళు చల్లగా వర్ధిల్లుదొరా. (భర్తదగ్గరకు వెళ్ళిపోతుంది.)

గౌరి: నాకొకటి పెట్టవ్ - చిట్టీ.

చి: (దాచుకుంటూ) ఊఁ - నాకు చాలవ్ గానీ.

గౌరి: (పెదిమెలు తడుపుకుంటూ) సర్లే.

కో: నెయ్యి వడ్డించవే.

సుం: (నెయ్యి వడ్డిస్తూ) అన్నం కాలుతూనే వుంది - చిన్నపిల్లల్లాగా తొందర పడతారేం చోద్యం!

కో: (చెయ్యారుపుకుంటూ అన్నం కలుపుతున్నాడు.)

[అభాగ్యులంతా యీ దంపతులవైపూ, ఆహారంవైపూ చూస్తూ, నోళ్లు చప్పరిస్తూ, చొంగలు కార్చుకుంటూ చూస్తున్నారు.]

1 అభాగ్యుడు: (దగ్గరకువచ్చి) బాబూ- ఒక్కముద్ద.

కో: శుభమా అంటూ దేవుడు ముద్దెత్తబోతూంటే - నువ్వొకడి వడ్డుపడ్డావ్ నక్షత్రకుడిలా.

1 అభా: వారంరోజుల్నుంచీ గొంతు తడి కాలేదు బాబూ.

సుం: గూడూరులో ఏ చెడు తుఫానరైలుదిగాకొ-ఎక్కడ జూచినా యిదే తంతు. ప్రతివాళ్లకీ యిదో

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

వంకైపోయింది-కరువొచ్చిందట, కరువు !!

కో : నిజమే నేమో లే.

సుం : మీదంతా మరీ విచిత్రం!— కరువైతేమాత్రం, ఇంతిమందికా?!

2వ అభా : (దగ్గరై) ఈ అయిదారు జిల్లాలకీ వచ్చిందమ్మా.

కో : అయితే, మమ్మల్నేం చెయ్య మంటారోయ్. పొండి.

2వ అభా : మీ రొదిలిపెట్టేంత ఎంగిలి చాలు బాబూ.

సుం : ఛీ...తిరపతికొండ కెళ్తూ— అదో పాపం కూడానా మాకూ? పొండి.

కో : ఒకళ్ళకీ యిద్దరికీ అయితే, ఏదో పెట్టొచ్చుగానీ - దేశమంతటా అదే పనైతే ఏం పెట్టగలం - వెళ్లిపొండి.

వంటేది : (మెల్లిగా వచ్చి) కోటితో చెప్పేబదులు, చేత్తో నాలుగు మెతుకులు విదిలించండి దొరా.

సుం : అయ్యో, అయ్యో - యీగల్లాగా మూగుతున్నారేం ? మడిలో వున్నాం దూరంగా పొండల్లా.

చి : (దుంపలు వదిలి యీగోలవైపు వచ్చాడు)

1వ అభా : మీ రొడ్చిన గంజన్నా యిప్పించండి బాబూ - పేగు లేడుస్తున్నయ్.

కో : ఆ చట్టిలో వుంది, తీసుకుపొండి.

సుం : (లేచి, చట్టి పట్టుకుని విస్తరిదగ్గరెట్టి) భలేవారే మీరు - సత్తు చట్టి మైల పడదూ? మమ్మల్నన్నాలు తిన్నివ్వండి - తెచ్చి యీ గంజి పోస్తా—

1వ అభా : అట్లాగే తల్లీ (తోటివారితో) అక్కడ కూచ్చుందాం పదండ్రా. (వెనుక తెరవైపు నడుస్తాడు.) వరసగా కూచ్చుందాంరా.

2వ అభా : దరమతల్లి (వెనక్కి తిరుగుతాడు)

సుం : మీ పేరుజెప్పుకుని, యీరోజుకు బదుకుతాం లచ్చింతల్లీ. (భర్తదగ్గరకు వెళుతుంది.)

కో : (ముద్దనోట్లో పెట్టుకున్నాడు)

సుం : (ముద్దనెత్తుతూంది)

చి : (చరచరా సుందమ్మవిస్తట్లో కలబడి, గుప్పెడన్నం తీసుకుని నోట్లో కుక్కుకుంటాడు)

సుం : (ముద్దవదిలి-కోపంగా) అయ్యో అయ్యో ! వీడికి మాయరోగం రానూ-సిద్ధాన్నం ఎంగిలిజేసి చచ్చాడూ-

కో : (ఎంగిలిచేత్తో చిట్టియ్యను కొట్టి) పోరా, కుక్కలకొడకా!

చి : (ఏడుస్తూ నుంచున్నాడు)

బం : (దగ్గరకొచ్చి, కొడుకును దబదబా బాదుతూ) చచ్చినాడా-ఏంపనిది.. నువ్వు చచ్చినా పీడావదిలిపోను... చావు.. నీ జిమ్మడా, చావ్...కుక్కలాగా ఎగబడతావ్ ఎంగిలికోసం—చావ్, ఛావు.

గౌ : (వదినెను అడ్డువెళ్ళి, చిట్టియ్యను లాక్కొని, ఎత్తుకుని) చాల్లే వదినా-ఆకలై కడుపెంతమండిపోయిందో-లేకపోతే చిట్టి యిట్లాచేసేవాడేనా ?

బం : (కన్నీరు పమిటెతో తుడుచుకుంటూ వంటిదగ్గరకు వెళ్తుంది.)

కో : పొద్దుట్నుంచీ చేసుకున్న వంటంతా పాడుజేశాడు—కుక్కవెధవ

గౌరి : ఏమయ్యోవ్ - మాటలు సరిగ్గా రానియ్...ఆకలిబాధ నీకేం తెలుసు? పరువూ ప్రతిష్ఠలూ గలిగి; రోజూ పదిమందికి పెట్టే రైతుబిడ్డ ఎంతాకలయితే పరాయివిస్తట్లో కెగబడ్డాడో ఆలోచించావా ??

సుం : ఓయబ్బ—లేకివాళ్ళకూ కూడా ఎంత తుస్సంటేనూ ? సిద్ధాన్నం పాడు చేస్తే వూరుకోమంటావా ?

కో : మీ బిడ్డ మీకు ముద్దేమోగాని - మాకేంఖర్మ- మొద్దేట్టుకు నేంగుకూ?

గౌరి : ఇంత కఠినులుగనుక నే మీలాంటి వాళ్ళకు పిల్లలు పుట్టరు.

సుం: అయ్యో, అయ్యో ఎంతమాటందో చూశారూ !

కో : పిల్లల్లేకపోవడానికి మేమేం పాపం జెయ్యలేదు ... పుత్రసంతానంకోసమే— తిరపతికి కాలినడకను వెళుతున్నాం.

సుం : (ఈలోపల దగ్గరకొచ్చి) గొడ్డుమోతోళ్లు గనకనే - మారాజుల్ని అంతంత మాటలంటున్నారు.

సుం : ఆః నీజిమ్మడా... ఏంతెంత మాటలే?

కో : అందుకనే యిట్లా అడుక్కుతినేట్టుపుట్టించాడు-ఆవేడుకొండలస్వామి. (చెయ్యి కడుక్కున్నాడు.)

గౌరి : నాలుగేళ్ళనుంచీ పంటల్లేక యిలాగయ్యాంగాని-మీబోటోళ్ళనందర్నీ మేపేది మేమే.

సుం : వాద్దిడితేనా క్లైన్నయినా అంటారు. ఇంకెక్కడికన్నా పోదాంపదండి! (చెయ్యి కడుక్కుని పాత్రలు సర్దింది)

కో : పక్కూరు పోయి ఏబండో కట్టించుకుపోదాం. లేకపోతే యీ కాకి మూకతో వేగలేం; సజావుగా యాత్ర చెయ్యలేం. (మూటలు కడుతున్నాడు)

సుం : పాపాత్ఞేకేదీ—యాత్రజ్ఞేకేదీ!!

[అభాగ్యులందరూ విస్తళ్ళపై కెగబడి, కుక్కల్లాగా చింపుకుని, అందింది తింటారు.. ఎక్కడ మైలపడతామోనని పావుకారు దంపతులు అదిలిస్తున్నా వాళ్లు లెఖ్ఖచెయ్యరు.]

కో : (సంచులు బిగించడం ముగించి) ఇదుగో - మీలో ఎవరన్నా యీమూటలు పక్కూరికి మోసుకొస్తారా-పావలాయిస్తా.

1వ అభా : నే తెస్తా బాబూ.

సుం : అయితే, ఎత్తుకోరా.

1వ అభా : కూలొద్దు తల్లీ - ఒకపూట అన్నం పెట్టండి బతుకుతా.

కో : సంచీలో తెచ్చినవియ్యి అయిపోవచ్చినయ్...తిరపతెళ్ళేదాకా దొరుకుతయ్యో, లేదో...నీ కెక్కణ్ణుంచి తేం, మేం ?

1వ అభా : డబ్బుగలవాళ్లకన్నివూళ్లోనూ దొరుకుతయ్.

సుం : సరే - ఎత్తుకోరా ... ముందిక్కణ్ణుంచి వెళ్లి ఏవూరో చేరుకుంటే నేగాని వండుకు తినేందుకు వెసులుబాటు లేదయ్యో.

1వ అభా : (మూట లెత్తుకుంటాడు.)

[కోటయ్య, సుందమ్మ, 1వ అభాగ్యుడూ నిష్క్రమణ.]

చి : (ఇంకా ఏడుస్తూనే వున్నాడు.)

బం : (చిట్టి వదిలిన దుంపలు నములుతూంది.)

అభాగ్యులు : (ఎంగిలాకులు నాకుతూ జోగుతున్నారు.)

[గుడ్డియ్య, వంటేదీ లేచి వెళ్లిపోయారు.

గౌరి : (కన్నీళ్ళతో) ఊరుకో-చిట్టీ.. ఏంజేస్తాం, మనగతులిట్లాగైనయ్...నాన్న వచ్చే వేళయిందిలే...గంజితెస్తారు-అంతా నీకేయిస్తాం...ఊరుకో, ఊరుకో చిట్టీ. (ఎత్తుకుని అటూయిటూ తిప్పుతుంది.)

[క్రమక్రమంగా రంగంలో కాంతి తగ్గుతుంది.]

రా : (కాళ్ళీడ్చుకుంటూ ప్రవేశించి చట్టిగిన్నె కిందపెడతాడు.)

బం : (దీనంగా, ఆశతో) ఏమండీ-గంజేదీ ?

రా : నేనా వూరు జెళ్ళేసరికి, గంజి సత్రం మూసేశారు.

గౌ : ఎందుకన్నయ్య ?

రా : పగలు పన్నెండుగంటలకే మూసేస్తారట—మళ్ళీ రేపుదయం తీస్తారట... అదైనా తెల్లవారుఝామునుంచీ వరుసగా నుంచుని, కాచుక్కూచుంటే, పదింటికి నుంచి పోస్తారట.

గౌ : ఇట్లాగయితే మన లాంటివాళ్ళు బతికేదెట్లాగో? గవర్నమెంటు సత్రముంటే, నేనింకా బాగుంటుందనుకున్నాను.

రా : గవర్నమెంటిచ్చేది రోజుకు బస్తా నూకలట—అదెంతమంది కొస్తుందీ?

బం : పోనీండి - మనందరం అట్లాంటి సత్రంవున్న వూరికే చేరుకుందాంపదండి- రోజుకోగుక్కెడన్నా తాగిబతుకుదాం.

రా : మనలాంటి వాళ్ళు లేనిదెక్కడ? అక్కడా గంజిదొరకనివాళ్ళే ఎక్కువగా వుంటున్నారట.

గౌరి : మరేం చేద్దాం, యిక?

రా : ఏమో! ఏమీ తోచటం లేదు.

బం : పసిబిడ్డ పాలు లేక - నా రక్తం

★ ఆకలితో ★

కేలుస్తాంది - అది చచ్చినా పీడా వదులును. (నిశ్శబ్దపు ఏడుపు)

రా : అందరికీ అట్లాగే వుంది - కాని, చావే రావటంలేదు.

గౌరి : ఛా-అవేం మాట లన్నయ్యా... ఈ తొలకరికన్నా మనకు చినుకులు పడక పోవు.

రా: మనకి మిగిలిందా, అశోక్క టేగా!

బం : అందాకా బదికే దెట్లా?

గౌరి : గవర్నమెంటు మనబోటి వాళ్ళ కేమీ సాయంచెయ్యటం లేదా అన్నయ్యా?

రా: కరువుపనులని అక్కడా అక్కడా చేయిస్తున్నారట

బం: మనంకూడా పనులుచేద్దాంపదండి.

రా : చుట్టుపక్కలున్న జనానికే చాలినన్ని పనుల్లేవట.

గౌరి: పనులైనా అందరికీ దొరక్కపోతే యెట్లా?

రా : ఏ పెద్ద ఆనకట్టో మొదలెడితేనే గాని, అందరికీ పనులు దొరకవట...

గౌరి : తెలుగుదేశానికి ఆనకట్టలు రావటం-మన జన్మల్లో చూడం గావల్ను!

రా : ప్రభుత్వం తలుచుకుంటే అదెంత పని?

బం : ఆళ్లు తల్చుకునేదాకా మనం బదికితేగా.

గౌరి: ప్రభుత్వ దృక్పథం మారదా?

రా : ప్రజాఘోష దేన్నయినా మార్చ గలదు - రాళ్ళనుండికూడా అమృతాన్ని పిండగలదు.

చి: ఆకలేస్తోంది నాన్నా...

రా : ఆమడదూరంలో రామకృష్ణామిషన్‌వారి ధర్మశాల వుందట - అక్కడికి జేరుకుంటే నాలుగురోజులు బాగా పెడతారు.

బం : పోదాం పదండి. (బిడ్డనీ, మూటనీ ఎత్తుకుంటుంది.)

రా : (మూటా, పెట్టీ పుచ్చుకుంటాడు)

చి : ఆకలే.

గౌరి : మనం యిపుడొక చోటికి వెళుతున్నాం చిట్టీ - అక్కడి కెళ్లగానే - నీకెక్కావలసినంత అన్నం.

చి : ఫో - అన్నీ దొంగమాటలు.

గౌరి : కాదు చిట్టీ.

చి : పొద్దుట్నుంచీ, నాన్న రాగానే గంజిస్తానన్నావ్ గా.. !

గౌరి : ఈసారి నిజం చిట్టీ - నిజం !!


చి : ఊఁ (ఏడుపు)

రా : నోర్ముయ్యరా వెధవా (కోపంతో పళ్లు బిగిస్తాడు.)

[తెర—త్వరగ]

నాలుగవ దృశ్యం

[రంగాలంకరణ :— మూడవరంగంలో చెప్పిన తెల్లతెర, యిపుడు వెనుకతెరకు నాలుగడుగులు ముందుగావుండి, లైట్లు ఛాయాదృశ్యాలకు వీలుగా అమర్చి వుంటాయ్. రంగస్థలానికి ముందు కుడివైపున మాత్రమే ఒక్కలైటు వుంటుంది. ఛాయాదృశ్యం చూపేటప్పుడు యీలైటుకు నల్లని అట్టలు అడ్డుపెట్టాలి. ఛాయాదృశ్యం



వెన్నెల మబ్బులు ఫొటో—శ్రీహరి సత్యం, ఖమ్మంమెట్టు

లోతప్ప యితర సమయాల్లో తెల్ల తెర వెనుక లైట్లుండరాదు. తెల్లతెరముందు కుడివైపు మూల ఓ ఎండుచెట్టూ, ఎడమవైపు మూల జిల్లేడుచెట్టూ వుంటాయ్. ఎండుచెట్టువద్ద బంగారం పడుకుని పసిబిడ్డకు పాలిస్తూంది. గౌరి దగ్గరలో కూచ్చుని, దైన్యంగా చూస్తూ, గడ్డిపోచ నములుతూంది.]

బం: అబ్బా! దీని జిమ్మడా (పిల్లను ప్రక్కకుతోసి) రక్తంకూడా పీలుస్తోంది.

గౌరి: (పిల్లకు జోలపాడుతుంది-ఏడుపు మాన్పేందుకు)

బం: (బాధతో) హమ్మా - (మెలికెలు తిరుగుతూ) గుండెల్లో మంట.

గౌరి: అసలే తిండిలేదు-(వదినెగుండెలు నవరిస్తుంది.)

బం: పైగా యీపిల్లొకటీ-నా ప్రాణాలు తోడేస్తోంది-అది - చచ్చినా, పీడా వదిలిపోను.

గౌరి: ఛీ-అవేం మాటలొదినా?

బం: (ఏడుపుతో) ఏం చెయ్యనమ్మా - నాగుండె లారిపోతూంటేనూ.

గౌ: (కన్నీరుతో- పమిటెచెంగు నోట కుక్కుకుంటుంది.)

బం: మీ అన్నేమో అయిపూ అంతూ లేరు.

గౌ: ఇంకా కూలిదొరక లేదేమో వదినా.

బం: చిట్టిని గూర్చి పీడకలలుకూడా వస్తున్నయ్... నాకేదో భయంగా వుంది గౌరమ్మ—!

గౌ: నీ కన్నీ అనుమానాలేగానీ-భయ పడకు వదినా-వస్తార్లే.

బం: ఏమో ఏమొస్తారో-నాలుగురోజు లయింది... పేగులు చుట్టలు చుట్టుకుపోతు న్నయ్...(మెలికలు తిరుగుతూంది)

గౌ: (వదినెవీపు నవరిస్తూ) అబ్బా-జ్వరంకూడా వచ్చినట్టుంది... (ఆందోళనతో) ఏం చెయ్యను?!

బం: (మూలుగుతూ) నాలిక - పిడచ గట్టుకు-పోతాంది...ఆః...

గౌ: ధారకం బొత్తిగాలేక... (లేచి) నే నూళ్ళోకెళ్ళి కాసిని గంజన్నా అడుక్కొస్తాను...పిల్లని చూస్తూండొదినా.

బం: తల్లిలేని నీకు...పెళ్ళన్నా చెయ కుండా అన్యాయం-చేశాం...ఆఖరికీ ...నీ కష్టంకూడా...తెనాలిసొచ్చింది.—

గౌ: అలాంటిమాట లనకువదినా... నన్నింత పెంచిన నువ్వు తల్లికంటే ఏం తక్కువా?...వెళ్ళొస్తానూ.

బం: నాకేదో భయంగావుంది...మన కన్నీ-ఎదురౌతున్నాయ్... ఎంతో ఆశతో అమడనడిశొస్తే...పత్రం యూనిసిరి... నువ్వెళ్ళి...ఎక్కడని అడుక్కొస్తావమ్మ ...వద్దు...

గౌరి: ఫరవా లేదు...నా ప్రాణా లమ్మైనా తెస్తానుగా...(దరచరా వెళు తుంది.)

బం: (మూలుగుతూ ంటుంది)

రా: (కాస్సేపటికి ఒంటరిగా ప్రవేశించి, దొంగలాగా చూస్తూంటాడు... చేతిలో నిండుసంచి వుంది.)

బం: (తలెత్తి అటు చూచి) మీరా— వచ్చారూ. (లేస్తుంది)

రా: (ఉదాసీనంగా) ఊఁ...అం తిదిగా వున్నావేం?

బం: గుండెల్లో మంటలు - జ్వరం—

రా: (సంచిలోంచి నాన్‌రొట్టె తీసి, తుంపి యిస్తూ) ఇది తిని, కాసిన్నినీళ్లు తాగు - తగ్గిపోతుంది.

బం: (ఆత్రంగా తీసుకుని నోట్లో కుక్కుకుంటుంది...రెండు గుటకలు వేసే సరికి - కోలి మారుతుంది; మెడ నవరించు కుంటూ - విపరీతంగా దగ్గుతుంది.)

రా: (ప్రక్కనున్న ముంతలోని నీళ్లు యిచ్చి) కోలిమారినట్టుంది - తాగు.

బం: (నీళ్లు తాగి; మళ్లీ రొట్టె కొరుక్కుని, నమలబోతూ - ఆగి) చిట్టి యేదండీ?

రా: (ముఖం నల్లగా అయి, వంచుకుంటాడు.)

బం: ఏమిటండీ? (ఆందోళనతో) ఏమయ్యాడూ - ఏం జేశారు నా బాబుని. (నోట్లో ముక్క పడిపోతుంది)

రా: (ఏడు పొపుకుంటూ) మనలాగా కష్టాలు పడకుండా జేశాను వాణ్ణి.

బం: (ఆశ్చర్య, భయాలతో) ఏమిటి? చంపేశారా?!

రా: లేదు...నా హృదయాన్నే చంపేశాను...వాణ్ణి తిండి తక్కువగానిచోటికంపేశాను.

బం: మీ రనేది నాకు తెలవటంలేదు.

రా: ఒక భాగ్యవంతుడు పెంచుకోడాని కిచ్చేశాను.

బం: ఇచ్చేశారా? ఏంజేశాడనీ-కోపం? (తెల్ల మొఖంతో)

రా: వూరికే యివ్వలేదు - పదిరూపాయల కమ్మాను (ఏడుపు)

బం: ఏమిటీ - అమ్మారా? మీరు - నువ్వు మనిషివేనా? కన్నకొడుకుని అమ్ముకోవటమా?

రా: ఏం చెయ్యను? అంతా కడుపులు కాల్చుకుంటుంటిమి - కూలిపనే దొరకదయ్యె.

బం: అందుకని - లోకువగా వున్నాడని - నా బిడ్డని తిండికోసం అమ్ముతావా? ఎందు కమ్మావ్? (ఆవేశంతో) నువ్వు తండ్రివా?

రా: వాడికి గంజన్నా పోయలేక మాడుతున్నాం - యిట్లా, ఆ యింటనైనా



డాక్టరు-చూడండి అమ్మా! మీరు యిన్నిసార్లు ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నిస్తే, మీ ఆరోగ్యం పాడైపోతుంది. ఆతరువాత ఏమనుకొనీ ప్రయోజనం వుండదు.”

సుఖపడతాడుగదా అనుకున్నాను.

బం: (మీదిమీదికి వెళుతూ) యింకా మాట్లాడుతున్నావా - సిగ్గులేక? నువ్వు కసాయివాడివి.

రా: (తెల్లబోయి, కన్నీళ్ళతో చూస్తూంటాడు.)

బం: కాదు-కసాయివాడే నయం. వాడు గొర్రెలమాంసమే అమ్ముతాడుగాని-నువ్వు కన్నబిడ్డనే అమ్మావ్-రాక్షసుడివి.

రా: కడుపు కాలితే-మనుషులే రాక్షసు లయ్యేది.

బం: ఇహ నాకేమి చెప్పకు...నువ్వు మనిషివి కాదు...ఇక నీకూ నాకూ సంబంధం లేదు-ఫో.

రా: బంగారం! (ఆశ్చర్యంతో)

బం: ఛీ-నీనోటితో నన్ను పిలవకు... నాకొడుకు న్నాకు తెచ్చివ్వు - లేదా, నీ ముఖం చూపించకు.

రా: ఆడబ్బుతో నే యివన్నీ తెచ్చాను. వాళ్ళపాటికి ఏపట్నమో చేరుంటారు... ఎట్లా తేమా చిట్టిని?

బం: [illegible]చ్చిఆవేశంలో సంచిలోవి తీసి పారేస్తూ) నాబిడ్డ నమ్మిన సొమ్ముతో కొన్నవి-నే తినాలా? - తగలబెట్టుకో... బియ్యం అతని నెత్తినబోస్తుంది) నీతలకు

(12-వ పేజీ చూడండి)

ప్రయోజకత్వం

రైలు సరిగ్గా ఆక్కముందే సత్యన్నారాయణ రైలు దిగి, గబగబా ఆడాళ్ల పెట్టె దగ్గరకు పరుగెత్తుకొంటూ వెళ్ళాడు; జయమ్మను, పిల్లాడ్ని దించుకోడానికి. రైలు ప్రయాణం అంటేనే సత్యన్నారాయణకు మాచెడ్డ భయం.

సత్యన్నారాయణ దిగిన స్టేషను 'రోడ్ సైడ్ స్టేషన్' అవడంమూలాన ఓ నిమిషం కంటే యెక్కువసేపు రైలు అక్కడ ఆగదు. అంచేత సత్యం అరగంట ముందు నుంచీ ఆలోచించుకొంటూ వచ్చాడు; తన భార్యను, పిల్లాడ్ని; ఆ సామానంతటినీ దింపుకోడానికి ఆ నియమితకాలం కాస్తా సరిపోతుందా! అని. అదైనా, ఏదో స్వల్పంలో—ఓ పెట్టె, బెడ్డింగు ఐతే అలాగ్గా దించేసికోవచ్చు. జయమ్మ సారెంతా అప్పుడే తెచ్చుకోవడంమూలాన మొత్తం ప్యాకేజీలు యిరవైనాలుక్కి తక్కువగా లేదు.

అంచేతే సత్యం అంతదబ్బున దిగి ఆడాళ్ళ పెట్టెదగ్గరకు వెళ్లాడు.

ఎక్కేవాళ్లు యెక్కరాయె; దిగేవాళ్లు దిగనీయరాయె. అందులో ఆడవాళ్లు. అంచేత వూపిరాడనంత పనైంది, సత్యానికి.

అబ్బాయిని దింపుకోవడం, మూడు సామాన్లు క్రిందకు దించడం జరిగాయి. ఆవకాయ పచ్చడి జాడీలు అసలు బల్లక్రింద నుంచి యివతలకు లాగనైనా లాగలేదు. నేతిచెంబు కనుపించలేదని వెదుక్కొంటుంది, జయ.

సత్యానికి చెమటలు పట్టాయి. అరగంట నుంచి ముందుగా ఆలోచించుకొన్నా, ఆకాస్త టైంలో తాను చేయగలిగింది— మూడు సామాన్లు, శశిని దించుకోవడం. మిగిలిన సామానంతా యింకెప్పుడు దింపుకొంటాడు?

సత్యం ఏమంత మొరటుపనులు చేసిన వాడు కూడా కాదు. అసలే 'అరిపేద' శరీరం...ఆమధ్యన టైఫాయిడ్ జ్వరం పడ్డంవలన బక్కగా 'వక్కినరం'లా తయారయ్యాడు. అసలు చిన్న ట్రంకు దించుకొనేప్పుడే తన చేయి బెణికినంత పనైందాయె.

"ఏవిటి జయా! అలా తచ్చట్లాడుతున్నావ్? త్వరగా సామానందియ్య కూడదా" అన్నాడు, కటువుగా.

సత్యానికి అంత కోపం రావడానిక్కారణం జయాకు తెలుసు. ఐతే, జయా ఏంచేస్తుంది? తను, లోపలేవీ ఆడుకోవడం లేదే. సామానంతా వెదుక్కొంటూ వక్కొక్కటే గుమ్మందగ్గరకు లాక్కొస్తుంది గాని నుంచొని 'సుతరా' లేవైనా చూస్తోంది గనుకనా! అలాంటప్పుడు మరి, తన్నెందుకు కసురుకోవడం? అయినా ఏం చేస్తుంది? కనీసం తన కోపతాపాల్ని ఓ క్షణంసేపు అభినయం చేస్తానికైనా అక్కడ టైం లేకపోవడంవలన "పెద్దపెట్టె అడుగునుంచి, యెంత గట్టిగా లాగినా రావడం లేదండీ" అని జాలిగా చెప్పింది— ముఖం చెమట తుడుచుకొంటూ, ముఖాన్నబడ్డ ముంగురులను పైకి నెట్టుకొంటూ.

శ్రీ పేరాబత్తిని
ఈశ్వరరావు

రైలు పెద్దపెట్టున కూసేసరికి, సత్యం గుండెలు మోకాళ్ళవరకూ జారినంత పనైంది. హృదయస్పందన ఆగింధా; అని, అనిపించింది కూడా. యిహ, ఆ రైలు కాస్తా కదలితే ఏం గాను. తన జయా ఎలా...మరి తన సామాను...!

"త్వరగా అందియ్యి,జయా!"అన్నాడు సత్యం, పచ్చడిజాడీ నందుకొంటూ. ఎంత జాగ్రత్తగా దిసినా ఆ పచ్చడివూట కాస్తా పట్టుమీద, మీద పడింది కూడాను. ఆ మరకలు చూచుకొంటానికి, చింతించడానికి, నిందించడానికీ...టైం లేకపోవడంమూలాన, అసలు ఆ మరకలే చూచుకోలేదు, సరిగ్గా. ఆ కంపార్టుమెంటులోనికి యెక్కాడు,రెండవ పచ్చడిజాడీ తీసికొంటానికి.

ఇంతలో గార్డు విజిల్ 'ఫర్' మని వినిపించింది.

"ఆఁ! బండి కదలిపోతుంది, జయా, త్వరగా దిగు" అని, గాబరాగా, అమాయకంగా అరచాడు, సత్యం; పచ్చడి జాడీని లాగుతూ.

"నే దిగిపోతే సామా నెలాగండీ"

"త్వరగా రా! జయా..." అన్నాడు, జయామీద వున్న అభిమానంకొద్దీ.

ప్లాట్‌ఫారంమీద కుర్రాడు వాళ్ళ నాన్న, అమ్మ కంగారు చూచి 'అమ్మా' అంటూ బావురుమన్నాడు.

"అయ్యో! కుర్రాడు బండిదగ్గరకు వచ్చేస్తున్నాడు" అన్నదో మహాతల్లి, బండిలోంచి.

"అరే! బండికింది పడిపోగలడు, పిల్లాడు. అలా వదిలేశా రేవమ్మా" అని సాగదీసుకొంటుంది, యింకో ముసలి ముత్తయిదువ

"అమ్మోయ్! కుర్రాడు—" జయా అరుపు.

ఇవతలకు నెమ్మదిగా లాగుతున్న పచ్చడి జాడీని సత్యం ఆ అరుపు విని, ఆపాశంగా వదలేశి, వెనక్కి తిరిగి చూశాడు, కంగారుగా. అవతలదూరంగా నుంచొన్న ఆ కుర్రవెధవ ఏడ్చుకొంటూ రైలుదగ్గరకు వస్తున్నాడు—అది గొడవ.

"అరే! శశీ!" అంటూ గబుక్కున యెత్తుకొన్నాడు సత్యం. ఎత్తుకొని నుంచొంటే ఎలా? అప్పటికి దించిన సామానులు నాలుగుపోను యింకా దించవలసిన బరువుసామాన్లు యిరవై అలాగే వున్నయ్. అవి ఏ లాల్ కన్నయ్యగాడు దించుతాడు? జయా ఆ సామానుతో అలా కుస్తీలు పడ్తుంటే తాను పిల్లాడ్ని ఎత్తుకొని 'సుతారాలు' చూస్తుంటే పనెలా ఔతుంది. పోనీ, ఆ ప్లాట్‌ఫారంమీదే మళ్ళా వదలిపెడ్దాం అంటే; ఆ నడక నేర్చిన వెధవ వూరుకొంటాడా!

"పోనీ, ఎవరినైనా ఓ కూలీని పిలిపించ కూడదా" అన్నది జయా.

ప్లీడరీ పరీక్ష ప్యాసైన సత్యన్నారాయణ యీ విలువైన మాటల్లోగల యెత్తిపొడుపు భావాన్ని తేలిగ్గా వూహించుకోగల్గాడు. ఐతే నిజానికి జయా, ఆ మాటలను సత్యాన్ని ఆక్షేపించాలని అన్నదిగాదు. ఏదో సాధారణ ధోరణిలో ఎవరినన్నా కూలీని పిలిపించమంది. ఆ స్టేషన్లో కూలీలెవ్వరూ వుండరని ఆమె కేం తెల్సు.

జయా అవూరయ రావడం అదే మొదటిసారాయె. తాను యీపాటి సామాను దించలేని అసమర్థుడననీ, ఒక పెళ్ళాన్నీ పిల్లాడ్నీ రైలు దింపుకోలేని చవటనీ... అనేక భావాలతో కూడుకొన్న మాటలాగా 'ఆ మాటలు' సత్యంవూహించుకొన్నాడు.

అసలు రైలు యెక్కడమే చాల కంగారుగా జరిగింది. బండియెక్క లేమనుకొన్నారు కూడా.

అత్తగారి అప్పగింతలతో, మరదళ్ళ సరసాలతో, యిచ్చే పసుపుకుంకుమలతో, బావమరుదులు బాబు కిచ్చే బహుమానాలతో, చివరకు రత్తియ్య యెడ్లబండి వలన, ఎంతో ముందుగా వద్దామనుకున్న వాళ్లు, ఎనిమిది నిముషాలు టైం వుందనగా స్టేషను చేరారు.

టిక్కెట్ల క్యూసిష్టం దగ్గర కూనీలు చూచేసరికి సత్యానికి మరింత భయంకల్గింది.

తాను టిక్కెట్లు ఎలా తీగలనా, అని. సరే! తీరా కష్టపడి, తంటాలుపడి ఎలాగైతేనేం టిక్కెట్లు తెస్తే, టిక్కెట్టుమీద అతనికి కనుపించిన ధర ఎనిమిది రూపాయల తొమ్మిది అణాలైతే – తనకు తిరిగియిచ్చిన చేడ ప్రకారం లెక్కచూచుకునేసరికి ఒక్కొక్క టిక్కెట్టు తొమ్మిది రూపాయల పదిహేను అణాలుగా సరిపోవాలి. ఆ టిక్కెట్లమాష్టరు టోకరాయేనని గ్రహించాడు సత్యం. ఐతే సత్యానికి యీ విషయంలో కొట్లాడ్డానికి టైం లేదు. రైలు ప్లాట్ ఫారంమీదకు వచ్చేసింది. యిరవైనాలుగు సామాన్లకూ యింకా కూలివాణ్ని మాట్లాడనేలేదు.

కంగారులో కూలివాళ్ళను పిలచి సామాను యెక్కించమంటే, మర్యాదగా సామానంతా ఎక్కించి, తీరా మూడు రూపాయలు యిస్తే "యిదేవిటి బాబూ" అన్నారు ఏక కంఠంగా, యిచ్చిన రూపాయలను తిరిగి యిచ్చేస్తూ.

"ఐతే మీ వుద్దేశ్యం ఆరు రూపాయలు యివ్వమంటారా" అన్నాడు సత్యం.

"అలా మేం అనాలా బాబూ, మీరు ఏదో కొంచెం కనికారం చూపించాలిగాని."

గార్డు విజిల్ వేశాడు. ఆ కూలీలు మూడురూపాయలు తీసికోవడం లేదు.

ఏది ఎలావున్నా, లోపల్నుంచివచ్చిన జయా మాటలు సత్యం హృదయానికి బల్లెపోట్లులాగా గ్రుచ్చుకొన్నయ్. "ఏదో సరిపెట్టి పంపిద్దురూ!" అని. ఐతే తను సరిపెట్టడం లేదనా? తను డబ్బు యిచ్చే విషయంలో "పిసినారి" అనా? జయా ఉద్దేశ్యం – జయా మాటల్లో అలాంటి అర్థం వ్యంగ్యంగా గోచరిస్తుంది. తన భార్య అలా అన్నదని సత్యం మనసు చిన్నబుచ్చు



కొన్నాడు. ఐతే వచ్చిన చిక్కల్లా ఏటంటే సత్యం తనకోపం ప్రదర్శించడానికి, మారు జవాబు యివ్వడానికి...ఏదీ చేయడానికి టైంలేదు. పోనీ యిదే విషయాన్ని అలా మనస్సులో అట్టే పెట్టుకొని యింటికెళ్లాక సాంతంగా తగువులాడదాం అనుకుంటే, అది అంతగా కొట్లాడవలసిన విషయం ఐనా కాదు. పోనీ, కనీసం 'రిపార్టీ' ఐనా యివ్వడానికి సత్యానికి స్కోప్ లేకపోయింది. సత్యంమాత్రంలోలోన చాలా బాధపడ్డాడు; 'తను కూలిడబ్బులు యివ్వడానికి అంత రాద్ధాంతం చేస్తున్నానా' అని.

ఐదు రూపాయిలనోటు వాళ్ళ చేతిలో పెట్టి 'రూపాయి యివ్వండి' అన్నాడు, సత్యం.

"యింకొ రూపా ఏవిటి బాబూ, రూపాయి మాదగ్గర లేందే"

బండి కదలబోయింది. కదలిందికూడాను. ఐతే సత్యం ఏం చేస్తాడు. "ఏయ్, మీకే

ఫేస్ పౌడర్లు, వాసన తల నూనెలు భారీ ఎత్తున వుత్పత్తి చేసే ఒక పెద్ద ఫ్యాక్టరీ యజమానులు వెనుక ఒకసారి ఒక పోటీ పెట్టారు. తాము తయారుచేసే ఫలాని ఫేస్ పౌడర్ ప్రత్యేకతని ఒక్క ముక్కలో చాటి చెప్పే విధంగా ఏవైనా మంచి మాటలు కూర్చి పెట్టినవారికి పెద్ద మొత్తం బహుమాన మిస్తామనీ పత్రిక లన్నిటిలోనూ ప్రకటనలు వేశారు.

దేశం నలుమూలల నుంచి ఎంద రెందరో రక రకాలైన మకుటాలు వ్రాసి పోటీకి పంపారు. అందులో ఒక్కటి మాత్రం చాలా చమత్కారంగా వుంది. ఆ మకుటం యిది;—

'మా!... ఫేస్ పౌడర్' వాడకపోతే పోయారు కానీ, కనీసం మా'...వాసన తల నూనె' నైనా వుపయోగించండి."

ప్రయోజకత్వం

చెప్పేది. రూపాయి యివ్వండయ్యా" అన్నాడు సత్యం, కొంచెం గట్టిగా.

కూలివాళ్లు సత్యం 'ఉలుసు' చులాగ్గా కనుక్కోగల్గారు. యీ రూపాయి యివ్వక పోయినా సత్యం, చేసేదిలేక బండెక్కుతాడని వాళ్ళ వుద్దేశ్యం. వెధవలు అలాగే చేశారు కూడాను.

రూపాయి మాట అటుంచి జయాకు వాళ్ళాయన బండెక్కలేదన్న కంగారు మరింత యెక్కువైంది. కిటికీలోంచి తొంగి చూస్తూ "పోతేపోయింది వెధవ రూపాయి. త్వరగా బండి ఎక్కండీ" అని అరచింది. యీ మాటలు సత్యం నవనాడులూ కృంగదీశాయ్. ఛా! తను రూపాయికోసం కక్కుర్తిపడి కూలివాళ్ళతో కొట్లాడుచున్నట్లు జయా వుద్దేశ్యమా? ఐతే జయా వుద్దేశ్యంలో తానంత 'పిసినిగొట్టు' అనా? తీరిగ్గా ఆలోచించుదాం అంటే సత్యానికి టైం లేదాయె. బండి కదలిపోవడంవలన గబగబా వెళ్లి ఓ కంపార్టుమెంటు కడ్డీ పుచ్చుకొన్నాడు. వెధవలు, సత్యాన్ని చూసి వాళ్ళందరూ నవ్వుకొన్నారు కూడాను, ఐదు రూపాయల నోటు చూపిస్తూ.

వాళ్ళను చూస్తున్న సత్యం, ఏమీ చేయలేక, కోపాన్నంతా దిగమింగుకొంటూ కంపార్టుమెంటులోకి వెళ్లాడు.

సత్యన్నారాయణ నలుగురిముందూ తాను గొప్పవాడుగా నటించాలనుకొంటాడు. నలుగురూ అతణ్ణి గొప్పవాడనాలని అతని వాంఛ. ఐతే సత్యం తాను యెంత గొప్పవాడని ఋజువుచేయాలనుకొంటాడో, అంత త్వరగా ఫూల్ అవుతూ వుంటాడు కూడాను—ఒక్కొక్కసారి తనకు తెలిసి, ఒక్కొక్కసారి తనకు తెలియకుండాను.

ఇదే విషయాన్ని సత్యం యిప్పుడు తన భార్యముందు ఋజువు చేసుకొన్నాడు.

* * *

ఇప్పుడు సత్యం పరిస్థితి మరింత క్లిష్టంగా తయారైంది. ఒకప్రక్క ఏడుస్తూ పుత్రుడు చంక దిగనంటున్నాడు. రెండవ ప్రక్క యింకా యిరవై సామాన్లు దించాలాయె. 'ఏడిస్తే ఏడ్చా'డని పుత్రవాణ్ణి ప్లాట్‌ఫారంమీద వదల్తుంటే ఏ రెజీ చక్రాల క్రిందకు వచ్చేస్తున్నాడాయె. అలాంటప్పుడు సత్యం ఐనా ఏం చేయగలడు.

గార్డు మళ్ళా విజిల్ వేశాడు.

"త్వరగా దించుకోండెల్లా; బండి కదలిపోతుంది" అని సలహా యిచ్చింది, ఓ పిప్పళ్ళ బస్తాలా కూర్చొన్న యిల్లాలు, సాగదీసుకొంటూ.

సత్యానికి ఆ మాటలు వినేసరికి అరికాలు మంట నెత్తికెక్కింది. నెత్తికెక్కినా సరే, మంటగలిసినాసరే, ఎవరికేం చేస్తాడు. సత్యం పేదవాడు గాకపోయినా 'పేదవాని కోపం' గా పరిణమించింది, సత్యం కోపం.

చేయగల్గింది ఏమీ లేక పోయినా కంగారుమాత్రం కావల్సినంత పడ్తున్న సత్యాన్ని చూస్తున్న జయాకు జాలి బదులు కొంచెం కోపం వచ్చింది, యీసారి. ఏవిటి! వూరికే అలా కంగారుపడ్తాడేగాని, ముందు జరుగవలసిన విషయం చూడడని. జయా తన శాయశక్తులా పైనుంచి సామాను దించడం, సామాను యివతలకు లాగడం, అలా లాగేటప్పుడు మధ్యన కూర్చొన్న వాళ్ళ కాళ్ళకు దెబ్బలు తగుల్తుంటే సర్ది చెప్పటం, క్షమించమని వేడుకోవడం... యిలాంటివన్నీ...తాను చేయవలసినవన్నీ చేస్తూనే వుందాయె.

"అలా చూస్తారేవండీ! బండి కదలిపోతుందేను...ఆ గార్డుకైనా, ఆ మాష్టరుకైనా వెళ్లి చెప్పకూడదూ, కాస్సేపు బండి ఆపమని" అని అందిజయా, విసుగ్గా, కటువుగా – ముఖం చిట్లించుకొని.

నిజమే, యింతవరకూ యీ సంగతి సత్యానికి తట్టనేలేదు. ఐతే తనకు తట్టకపోయినమాట అటుంచి తనకు సలహా చెప్పినందుకు కోపంవచ్చింది; సత్యానికి – చేతగానివానికి చెబితే కోపం, అన్నట్లుగా.

సత్యం యింతవరకూ ఎప్పుడూ రైల్వే మాష్టరుతోగాని గార్డుతోగాని అలామాట్లాడ్లేదు. ఎవరైనా అలా వాళ్ళని బండినిలపమని అడగ్గా వినలేదు కూడాను. అంచేత సత్యానికి పెద్ద సందేహం వచ్చింది. అలా చెప్తే రైలును యింకోనిమిషంపాటు ఆపుతారా! అని...వెంటనే అనుకొన్నాడు. యిది ఏమైనా రత్తయ్య ఎడ్లబండి గనుకనా, అవసరమైనచోటల్లా ఓ అరగంటసేపు నిలవబెట్టడానికి, అలా నిలబెట్టమని అడిగితే తన అమాయకత్వానికి వాళ్ళు నవ్వుతారేమో, అనుకొన్నాడు. అయినా ఆ పరిస్థితుల్లో యిహ అడక్కతప్పదాయె. అడిగినా తన నోటిముత్యాలు ఏవైనా రాలిపోతాయా .. అనుకొన్నాడు. అంచేత గబగబా సత్యం గార్డు దగ్గరకు పరుగెత్తుకెళ్ళి "ఓ నిమిషంసేపు చేయండి, సామానదించుకోవాలి" అని అనేశాడు. బిక్కుబిక్కు మంటూనే.

"యిందాకట్నుంచీ ఏంచేస్తున్నారు. అన్నాడు, గార్డు.

"*Thanks*' అంటూ అడ్డోళ్ళపెట్టిదరకు పరుగెత్తాడు, సత్యం.

రైలు 'కూ' మంది. గార్డు ఎర్రజెండా మూపిస్తున్నాడు. అంచేత సత్యానికి ధైర్యంవచ్చింది. ధైర్యంతో పాటు కొంచెం బలంకూడావచ్చింది. తనసామాన దించుకొనేవరకూ రైలు ఆగివుంటవన్న నమ్మకం గల్గింది, సత్యానికి.

"త్వరగా అందియ్యి, జయా! గార్డుతో చెప్పాను, ఆపాడు" అన్నాడు సత్యం, సగర్వంగా, తాను చేసొచ్చిన పనికిగాను.

ప్రక్కన ప్లాట్ ఫారంమీద నిలచొన్న యిద్దరు మనుషుల్ని పిలచి "త్వరగా ఆసామాను దించండిరా" అని చెప్పాడు ఆ స్టేషనుమాష్టరు, వెంటనే వాళ్ళు రావడం మూలాన రెండునిమిషాల్లో సామానంతా దిగిపోయింది.

గార్డు పచ్చజండా చూపాడు. బండి కదలింది.

"ఇష్! అబ్బా. అన్నాడు." సత్యం. పెద్ద నిట్టూర్పు విడుస్తూ. అక్కడికే సత్యం కాళ్ళు, చేతులు వణుకుచునే వున్నయ్. ఇంకా గాభరా పూర్తిగా తగ్గలేదు. షర్టు, పంట్లాం అంతా తడిసిపోయింది. ముందంతా పచ్చడి మరకలు, ముఖమంతా కందిపోయింది. తలంతా చెదరిపోయింది, పెట్టెలు గీచుకు పోవడం వల్ల చేతుల మీద గీతలుకూడా పడ్డయ్. జయాకు చీర...అంతా నలిగిపోయింది. కూడాను పైనుంచి పెట్టెలు ఛాతీ మీదకు దించుకొందేమో! ఛాతీ అంతా పెట్టెల క్రొత్తరంగు, దుమ్ముఅంటుకొంది. జాకెట్టు చిరిగిందికూడాను. పాపం వగురుస్తూ, పమిటితో ముఖంతుడుచుకొంటూ, నుదుటికి కట్టిన బొప్పె చూచుకొంటూంది.

"సామానులన్నీ సరిగ్గా వున్నయ్యా' అన్నాడు సత్యం, అప్పటికే సత్యాన్ని చూస్తుంటే జయా వళ్ళుమండుకుపోతుండడంవల్ల "ఏమో! చూచుకోండి! నే లెక్క పెట్టానా" అని జవాబు యిచ్చింది, కటువుగా; శశిబాబును చంక నెత్తుకొంటూ.

జయాకు తనమీద కోపంగా వుందని సత్యం గమనించాడు. జయామీద సత్యానికూడా చాలా కోపంగా వుంది. కాని, ఒకరి కోపం వకరు వెళ్లబుచ్చుకోడానికి వ్యవధి లేకపోవడంవల్ల "కుర్రాడికి యెండ తగుల్తుంది, నీడలోకి తీసికెళ్లు......నే సామాను లెక్క పెట్టుకొంటాలే" అన్నాడు సత్యం.

జయ మాట్లాడేదు. 'ఏమన్నా తగలెట్టుకోండి' అని మనస్సులో అనుకొని 'పద బాబూ, కాళ్లు కాలిపోతున్నయ్' అని స్టేషన్ వరండాలోకి వెళ్లింది, జయా.

'కాళ్లు కాల్తున్నయ్' అనేసరికి సత్యం జయా కాళ్ళవంక చూశాడు. జయా కాళ్లకు చెప్పుల్లేవు. "జయా! నీ చెప్పు లేవీ?" అన్నాడు ప్రశ్నార్థకంగా.

"ఎక్కడో పోయాయ్. కంగారులో బండిలో వదిలేశాను కాబోలు" అని జవాబిచ్చింది, జయా, కోపంగా...వుడుకు మోత్తనంతో.

"ఐతే చెప్పులు పోయా యన్నమాట" అన్నాడు, సత్యం.

"అన్నమా లేమిటి? అదిగో; ఆ పోయే బండిలోనే పోతున్నయ్" అని జవాబిచ్చింది, వెటకారంగా.

సత్యం మళ్లా ప్రశ్నించలేదు. యిక మాట్లాడకుండా సామాను లెక్క పెట్టుకొంటున్నాడు. సరిగ్గా అన్నీ దించుకున్నాడో లేదో, అని.

సత్యం ఎంతసేపు లెక్క పెట్టుకొన్నా

★ ప్రయోజకత్వం ★

లెక్కకు రెండు సామాన్లు తక్కువ వస్తున్నయ్. కనీసం ఒక అర డజనుసార్లు లెక్క బెట్టాడు. అప్పటికీ సామాన్లు యిరవైరెండే వుంటున్నయ్. జయాను అడుగుదాం అనుకొన్నాడు సత్యం. జయా తీరా వచ్చి సరిగ్గా లెక్క చూపిస్తే ఆవిడ ముందు తన సిగ్గు పోతుందన్న భయంచేత, అడక్కుండానే మళ్ళా లెక్క బెడుతున్నాడు.

సత్యానికి యెప్పుడో B. A. లో చదివిన *calculus* లో కష్టతరమైన *Integration Models* యిప్పటికీ జ్ఞాపకం వున్నయ్ గాని, జయా వెంబడివున్న సామాన్లు ఏవిటో అతనికి జ్ఞాపకంలేవు. సత్యానికి జ్ఞాపకం వుండల్లా అవి యిరవైనాలుగు సామానులే గాని, అవి ఏవేవో తెలియదు. సామాన్లు మాత్రం చూస్తుంటె అన్నీ వున్నట్లుగానే వున్నయ్; మరి సంఖ్యకు రెండు తక్కువ వస్తున్నయ్యే! అని, సత్యం మళ్ళా, మళ్ళా అతిశ్రద్ధగా లెక్క బెడుతున్నాడు.

దూరాన్నుంచి సత్యాన్ని చూస్తున్న జయా "ఏవిటి? లెక్క సరిపోలేదా?" అని పలుకరించింది.

"ఆఁ! లేదు. యిరవైరెండే వున్నట్లున్నయ్" అన్నాడు, కొంచెం నెమ్మదిగా, అక్కడికీ అనుమానంగానే, తనే తప్పులెక్క బెడుతున్నాడేమో, నని.

"ఐతే సరిపోయినట్లే"

"ఎలా? యిరవైనాలుగు వుండాలిగదూ"

"మరచెంబులో నీళ్ళు లేవని పెట్టెలో పెట్టేశాను. Hand Bag బెడ్డింగ్‌లో చుట్టేశాను..సరిపోయాయిలెండి. కంగారు పడకండి"

అసలే ముక్కిడి, అందులో పడిశెం అన్నట్లుగా రుసరుసలాడుకొంటున్న సత్యానికి యీ చివరి మాటలు వినేసరికి వళ్ళు మండింది. చెప్పిందేదో సరిగా చెప్పక 'మరచెంబులో నీళ్ళు లేవని' *stress* చేయడం—తాను నీళ్ళు తెచ్చి యివ్వలేదనేగా! అదీగాక, కంగారు పడకండి, అని, చివర వూతపదం కలపడం ఎందుకో?

జయా యిలా మాట్లాడుతుంటే సత్యానికి చాలాకోసం వచ్చింది. ఐతే, సత్యం తనకోపాన్ని ప్రదర్శించి 'అలక' అలగడానికీ, అప్పుడు జయా తన కోపతాపాల్ని వుపశమనం చేయడానికీ సముంజసమైన పరిస్థితుల్లో లేవు ప్రస్తుత వ్యవహారాలు. గట్టిగా పలుకరిస్తే 'కయ్'మనేంత విసుగ్గా వుండాయె, జయా. అలాటప్పుడు, యిహ, తన కోపాన్ని యింకెవరిమీదా [illegible]

కొన్నాడు, అమాయకుడు.

"ఓహో! మరచెంబూ, Hand Bag తో కలిపి యిరవైనాలుగన్నమాట" అన్నాడు, మళ్ళా పలుకరిద్దామని.

"అన్నమాటేవిటి? అంతే" అన్నది జయా! ముక్తసరిగా. ఆ మాటకు జయాను కసురుకుందాం అనుకున్నాడు. 'అంతే' అనిజవాబిస్తే సరిపోదూ! 'అన్నమాటేవిటి? అంతే' అని పెద్ద *Logical* గా రుసరుసలాడుకొంటూ జవాబివ్వడం దేనికీ?...

'ఎందుకే అంత విసుగుదల' అని అనాలనుకున్నాడు, సత్యం. అనవలసినమాటను రెండుసార్లు మనస్సులో మననం చేసికొనే అలవాటుగనుక, అలా అనుకొని 'ఎం...' అనబోతుంటేనే వెనకనుంచి స్టేషన్ మాష్టరు పిలిచాడు ఏమండీ, యీ సామాను *Book* చేశారా' అని.

"లేదే!"

"ఐతే దీనికి *Penalty*, *Pay* చేయవల్సొంటుంది"

"ఏవన్నారూ?"

"యీ లగేజీకి పెనాల్టీ పే చెయ్యాలండి."

ఎక్కువసామానుతెస్తే *Penalty Pay* చేయాలన్న విషయం సత్యానికి కొద్దో, గొప్పో తెలుసు, ఐతే, ఏదో చూచీ చూడనట్లు వూరుకొంటారనుకొన్నాడు గాని, పరిస్థితులు యింతవరకు వస్తయ్ అనుకోలేదు, సత్యం.

పెనాల్టీ విషయం ఆడగ్గానే సత్యం అనుకోకుండానే జయావైపు చూశాడు. ఐతే, జయా ఆయన వైపు చూడ్డంలేదు. పెట్టె పట్టుకొని చిరిగిన జాకెట్టు చిరుగు విషయంలో ఏవో జాగ్రత్తలు పడుతోంది.

సత్యానికి తన వెంబడి యింతసామాను తీసికొనిరావడం యిష్టమే లేదు. ఐతే, అయిష్టం అనికూడా కాదు. ఎప్పటికైనా సారె తీసికెళ్ళక తప్పదాయె. రైలుప్రయాణంలో కష్టంగా వుంటుందని అత్తారు యిచ్చినసారెను, యెంతటివెంగళాయి ఐనా వదలుకొంటాడా? మరీ పెద్ద పెద్ద పందిరమంచాలు, బీరువాలు...ఐతే గూడ్సులోనే *Book* చేశేవాడు. ఇవి అంత పెద్దవికూడా గాదు. వంటపాత్రలూ, ట్రంకుపెట్టెలూ...వగైరాలు.

అదీ సత్యం 'పట్టా' పుచ్చుకొని రెండేళ్ళునిండడం మూలాన యిక ప్రాక్టీసు పెడ్దాం అనుకొంటున్నాడు. అలాంటప్పుడు వేరే సంసారంకూడా పెట్టవలసి వస్తుందిగనుక...సంసారానికి తగట్లు కొద్దో, గొప్పో గిన్నెలూ, కంచాలూ వుండాలి గనుక...తీసికెళ్ళడం

కష్టం అని తెలిసినా 'సరే! తీసికెళ్తాన'నక తప్పిందిగాదు.

"ఎంత ఛార్జీ కట్టాలండీ" అన్నాడు, సత్యం, అతి వినయంగా.

"ఛార్జీ, సామాను బరువునుబట్టి వుంటుంది. ముందు మీ టిక్కెట్లు యివ్వండి" అన్నాడు, మాష్టరు.

సత్యం రెండు టిక్కెట్లూ యిచ్చాడు. మాష్టరు 'యింకా' అన్నాడు.

"యింకేవిటి ? మే మిద్దర మేగా."

"మరి ఆ కుర్రవాడికి"

"ఏ కుర్రవాడికి" అన్నాడు సత్యం, సీరియస్‌గా.

"ఆవిడ యెత్తుకున్న అబ్బాయికి" అని చూపించాడు జయావైపు, ఆ స్టేషను మాష్టరు.

"ఆ అబ్బాయికి టిక్కెట్టు యెందుకండి? యింతవర కెప్పుడూ తీసికోలేదే."

"యింతవరకు యెప్పుడూ తీసికోకపోవడం మూలానే" అన్నాడు మాష్టరు, ముక్తసరిగా.

"అదిగాదండీ! మొన్ననే మూడో సంవత్సరం వచ్చింది. యింతవరకు యెవ్వరూ ఆ కుర్రాడికి టిక్కెట్టే అడగలేదు."

"మూడు సంవత్సరాలు...అదంతా అనవసరం. మీకంత ఆక్షేపణగావుంటే అఫీషియల్‌గా రిపోర్టుచేయండి. సమంజసం అని తోస్తే వాళ్లే *Refund* చేస్తారు. లోనికి రండి, డబ్బు చెల్లించాలి" అన్నాడు ఆ మాష్టరు, మొహమాటం ఏమాత్రం లేకుండా.

నమిలి మింగేద్దామా అనుకున్నాడు సత్యం, ఆ మాష్టర్ని.

కుర్రాడికి డబుల్ ఛార్జీగా ఎనిమిది రూపాయిల తొమ్మిది అణాలు, లగేజీకిగాను ఎనిమిదీ పదణాలు అయిందని రెండు రసీదులూ బల్లమీద పెట్టాడు. మొత్తం 17-3-0 అయింది.

బల్లమీద రెండు రసీదులూ సత్యం చూశాడు. అతని కేమీ అర్థం గాలేదు. అర్థం గాకపోవడాన్కి అందులో విచిత్రమైన దేమీలేదు కూడాను. కుర్రవాడికి డబుల్ ఛార్జీ - ఎక్సెస్ లగేజిఛార్జీ.. రెండూ తెలిసినవేగా! సత్యానికి అర్థంగాని విషయం అది కాదన్నమాట. ఈ 17-3-0 ఎలా చెల్లించుకోవాలీ; అనే విషయం.

సత్యందగ్గర ప్రస్తుతానికి యిరవై రూపాయ లున్నయ్. 'ఖర్చులన్నీ పోను రైలుదిగేటప్పటికి చేతిలో యిరవై రూపాయిలు చాలవా!' అనుకున్నాడేగాని యీలా తలవని తలంపుగా ఖర్చు తగుల్తుందని అతని కేం తెల్సు? ఈ ఖర్చే లేకపోతే యింకా సత్యానికి ఖర్చేముంది గనుక! బస్సు ఛార్జీ, కూలీలు ఓ 10/- పోయినా యింకా ఓ పదిరూపాయలు మిగుల్తయ్ అనుకొన్నాడు. రెండో విషయం రైలు ప్రయాణంలో "ఎక్కువ తక్కువగా" దగ్గర డబ్బుంచుకోవడం సత్యానికి యిష్టం లేదు కూడాను. "కీడెంచి మేలెంచమన్నా ర"న్న పెద్దల మాటగానే, ఖర్చులన్నీ లెక్క చూచుకొని ఓ పదిరూపాయలు ఎక్కువే తెచ్చుకున్నాడాయె - యిప్పుడు సత్యం పదిహేడు రూపాయిల చిల్లరా యిచ్చేస్తే, యిహ స్టేషన్‌నుంచి బస్సు దగ్గరికి వెళ్ళడానికే 'భత్తాలు' మిగలవు. ఏం చేయాలో ఎటూ తోచడంలేదు. పాపం! సత్యం పరిస్థితి ఎలా వచ్చిందో చూడండి.

అప్పటికే వంటిగంట దాటింది. మే నెల అవడం మూలాన గాల్పు విపరీతంగా కొడ్తోంది. ఎండ నిప్పులు చెరుగుతున్నట్టే—కుర్రవాడు ఆకలికి ఏడుస్తున్నాడు. సత్యానిక్కూడా చాలా ఆకలి వేస్తోంది. పుదయంనుంచీ సత్యం ఫలహారమే దీసికోలేదు. బహుశా జయాకూడా అలాగేవుండి వుండొచ్చు అనుకున్నాడు.

జయాను తలచుకొనేసరికి సత్యానికి చాలా సిగ్గేసింది. హాల్లో బల్లమీద కూర్చొంది జయా. జయకు యీ సంగతంతా చెబితే ఏమనుకొంటుంది. ఏమనుకొంటుందేవిటి ? ఎవరైనా ఏంచేయగలరు, గనుక.

ఐనా ! ఏవిటో ? సత్యం దొంగతనం చేసిన చిన్నపిల్లాడికి మల్లే భయపడ్డాడు, జయకు యీ సంగతి చెప్పడానికి.

"ఏవిటండీ ! మాష్టరుగారూ ! చివరకు యిలాచేశారు." అన్నాడు సత్యం, తన కోపాన్నంతా ఆరెండు ముక్కల్లోనే తీర్చుకొంటూ.

I am సారీ ! నన్నేం చేయమంటారు" అన్నాడు, ఆ మాష్టరు.

యిహ చేసేది లేక రెండు పదులూ బల్లమీదపెట్టి రసీదులూ, 2-13-0 తీసికొని బయటపడ్డాడు.

"చివరకు ఏంచేసుకొచ్చారూ ? అర్థగంటనుంచైనా ఆ రాద్ధాంతం తెగలేదా?" అన్నది జయా, విసుగ్గా.

"ఏం చేశాడూ ! డబుల్ ఛార్జిచేశాడు; సామానుకి, కుర్రాడికీ, కూడా"

"ఆఁ!" అన్నది జయా తెల్లబోతూ.

"వెధవపని తరువాత-రిపోర్టు చేద్దాంలే" అన్నాడు సత్యం, తానేదో ముందు వుద్ధరించేటట్లుగా.

"తరువాత రిపోర్టు ఏవిటండీ ! అక్కడే దబాయించకపోయారూ ! కుర్రాడికి టిక్కెట్టు అవసరంలేదని, నాలుగు 'లా' సెక్షన్లు మాట్లాడితే వాడే నోరు మూసుకునేవాడుగా.

ప్రయోజకత్వం

"ఎంత దబాయించినా వీలు లేక పోయింది"

"అవును; మీరు ఎక్కడికెళ్లినా, వీలూ వుండదు, చాలూ వుండదు - లాభంఅసలే వుండదు....సరే! యింతకీ ఎంత చెల్లించారు?"

జయానోటినుంచి వచ్చే ఒక్కొక్క మాటా అంకుశంపోటులాగా తగుల్తోంది సత్యానికి. "మీరెక్కడికెళ్లినా లాభం వుండదు" అనేమాటలు నిజంగానే కనుపించాయి, సత్యానికి. నిజానికి తనుప్రయాణంలో చేసిన ప్రతిపనీ నష్టమే! టిక్కట్ల దగ్గర్నుంచి, లైసన్సుకూ లీలవరకు... తానుచేసిన ప్రతిపనీనష్టమే - "ఛీ! ఎందుకొచ్చినబ్రతుకు...పెళ్లాన్ని పుట్టింటి దగ్గర్నుంచి సరిగ్గా, సుఖంగా తీసుకు రాలేకపోయాక" అనుకొన్నాడు సత్యం.

తన అమాయకత్వాన్ని తానే బయట పెట్టుకోలేక కాసేపు తనలోనే తాను కుములుకొని పూరుకున్నాడు, సత్యం.

"ఐతే ఎంత చెల్లించారు?" అనే మాటకు జయాకు జవాబు చెప్పనా, వద్దా అని సత్యం చాలా ఆలోచించాడు. జయాకు యీ విషయం చెప్పకపోతే డబ్బు విషయంలో ముందుగడవ్వలసిన విధం ఎలా? తన దగ్గర వున్నది రెండు రూపాయిల చిల్లరమాత్రమే. మిగిలిన ప్రయాణానికి ఏమూలకు సరిపోతుందని.

ఈ విషయం తలచుకొనేసరికి సత్యానికి మరింత దిగులు కల్గించింది. సత్యం యింటికి చేరాలంటే కనీసం పదిహేను రూపాయలైనా వుండాలి. మరిప్పుడు ఆ పదిహేను రూపాయిలు ఎలా తేగలడు?

జయాదగ్గ రేమైనా డబ్బున్నదేమోనని అడుగుదాం అనుకొన్నాడు, సత్యం. జయాకు తానేమైనా దాచిపెట్టమని డబ్బు యిచ్చాడు గనుకనా, నోరు తెరచుకొని అడగడానికైనా. తీరా అడిగితే నాదగ్గ రేమైనా దాచిపెట్టారా అంటే, సత్యం ప్రాణాని కెలా వుంటయ్, ఆ మాటలు?

సత్యానికి యిపుడు ఎలా యింటికి చేరుకోవాలనేది ఒక పెద్దసమస్య. అయింది. సత్యానికేగాదు - ఎటువంటి వారైనా అలాంటి పరిస్థితుల్లో చాలా బాధపడ్తారు. చివరకు ఏడ్వవలసినంత పనైంది. ఎంత ఏడ్చినావున్న రెండూ, యిరవై రూపాయిలుగా మార్తాయా?

ఏమైనాసరే, జయాకు చెప్పుకోవల్సిందేనని అనుకొన్నాడు, సత్యం - "17-3-0 ఛార్జీ తీసికొన్నాడు" అన్నాడు సత్యం, గుటకలు మ్రింగుతూ; తలవంచుకొని - ముఖం చూపించడానికి సిగ్గైందేమో!

"ఐతే మీదగ్గర యింకెంత మిగిలింది?"

"రెండు రూపాయిల చిల్లర" అన్నాడు నీరసంగా.

"మరి, మిగిలిన ఖర్చులెలా?" అన్నది జయా, ఆశ్చర్యంగా, గాభరాగా.

చెమటలుపట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ "అదే నేను ఆలోచిస్తున్నాను" అని జవాబిచ్చాడు సత్యం; జయా కళ్ళల్లోకి అమాయకంగా చూస్తూ.

వారిద్దరిమధ్యా కొన్ని నిమిషాలు మౌనంగా గడిచాయి.

"ఎలాగండీ మన ప్రయాణం, మరి." జయా అడిగింది, సానుభూతిగా, సత్యాన్ని ...యీ కష్టాల్లో తనుకూడా పాల్గొంటున్నట్లుగా.

"అదే నేనూ ఆలోచిస్తున్నా. నాకేమీ పాల్పడ్డంలేదు...నీదగ్గ రేమైనా డబ్బుందా" అన్నాడు సత్యం, తలవంచుకుని, జయా ఏం జవాబు చెప్తుందో, అని.

"మీ రిచ్చారా? నాకు దాచిపెట్టమని"

"యివ్వలేదులే, జయా! ఏదో అడిగాను...మరేం చేస్తాం?..."

"నా డబ్బు, నా ముఖమూను? నాదగ్గరేంవుంటుంది. అందరూ, వచ్చేటప్పుడు అబ్బాయిచేతిలో పెట్టిన డబ్బులు మట్టుకు వున్నయ్."

"ఐతే పిన్నిగారూ! మీ అమ్మాయి కొత్తగా కాపరానికి వెళ్లినట్లుంది. మొగుడు మంచి వాడేనా?"

"ఆ! బుద్ధిమంతుడమ్మా! మా అమ్మాయి వొళ్లు అలవనీయకుండా నీళ్లు తానే తోడి తెచ్చి యింట్లో పోస్తాడు. అమ్మాయి నిద్దర లేచేసరికి కాఫీ కాచి పెట్టుతాడు. దాని చీరెలు, జాకెట్లు అన్నీ జాబితాలు వ్రాసి చాకలి పాపుకు పట్టుకుపోయి వేసి వస్తాడమ్మా!"

"అయితే - మీ కోడలు పుట్టింటి నుంచీ వచ్చినట్లుంది; మీ అబ్బాయి ఎలా వున్నాడు?"

"వాడి సంగతి అడగకమ్మా పిల్లవాడిపాత్తిగుడ్డలు దగ్గరనుంచీ అన్నీ వాడే వుతుకుతూ వుంటాడు. అస్తమానం ఆ పెళ్లాంగారి సేవే కాని, వాడికి యింకో విషయం పట్టుతుందా?"

"ఎంతుంది" అన్నాడు సత్యం, ఆశగా జవాబుకోసం యెదురుచూస్తూ.

"యిరవైరెండున్నర, లెక్క తేలింది" శశిబాబు". సత్యానికి కొంత ధైర్యం వచ్చింది. "బ్రతికానురా బాబూ, ఎలాగైనా గూటికి చేరుకోవచ్చు"అని.

"శశీ! యింటికి వెళ్లాక నీకు రెట్టింపు డబ్బుయిస్తాలేవోయ్" అన్నాడు. సత్యం, శని చూస్తూ.

"యిచ్చాగ్లెండి, ప్రజ్ఞావంతులు" అంటూ, తెచ్చిచ్చింది, ఆ సొమ్మంతా, జయా.

సత్యానికి మళ్లా కోపంవచ్చింది. తాను ప్రజ్ఞావంతుడు కాదనా, అని. ఐతే పరిస్థితులు అనుకూలంగా లేనందున సత్యం మరుజవాబు యివ్వలేదు.

* * *

రెండెడ్లబండి కట్టించుకొని 'బస్సు స్టాప్'దగ్గరకు వెళ్ళేసరికి సాయంత్రం మూడుగంట లయింది. అది బస్సు స్టాపు అనడానికి ఆధారం ఆ బోర్డు స్తంభమూ, ఓ వేపచెట్టూతప్ప యింకేవీ లేవు, అక్కడ.

అరటికెట్టు, లగ్గేజీ గొడవవలన అందుకోవలసిన బస్సు కాస్తా రెండు గంటలకే పోయింది. అంచేత సత్యం వాళ్లు అయిదు గంటలవరకూ కూర్చోవాలి, మళ్లీ బస్సుకోసం

బస్సుకోసం సత్యం, జయా, శశీ. సామాను పేర్చుకొని కూర్చొన్నారు, వేపచెట్టుక్రింద.

* * *

'నాకు కళ్లు తిరుగుతున్నయ్యండీ' అంది, జయా, నీరసంగా. పాపం జయా చాలా అలసిపోయింది. అందులో యెండమండిపోతోందాయె - వడగాల్పు, తిండీ లేదు, నాలుకలు పిడచగట్టుకుపోతున్నయ్. మరచెంబులో నీళ్లు లేవు. కుర్రవాడు అప్పటికే అలసిపోయి, వడగాల్పు తగిలి, జయావళ్లో నిద్రపోతున్నాడు.

"నాకూ అలాగే వుంది జయా! ఏం చేస్తాం, కాస్త ఓపికపట్టు" అన్నాడు సత్యం, చేసేది ఏమీ లేక.

సత్యం తాను చచ్చిపోతే బాగుండు ననుకొన్నాడు. తనంత అసమర్థుడు ప్రపంచంలో యింకెవ్వరూ వుండరని కూడా అనుకొన్నాడు.

ఖాళీగా చెట్టుక్రింద కూర్చున్న సత్యానికి తాను ప్రయాణంలో అనుభవించిన ప్రతిఘట్టం, తనను వెక్కిరించినట్లుగా జ్ఞాపకం రావడం మొదలుపెట్టాయి. జయాకు తాను చాల ప్రజ్ఞావంతుడననీ, గొప్పవాడననీ చెప్పుకొన్నాడు. జయాకూడా అలాగే అనుకొంది - తనభర్త వెంబడి చక్కగా, హాయిగా ప్రయాణం చేయగలననీ; చదువుకొన్నవాడు, అనుభవశాలి అయిన తన భర్త ఎంతో సుఖంగా తనకే మీ కష్టం లేకుండా తీసికొస్తాడనీ అనుకొంది, జయా. సత్యంకూడా తన ప్రయాణం విషయంలో జయా ఎంతో మెచ్చుకొనేటట్లు చేయాలనుకున్నాడు. ఐతే ప్రతివిషయం ఎగురువేసి కూర్చొంది. ప్రతివిషయం తన అసమర్థతను బుజువుచేసింది. ప్రతి సన్నివేశం సత్యం నిత్యజీవితంలో ఏ పనికీ పనికిరాడని నిరూపించినట్లుగా చేశాయి. చివరకు తన కుర్రాడికి "చేతులో పెట్టిన" డబ్బులకు కూడా జయాదగ్గర ప్రాధేయపడ్డాడు.

ఇవన్నీ తలచుకొన్న సత్యానికి కళ్ళనిండా నీళ్ళు నిండాయి. ఈ ప్రపంచంలో తనంతటి అప్రయోజకుడింకెవ్వడూ వుండడనుకొన్నాడు; సత్యం. జయాకూడా తనను అలాంటివాడే అని, అనుకొని తీరుతుందని అనుకొన్నాడు కూడా.

* * *

రోడ్డున పోతున్న రెండెడ్ల బండివాళ్లు వేపచెట్టుక్రింద బస్సుకోసం ఎదురుచూస్తున్న సత్యం, వాళ్ళనుచూచి "ఐదో మైలురాయిదగ్గర మీ బస్సు యింజను పాడైపోయింది. అక్కడ కూచొని బాగు చేసికొంటున్నారు.-రాత్రివరకూ రాదట" అని చెప్పిపోయారు, చల్లగా...వెళ్ళేవాళ్లు వెళ్తూ.

జయా నీరసంగా సత్యంవంక చూచింది. సత్యం కళ్ళనిండా నీళ్లునిండి చెంపల మీదకు జారుతున్నయ్.

"ఛా! అదేమిటండీ, అలా దిగాలు పడతాం!" అంది, జయా. ★

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

46

భర్తకు మరణశిక్ష అన్నమాటలు చెవులబడగానే లూసీ మొదలు నరికిన చెట్టులా తండ్రి పాదాలముందు కూలబడిపోయింది. ఆయన మతిచెడి జుట్టులోకి వ్రేళ్ళుపోనిచ్చి చిరాగ్గా పీకేసుకుంటున్నాడు. లారీ ప్రక్కనే నిల్చున్నాడు గాని యే ప్రపంచంలో వున్నదీ తెలియని అయోమయావస్థలో వున్నాడు.

వీధిలో జరుగుతున్న ప్రదర్శనాలలో పాల్గొనవలసివున్న తొందరలో కోర్టువారు అప్పటితో విచారణలు ముగించి బయటికి వెళ్లిపోయారు. వారితోపాటు కోర్టు హాలులోవున్న జనమంతా కూడా బెలబెలా బయటికి వెళ్లిపోయారు.

అంతవరదాకా కోర్టు హాలు చివరలో చిత్రిత ప్రతిమలా నిలచివున్న సిడ్నీ కార్టన్ గబగబా కదిలి లూసీ పడివున్న స్థలానికి వచ్చాడు. క్రిందపడివున్న లూసీని పసిబిడ్డను ఎత్తుకున్నట్టు చేతులలోకి యెత్తుకుని హృదయానికి హత్తుకున్నాడు; అతని ముఖంలో దైన్యమూ, జాలీకంటే, అదొక విధమైన ఆత్మవిశ్వాసం కలువల కెంపులుగా వికసించుతోంది. "బండి దగ్గిరికి తీసుకు వస్తాను రండి" అంటూ ముందుకు నడిచాడు.

కోర్టు గుమ్మంలో నిలబెటివున్న గుర్రపు బగ్గీలో లూసీని తీసుకుపోయి పడుకోబెట్టాడు. డాక్టర్ మానెట్, లారీ యిద్దరూ కూడా బండిలోకి యెక్కి లూసీకి చెరోవైపునా కూర్చున్నారు. కార్టన్ ముందు సీటులోకి పోయి బండితోలేవాడి పక్కనే కూర్చున్నాడు.

ఇంటిగేటుముందుకు చేరినవెంటనే తానే ముందుగా బండి దిగి లూసీని మళ్ళీ ఎత్తుకొని మేడమీదిగదిలోకి తీసుకుపోయి పడుకోబెట్టాడు. తల్లిని చూడగానే లూసీబిడ్డా, మిస్ ప్రాస్ యిద్దరూ ఆవిడమీద పడి గగ్గోలుగా యేడిచారు.

కార్టన్ వాళ్ళిద్దర్నీ మందలించాడు: 'ఏడవకండి; ఆవిడ వెంటనే స్పృహలోకి రావటం మంచిదిగాదు. కొంతసేపు అలాగే వుండనివ్వండి.'

'కార్టన్ బాబాయ్!'—అంటూ చిట్టితల్లి కార్టన్ మెడకు పెనవేసుకుని పేగులు తెగక్కుపోయేట్టు యేడ్చింది:

'ఫరవాలేదు తల్లీ! నేనున్నాగా—అమ్మకేమీ ఫరవాలేదు' ఏడవకు అని బుజ్జగించి బుగ్గ ముద్దెట్టుకున్నాడు. నెమ్మదిగా లాలించి క్రింద దింపి, అవతలి గదిలోకి నడిచాడు. డాక్టరూ లారీ, ఇద్దరూ కూడా ఆయన్ను అనుసరించి లోపలికి నడిచారు. గదిలోకి ప్రవేశించీ ప్రవేశించటమే కార్టన్ గిరుక్కున వెనక్కు తిరిగి:

'డాక్టర్ గారూ! నిన్న సాయంత్రంవరకూ మీకు యెంతో బలమైన పలుకుబడి వుంది. మళ్ళా ఒకసారి యెందుకు ప్రయత్నించకూడదూ? ఈ న్యాయాధిపతులూ, ఈ దేశభక్తులూ, వీళ్ళందరూ మీపట్ల యెంతో సానుభూతి వున్నవాళ్లేగదా?'

'చార్లెస్ విషయంలో వాళ్లు నాదగ్గిరేమీ మరుగుపర్చలేదు—అతనికేమీ ప్రమాదం రాదని వాళ్ళంతా నాకు హామీ లిచ్చిన వాళ్లే—అలా జరిగింది కూడా—కాని మళ్ళా...'

'అవును—మళ్లా యెందుకు ప్రయత్నించకూడదు. రేపు మధ్యాహ్నందాకా వ్యవధి వున్నదిగదా?'—

'తప్పకుండా ప్రయత్నించుతాను—ఒక్క క్షణం కూడా వ్యర్థం కాకుండా సకల శక్తులా ప్రయత్నించితీరుతాను—ఇప్పుడే బయలుదేరి పబ్లిక్ ప్రాసిక్యూటర్ను చూస్తాను; ప్రధాన న్యాయమూర్తిని కూడా చూస్తాను—ఇంకా చూడవలసినవాళ్లు కొందరున్నారులే—యిప్పుడు వాళ్ళ పేర్లన్నీ యెందుకు? అందర్నీ కలుసుకుని మాట్లాడతాను—ఆహా!—ఆగండి—అయితే ఒక చిక్కు—ఈ వేళ ఊరంతా ఉత్సవాలు జరుగుతున్నయ్. చీకటిబడితేనేగాని యేవొక్కరూ దొరకరు—ఎలా?'—

'అవును మీరన్న మాట నిజమే—ఏదో ఆశాలేశంతో చేసే ప్రయత్నంతప్ప ఇందువల్ల పెద్దప్రయోజనం వుంటుందని అనుకోటానికికూడా యెలానూ వీల్లేదు—పోనీ చీకటిబడ్డ తరవాతే ప్రయత్నించండి. ఇవాళ మసుకుగా కూడా వుందిలెండి—నాలుగుగంటలకే అంతా యిళ్ళకి జేరుకోవచ్చు—నేను రాత్రి తొమ్మిదయ్యేసరికి లారీగారి యింటికి తిరిగొస్తాను. అప్పటికి యేం జరిగిందీ నాకు తెలిసేలా చెయ్యండి.'

'సరే'—

'నేను వెళ్ళొస్తాను' అని సిడ్నీ బయలుదేరేడు. లారీ అతన్ని బయటిగేటుదాకా పంపించిరావటానికి బయలుదేరాడు. గేటుదగ్గిరికి వెళ్లినతరువాత లారీ నెమ్మదిగా సిడ్నీ భుజంమీద చెయ్యివేసి దిగులుగా:

'ఇదిగో—ఇటుచూడు!—నాకేమీ ఆశలేదు' అన్నాడు.

'నాకూ లేదు—కాని అలా మరోసారి ప్రయత్నం చెయ్యటం మంచిది. తన భర్తను రక్షించటానికి చెయ్యవలసిన ప్రయత్నమంతా చేశామని లూసీకి కొంత ఉపశమనంగా వుంటుంది. లేకపోతే, తనభర్తను హత్యచేస్తుంటే మనకేమీ పట్టనట్టు చేతులు ముందు బెట్టుకుచూస్తూ కూర్చున్నామని మరింత యిదిగా కుములుతుంది.'

'అవునవును—ఆమాట నిజమే' అన్నాడు లారీ, కళ్ళనీళ్లు తుడుచుకుంటూ—'ఏది యేమైనా అతను నశించిపోవలసినగతే—నాకు రవ్వంతైనా ఆశ కనుపించటంలేదు.

'అవును—ఏ ఆశా కనుపించటం లేదు.' అంటూ బయటికి వెళ్లిపోయాడు.

బయటికి వచ్చాడన్నమాటేగాని, యెటు బోవటానికీ అతనికేమీ పాలుబోవటంలేదు. వెర్రివాడులా, ఆ వీధివెంటా, ఈ వీధివెంటా, తిరుగుతున్నాడు. ఉన్నట్టుండి అతనికి మెరుపులా ఒక ఆలోచన తట్టింది. తనవంటి మనిషి ఒకడు ఆ ప్రాంతాల్లో తిరు

గాఉతున్నట్టు ఆయా విప్లవకారుల బృందాలకు తెలియటం మంచిదనుకున్నాడు. అయితే ఇది అతి తెలివితేటలుగా నిర్వహించవలసిన వ్యవహారం: అందుకే పూర్వాపరాలన్నీ అతి జాగ్రత్తగా యోజించుకున్నాడు. 'అవును నావంటివాడొకడు ఈ ప్రాంతాలలో వున్నాడని వాళ్ళకు తెలిసివుండి తీరాలి; లేకపోతే కొన్ని చిక్కులు రావచ్చు' ననుకున్నాడు. వెంటనే సెయింట్ ఆంటోనీ వీధివేపు బయలుదేరాడు.

తాను సెయింట్ ఆంటోనీవీధిలో పానశాలను నిర్వహించుతూ వుంటానని డిఫార్జ్ అన్నమాటలు అతనికి జ్ఞాపకం వచ్చినయ్. పారిస్ నగరం బాగా యెరిగున్నవాడికి, యెవర్నీ విచారించకపోయినా, డిఫార్జ్ పానశాల యెక్కడున్నదో కనుక్కోవటం అదేమంత కష్టమైన పనిగాదు. సెయింట్ ఆంటోనీ పానశాలకు వెళ్ళటానికి నిర్ణయం చేసుకుని, మధ్య త్రోవలో ఒక హోటల్లోకి వెళ్ళి భోజనం చేశాడు. భోజనం చేసిన అనంతరం పడుకుని గాఢంగా నిద్రపోయాడు.

అతనికి తిరిగి మెలకువ వచ్చేసరికి దాదాపు రాత్రి ఏడు గంటలు కావచ్చింది. అలా కొంచెంసేపు సేద తీర్చుకుని తిర్గి బయలుదేరాడు. పోతూపోతూ మధ్య త్రోవలో ఒక దుకాణం ముందు అమర్చివున్న అద్దం కిటికీముందు నిల్చునీ, మరీ అడివి మనిషిలా కనుపించకుండా జుట్టూ గిట్టూ కొంచెం సరిదిద్దుకున్నాడు. అక్కడనుంచి బయలుదేరి సరాసరి, డిఫార్జ్ పానశాలకు పోయి లోపలికి అడుగుబెట్టాడు.

అప్పటికి, జాక్వెస్ నెం. 3 తప్ప యితర పెద్దమనుషులెవరూ అక్కడ కనుపించలేదు. జాక్వెస్ నెం. 3 విచారణ సంఘంలో ఒక సభ్యుడుగా వుండి నిన్నటిదినం వెర్రికేక లేడుతూ వుండటం సిడ్నీకి జ్ఞాపకం వచ్చింది. అతను పానీయం సేకరించుతూ అమ్మకం బల్లదగ్గరే నిల్చుని డిఫార్జ్ దంపతులతో బాతాఖానీ వేస్తున్నాడు. ప్రతీకారిణి కూడా వాళ్ళదగ్గరే నిల్చుని ఏవో అవీ ఇవీ పిచ్చాపాటీ లాడుతోంది.

సిడ్నీ కార్టన్ లోపలికి వెళ్ళి ఒంటరిగా ఒక బల్లదగ్గర కూర్చున్నాడు. ఫ్రెంచిభాషలో ఒక పెగ్ వైన్ కావాలని అన్నాడు. ఆ మాట విని మాడెమ్ డిఫార్జ్ అతనివంక చూచింది.

రూల్సు అంటే రూల్సే !

ఆయన రిటైరు అయిన మ్యునిసిపల్ వుద్యోగి. రూల్సు ప్రకారం ఆయన ఏ నెల కా నెల తాను బ్రదికే వున్నట్లుగా డాక్టరుచేత సర్టిఫికేట్ వ్రాయించి పంపితేకాని, ఆయనకు రావలసిన ఫించను పంపబడదు. దానిని అనుసరించి ఆయన ప్రతినెలా సర్టిఫికెట్లు పంపుకొంటూనే వున్నాడు. కాని ఒక నెలలో ఏదో పల్లెటూరుకు వెళ్ళిరావటంలో సర్టిఫికేట్ పంపడం పడలేదు. ఫించన్ రాలేదు. మరునటి నెల సర్టిఫికెట్ పంపాడు. ఆ నెలకు ఫించను వచ్చింది.

మధ్యలో బకాయిపడిన నెల తాలూకు ఫించను పంపమని కోరుతూ మ్యునిసిపల్ ఆఫీసుకు జాబు వ్రాసుకున్నాడు.

నాలుగురోజుల తరువాత సమాధానం వచ్చింది:—

"ఆ నెలలో మీరు బ్రతికి వున్నట్లు ఋజువుకాలేదు కనుక ఫించన్ పంపలేదు." అని.

మళ్ళీ యీ ముసలాయన జాబు వ్రాశాడు: "ఆ తరువాత నెలలో నేను బ్రతికి వున్నట్లు, డాక్టరుగారిచ్చిన సర్టిఫికెట్ మీకు పంపుకొన్నాను. మీరు నాకు ఆ నెల తాలూకు ఫించను పంపారు. ఆ తరువాతి నెలలో బ్రతికి వున్న నేను అంతక్రితం నెలలో కూడా బ్రతికేవున్నట్లు ఋజువు అవుతున్నది కనుక నా కా నెలతాలూకు ఫించను ఇప్పించమని వేడుకొంటున్నాను."

మళ్ళీ నాలుగు రోజులలో సమాధానం వచ్చింది:

"అంతక్రితం నెలలో బ్రతికి వున్నా, ఆ తరువాత నెలలో బ్రతికివున్నా మా రూల్సు ఒప్పుకోవు. ఏ నెలలో బ్రతికివుంటే ఆ నెలకు మాత్రమే ఫించన్ మంజూరు చేయటం మా వంతు."

ముసలాయన డాక్టరు దగ్గరకు వెళ్లి 'ఫలాని' అక్టోబరు నెలలో తాను బ్రతికేవున్నట్లు సర్టిఫికెట్ యిమ్మని కోరాడు. ఆ డాక్టరుకు చిర్రెత్తుకు వచ్చి—

"ఈయన యీ అక్టోబరు నెలలోనే కాదు; యిలాంటివి 60 అక్టోబరు నెలలలో బ్రతికే వున్నా" డని సర్టిఫికెట్ యిచ్చాడు.

నాలుగు రోజులు దాటాక ఒక్క నెలకు కాక, 60 నెలల తాలూకు ఫించన్ పంపించారు ఆ ఆఫీసువారు!



గణపతిగారి యింట్లో టెలిఫోన్ మోగింది. గణపతిగారే రిసీవర్ ఎత్తారు.

"హల్లో! హల్లో! గణపతిగారేనా మాట్లాడేది?"

"అవును"

"ఆఁ! మరేంలేదు లెండి! మా యింట్లో యీ వేళనే క్రొత్తగా టెలిఫోన్ పెట్టించుకొన్నాను. తమపేరు గణపతికాబట్టి, ముందుగా మిమ్మల్ని ఒకసారి పిలిస్తే, యిక మా టెలిఫోన్‌కు ఎలాటి విఘ్నాలూ రాబోవని నాకు తోచింది లెండి-అంతే శెలవు."

రెండు మహానగరాలు

అతని ముఖం చూడగానే ఆవిడకు యేదో ఆశ్చర్యం కలిగి, మరింత పరిశీలనగా చూసింది; బల్ల దిగి దగ్గరసా వచ్చి, 'ఏవిఁ కావాలండీ?' అని అడిగింది. 'వైన్ కావాలి' అని తిరిగి మరోపర్యాయం చెప్పాడు.

'ఆంగ్లేయులా?' అని తిరిగి భోగట్టా చేసింది.

'అవును'.

మాడెమ్ డిఫార్జ్ తిరిగి అమ్మకం బల్లదగ్గిరికి వెళ్ళిపోయింది. కార్టన్, పత్రిక ఒకటి తీసుకుని పేజీలు తిరగేస్తున్నాడు. మాడెమ్ డిఫార్జ్ అంటున్న మాటలు అతని చెవులబడ్డయ్: 'అచ్చు! ఎవ్రిమూండ్‌లానే వున్నాడు'.

డిఫార్జ్ సారాగ్లాసు తీసుకొచ్చి సిడ్నీ బల్లమీద పెట్టాడు. 'నమస్తే' అని పలకరించాడు.

'నమస్తే—వైన్ చాలా బాగుంది'—అన్నాడు సిడ్నీ, కొంచెం మెచ్చుకోలుగా.

డిఫార్జ్ అమ్మకం బల్లదగ్గిరికి తిరిగివెళ్లి: 'అవును కొంచెం ఆ పోలిక లున్నయ్' అన్నాడు.

'కొంతేమిటి గింత—అచ్చు అదే మోహం'అన్నది మాడమ్ డిఫార్జ్. జాక్వెస్ నెం. 3. అందుకున్నాడు: 'మాడమ్! నువ్వు అతని సంగతే ఆలోచిస్తూ వుండటంచేత, ఇతనిలో ఆ పోలికలు మరింత విస్పష్టంగా కనుపించుతున్నయ్.'

'అవునవును! గాలోటైన్ దగ్గిర మళ్లీ రేపు అతన్ని చూడాలని ఉవ్విళ్ళూరుతున్నావుగాదూ అందుచేత అలా కనుపిస్తున్నాడు' అన్నది ప్రతీకారిణి.

కార్టన్ ఈ సంభాషణేమీ విననట్టు నటించుతూ పత్రికలోని పేరాలను పంక్తితరువాత పంక్తి అతిజాగ్రత్తగా పరిశీలించుతున్నాడు. అమ్మకంబల్లదగ్గిరున్న ఆ నలుగురూ, బల్లమీద మోచేతు లానించి గుసగుసా మాట్లాడుకుంటున్నారు:

'అవును మాడెమ్ చెప్పింది నిజమే—ఎందు కొగాలి—ఆ మాటలో చాలా అర్థం వుంది' అన్నాడు జాక్వెస్ నెం. 3.

'అదెల్లా?'— డిఫార్జ్ వాదన మొదలుపెట్టాడు: 'ప్రతీ దానికీ, ఎక్కడో ఒకచోట ఆగట మనేది వుండాలి; ఆ ఆగటం ఎక్కడా? అన్నదే యిప్పుడు ఆలోచించవలసిన సంగతి'

'సర్వనాశనంఅనంతరం ఆగటం'—అన్నది మాడెమ్ డిఫార్జ్.

'సర్వనాశనం—గొప్ప సిద్ధాంతమే—నేను కాదనటం లేదు' అంటూ డిఫార్జ్ యిదౌతున్నాడు: 'కాని యీ డాక్టర్ ఉన్నాడు చూశావ్!—ఇవ్వాళ ఆయన ముఖంవంక చూశావా? ఆ ఉత్తరం చదువుతున్నప్పుడు ఆయన ముఖంవంక చూశావా? పాపం'—

'చూడకేం చూశాను—జాగ్రత్తగా పరిశీలించాను. ప్రజాప్రభుత్వానికి నిజమైన మిత్రుడు కాదని ఆ ముఖం అద్దంలా చెబుతోంది; ఆ ముఖకవళికలు మార్చుకోలేకపోయాడంటే తను కూడా దెబ్బ తింటాడు.'

'పాపం—కూతురు అలా యిదై పోతుంటే ఆయన భరించలేక కుమిలిపోయాడు.'

'అయ్యో! ఆయన కూతురు సంగతి చూడకేం—ఇవ్వాళ చూడటమే యేవిఁటి—రోజూ చూస్తూనే వున్నాను. కోర్టులో చూశాను—జైలుగోడక్రిందవీధిలో చూశాను—అమితజాగ్రత్తగా పరిశీలించుతున్నాను'—భర్తవంక అదో కంటకంగా చూస్తూ, మళ్ళీ అందుకుంది: 'ఇదుగో! నీకోటి చెబుతున్నా విను!— ఇదంతా కేవలం నీ ఒక్కడి చేతిలోనే వుంటే—అతన్ని ఈ తరుణంలోకూడా ఒడ్డున వెయ్యటానికి ప్రయత్నించేవాడివే—నాకు తెలుసు—అదృష్టవశాత్తూ అదంతా నీ వొక్కడి చేతిలో లేదు గనక గాని'—

'చాఛా!—అదిగాదు నే నంటున్నది—ఈ వ్యవహారం యిక యిక్కడితో ఆపెయ్యటం బాగుంటుందంటున్నాను.'

మాడమ్ డిఫార్జ్‌కి వళ్లు మండిపోయింది: 'ఇదిగో! జాక్వెస్, ఇటు చూడు! చెల్లీ నూకూడా విను—ఈ వంశంవాళ్లున్నారే— వీళ్లు చేసిన కిరాతాలు ఇన్నిన్ని కావు—వీళ్ళ దౌర్జన్యాలు ఇన్ని కావు—ప్రజల్ని ఎంత క్రూరంగా నాశనం చేశారో మీరు ఊహించలేరు—నిర్మూలించి పారవేయవలసిన వంశంగా వీళ్లని నా జాబితాలో ఎక్కించి యేనాడైందో కావలిస్తే యీ పెద్దమనిషినే కనుక్కోండి!'—

'అవును—ఆమాట కాదన్నానా?'—

'డాక్టర్ మానెట్ ఉత్తరం మీరంతా విన్నారు. ఆ ఉత్తరంలో ఎవ్రిమూండ్ సోదరులు నాశనంచేసిన రైతుకుటుంబం యెవరోకాదు—మా కుటుంబమే. మానభంగంచేసి హత్యచేసింది మా అక్కను - కత్తితో పొడిచి చంపింది మా అన్నయ్యను - అలా హింసపెట్టి చంపింది మా బావను-గుండెపగిలి చచ్చిపోయిన ఆ వృద్ధుడు మా నాన్న—ఆ చచ్చినవాళ్ళంతా నా వాళ్లు— దీనికంతకీ ప్రతీకారం చెయ్యటానికి మిగిలివున్నది నే నొక్కదాన్నే - ఇంకా నిజమో అబద్ధమో ఈ పెద్దమనిషినే కనుక్కోండి!'—

'అదంతా కాదన్నానా?'

★ రెండు మహానగరాలు ★

'కాదనకపోతే—ఆ ఆగటాలూ గీగటాలూ నాతోమాత్రం చెప్పకు.'

ఆ సంభాషణ విని జాక్విస్‌కూ, ప్రతీ కారిణికీ మంచి హుషారొచ్చింది. మాడెమ్ డిఫార్జ్‌ని ఉత్సాహంగా అభినందించుతున్నారు. అల్పసంఖ్యాకవర్గంగా తయారైన డిఫార్జ్, జమిందారు భార్య సంగతీ అదీ చెప్పి యేదోకొంత మెత్తబడెయ్యాలని చూశాడుగాని లాభంలేకపోయింది. 'ఆగటాలూ గీగటాలూ ఈ అసందర్భపు మాటలన్నీ నాతోమాత్రం చెప్పకు' అనేసింది మాడెమ్ డిఫార్జ్.

మరికొంతమంది అతిథులు బెలబెలా లోపలికి రావటంతో, ఆ సంభాషణా అంతటితో ముగిసిపోయింది. కార్టన్ అమ్మకం బల్లదగ్గిరకొచ్చి తాను చెల్లించవలసిన డబ్బులు లెక్కజూచి యిచ్చాడు. 'నేషనల్ పాలెస్‌సుకు ఎటు వెళ్ళాలి' అని మాడమ్ డిఫార్జ్‌ని అడిగాడు. మాడమ్ డిఫార్జ్ అతనితోపాటు వాకిట్లోకి లేచొచ్చి అతని భుజంమీద చెయ్యివేసి, అదో ధీమాగా నిల్చుని మార్గం చెప్పింది. ఆ చెయ్యి అలాగే పుచ్చుకొని, ఆ ఆడపులిని అమాంతం నేలకుకొట్టి బాదెయ్యాలని కార్టన్‌కు లోపల కొండంత ఆవేశం కలిగింది; కాని తమాయించుకుని తన త్రోవను తాను బయలుదేరాడు. ఆ బయలుదేరటం బయలుదేరటం జైలుదగ్గిరకొచ్చి, ఆజైలుగోడల నీడల్లో లీనమైపోయాడు. సరిగా తొమ్మిది కొట్టేసరికి అక్కడనుంచి బయటపడి సరాసరి లారీగారి ముక్కుముకు వచ్చేశాడు. అతిత ఆందోళనగా లారీ గదిలో యిటునుంచి అటూ, అటునుంచి యిటూ పచారుచేస్తున్నాడు. తాను అప్పటివరకూ లూసీదగ్గిరే వుండొచ్చాననీ, డాక్టర్ గారు యింకా యింటికి తిరిగిరాలేదనీ కార్టన్‌తో చెప్పాడు. డాక్టర్ బయలుదేరి వెళ్ళి దాదాపు అయిదుగంటలవరకూ అయింది. ఇంతసేపూ యెక్కడున్నాడో?

కార్టన్‌తో ఈమాట చెప్పిపోవటానికే లారీ యింటికి తిరిగివచ్చాడు. లూసీదగ్గిరికి మళ్ళీ తిరిగివెళ్ళాళని తొందరపాటులో వున్నాడు. అర్ధరాత్రి సమయానికి తిరిగి వస్తాననీ, డాక్టర్ వచ్చేవరకూ అక్కడే వుండమనీ కార్టన్‌కు చెప్పి, తను మళ్ళీ వెళ్ళిపోయాడు.

కార్టన్ ఎంతసేపో కనిపెట్టుకు కూర్చున్నాడు; డాక్టర్ రానేలేదు. లారీ మళ్ళీ తిరిగొచ్చాడు కూడా—డాక్టర్ సంగతి యేమయిందీ యేమీ తెలియలేదు.

ఆయన సంగతే ఆలోచిస్తూ యిద్దరూ నిమిషాలు లెక్కబెడుతూ కూర్చున్నారు. ఇంతసేపు ఆలస్యమైంది గనుక ఆయన యేదో కొంత సాధించుతూ వుండవచ్చునని యిద్దరికీ రేఖగా ఆశ కలుగుతోంది. ఇంతలో మెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది; డాక్టర్ గదిలోకి అడుగుబెట్టాడు. ఆయన వాలకం చూడగానే, సర్వం వ్యర్థమైపోయినట్లు యిద్దరూ గమనించారు.

ఆయన అసలు యెవర్నైనా కలుసుకున్నాడో, లేక యింతసేపూ వట్టినే వీధులవెంట తిరుగుతున్నాడో, యిద్దరికీ అర్థంకాలేదు. డాక్టర్ వాళ్లిద్దరివంకా వెర్రిచూపులు చూస్తూ నిల్చున్నాడు. వాళ్లూ ఆయన్ను యేమీ ప్రశ్నించలేదు. వేరే ప్రశ్న దేనికి? ఆయన వాలకం చూడగానే వాళ్ళకు సర్వం అర్థమైపోయింది.

'ఎక్కడుంది?—కనిపించలేదు—నా బెంచీ యెక్క

డుంది—ఆ చెప్పులు ఇవ్వాళ పూర్తి చేసెయ్యాలి—ఎక్కడున్నయ్' అంటూ బెంగగా జుట్టు పీకేసుకుంటున్నాడు.

కార్టన్, లారీ యిద్దరూ ఒకరివంక ఒకరు చూసుకున్నారు. ఇద్దరి జీవాలూ క్రుంగిపోయినై.

'నేను అభాగ్యుణ్ణి! నన్నెందుకు యేడిపిస్తారు—నా సామాను నాకు యిచ్చెయ్యండి'—

'సొంతం మతిపోయింది'—

ఇక ఆ దశలో ఆయనతో ఎక్కువగా మాట్లాడి ప్రయోజనం లేదు. ఆయన్ను త్రోవకు తేవటానికి ప్రయత్నించి కూడా ప్రయోజనం లేదు. ఇద్దరూ చెరో వేపునా ఆయన భుజాలమీద చెయ్యివేసి నెమ్మదిగా కుర్చీదగ్గిరికి చేర్చి కూర్చోబెట్టారు. చెప్పులు కుట్టే సామాను వుందనీ, వెంటనే తెప్పించి యిస్తామనీ నచ్చజెప్పి కొంచెం శాంతి పరిచారు. ఆయన దిగాలుపడి కుర్చీలో కూర్చుని మండుతున్న నిప్పుల్లోకి చూస్తున్నాడు. కనుకొలకుల వెంట కన్నీరు దిగజారుతోంది.

'చివరిప్రయత్నంకూడా భగ్నమైపోయింది' అన్నాడు కార్టన్. 'సరే! అనుకున్నదే; ఈ యన్నకూతురు దగ్గిరికి తీసుకువెళ్ళండి; వెళ్లేముందు మీరు నాతో కొంచెం సావధానంగా రెండు నిమిషాలు మాట్లాడివెళ్లండి.—ఏవిటీ? ఎందుకూ? అని ప్రశ్నించకండి—నేను చెప్పినట్టు చెయ్యండి—బలమైన కారణంవుండే చెబుతున్నాననుకోండి'—

'సరే, చెప్పు—నీమాట నే నెప్పుడూ ఆశంకించను' అన్నాడు లారీ.

కార్టన్ క్రిందికి వంగి, డాక్టర్ లోపలికి వస్తూనే చికాగ్గా విప్పేసి క్రింద బారేసుకున్న కోటుతీశాడు. ఆతియ్యటంలో ఆ కోటుజేబులోనుంచి ఒక చిన్ని తోలుసంచీ క్రిందపడ్డది. దాంట్లో డాక్టర్ తన రోజు వారీ కార్యక్రమానికి సంబంధించిన చిన్ని చిన్ని కాయితాలు దాచుకునేఅలవాటు. కార్టన్ ఆ తోలు సంచీలోనుంచి మడిచివున్న ఒక కాయితంముక్క బయటికి తీశాడు.

ఆ కాయితం విప్పి చూసి, కార్టన్ 'అమ్మయ్యా!'—అనుకొన్నాడు?

'ఏమిటి?—'

ఆ మాటకు సమాధానం చెప్పకుండానే కార్టన్ తన కోటు జేబులోనుంచి మరో కాయితంముక్క బయటికితీసి లారీగారికి అందించాడు: 'ఇది చూశారూ! నా ప్యాసుపోర్టు—సిడ్నీ కార్టన్ అనే వ్యక్తి ఈ నగరంలోనుంచి బయటపడటానికి కావలసిన ప్యాసుపోర్టు. ఇది మీదగ్గిర వుంచండి చెబుతాను నేను అతన్ని చూట్టానికి వెడదామనుకుంటున్నాను గదూ—దాన్ని జైల్లోకి నాతో తీసుకుపోవటం మంచిదిగాదు లెండి.'

'ఏం?'—

'ఏమీ లేదు లెండి—వెంట దేనికీ అని—సరే యీ కాయితం తీసుకోండి'—డాక్టర్ జేబులోనుంచి తీసిన కాయితం కూడా అందించాడు: 'ఇది డాక్టరుగారూ, ఆయన కుమార్తె, మనమరాలూ నగరం విడిచివెళ్ళటానికి కావలసిన ప్యాసుపోర్టు.'

'సరే.'—

'ఎటుపోయి ఎటొచ్చినా మంచిదని డాక్టర్ గారు యీ ప్యాసుపోర్టు నిన్ననే సంపాదించివుంటారు. ఈ రెండు కాయి

(56-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

“డాక్టర్”



72. నిరుష్ణస్థితి

వస్తువులనుండి ఉష్ణమును తీసివేసినవాని ఘనపరిమాణము తగ్గునుకదా! అట్లే ఉష్ణము తీసివేయుచుపోయిన కొంతసేపటికి వస్తువు కనబడకుండా పోవునా? అని మేదకు నుంచి బి. రామారావుగారి ప్రశ్న.

వాయువులను ఒక డిగ్రీ వెచ్చబెట్టినచో అవి తమ పరిమాణములో 273 వ వంతు పెరుగును. ఒక డిగ్రీ చల్లబరిచినచో 273 వ వంతు తరుగును. ఈ సంగతి తెలియగానే వైజ్ఞానికులు ఆలోచించారు, గాలిని 273 డిగ్రీలు చల్లబరిస్తే దాని పరిమాణము పూర్తిగా లోపించిపోతుందిగదా అని. వాస్తవానికి ప్రతీవాయువూ 273 డిగ్రీలు దిగేటట్టు చల్లబరచకుండానే ఘనీభవించేస్తుంది. వాయువుతో పోల్చి చూస్తే దాని ఘనీభవ పరిమాణము అతి స్వల్పము. 1700 ఘన సెంటిమీటర్ల ఆవిరి ఒక ఘన సెంటిమీటరు నీరుగా ద్రవీభవిస్తుంది. కనక “273 డిగ్రీలు దిగేటట్టు చల్లబరిస్తే వాయువులన్నీ ఘనీభవించేస్తాయి” అన్న వ్యాఖ్యానమే ‘పరిమాణము లోపించిపోవడము’ అన్న పరిస్థితికి పరిపోతుందని తీర్మానించుకున్నారు. తన పరిమాణములో 273 వ వంతు తరిగిపోవడము గాలికి కదా గుణమూ? ఈలోపుగానే ఘనీభవించేస్తే మరి ఆ సూత్రము వాయువు కాని ఈ ఘనస్థితికి ఎలా వర్తిస్తుంది? కాబట్టి ప్రతీవాయువు 273 డిగ్రీలు దిగేటట్టు చల్లబరిస్తే ఘనీభవించి తీరాలి.

ఇక “(మంచు ఉష్ణతకి) 273 డిగ్రీలు దిగువన వాయువులు పూర్తిగా కుంచించుకుంటాయి” అన్న సూత్రానికి విశేషార్థమేమిటీ అని ఆలోచించారు. 273 డిగ్రీల దిగువన వాయువుకి పరిమాణమే వుండదని కదా సూత్రము. దానినే ఊహించగలము గాని “అంతకంటె ఇంకా చల్లబరిస్తేనో?” అన్న సందేహానికి జవాబు ఊహించలేము.

“ఉష్ణ హాక్షే అందని పరిస్థితి ఉండడానికి సాధ్యము కాదూ; కనక మంచు ఉష్ణతకి 273 డిగ్రీలు కిందస్థితే నిరుష్ణస్థితి అన్నారు. పదార్థాలు ఇంత చల్లదనములో ఎలా వుంటాయీ? అన్న ప్రశ్నకి “అణువుల సంచలనము పూర్తిగాతగ్గిపోయిఉంటాయి” అని సమాధానము చెప్పుకున్నారు. అవును వేడిమి అంటె అణువుల సంచలనమే. అయినప్పుడు అణుసంచలనమును పూర్తిగా తగ్గించే స్థితే నిరుష్ణస్థితి.

అయితే ఈ నిరుష్ణస్థితిని అందుకున్నారా? అని అడిగితే సమాధానము “నిరుష్ణస్థితి అంగుకోగల స్థితికాదు.” అని. ఏమంటే నిరుష్ణస్థితిని కనుక్కోగల వస్తువేది? వస్తువులోని అణుసంచలనమే ఆగిపోతే వస్తువుకి పరిమాణము ఉండనే ఉండదు. అసలు పదార్థాలన్నిటిలోనూ అణువులు సంచలిస్తూండడము చేతనే పరిమాణమంటూ తెలుస్తోందిగాని లేకపోతే ఏమిటీ తెలిసేదీ?

అలాగని నిరుష్ణస్థితికి చేరే యత్నాలు మానలేదు. వైజ్ఞానికులు. లెయిడన్ అనే హాలెండు నగరములో ఈ పరిశోధనలు సాగుతుకున్నాయి. ఓనిస్, కీసమ్ అనే వైజ్ఞానికులు ఒక డిగ్రీ వేడిమి మాత్రమున్న స్థితిని అందుకున్నారు. ఇటీవల ఇంకా దిగేరుకాని ఆ స్థితిలో ఒక డిగ్రీకి ఎంత ప్రమాణమేనా ఉన్నట్టు కనబడుతోంది. తరగడము బహుకష్టము!

—రావు.

73. అడవులు కొట్టిపారేస్తే?

మట్టిలో నాలుగువైపులా ప్రసరించి, గడ్డని తమపట్టుతో ఒక రకంగా బంధించిన వేళ్లు కుళ్లిపోవడమువల్ల గాలికీ వానకీ కొట్టుకుపోయీ తరిగిపోయీ భూమిసారం పోగొట్టుకుంటుంది. ఎప్పటికప్పుడు వాన ద్వారా భూమిని చేరే నైట్రేటులన్నీ పైపొరతోపాటు కొట్టుకుపోయి భూసారం హీనమౌతుంది. ఈ రీతిగా ఎడారులైపోయిన భూములు సిరియా, పాలెస్టీను లలో ఉన్నాయి. పెద్దచెట్లు లేని భూమి మాటనటుంచి గడ్డిలేని మైదానాలు చూసినా, వర్షానికి కొట్టుకుపోయిన ముఖాలతో కనబడతాయి. వర్షపాతము ఎక్కువగా వున్న ప్రదేశాలలో చెట్లు లేకపోతే ఈ చిక్కుంది.

చెట్లు భూమిలోనుంచి పీల్చుకున్న నీరు ఆకుల కింది పెడలో వుండే సూక్ష్మాల నే చిన్నరంధ్రాలద్వారా ఇగిరిపోతుందని మనకి తెలుసును. ఎటు చూచినా సముద్రము బహుదూరమున్న ప్రాంతాలలో మబ్బులేర్పడడానికి ఈ నీటి యావిరే ఆధారము. ఈ ఆవిరి పగలల్లా పైకిపోయి, రాత్రి చల్లబడ్డప్పుడు వానలాగో, మంచులాగో దిగిపోతుంది. పగలల్లా తీక్ష్ణంగా ఎండ కాచి రాత్రి వర్షాలు కురిసే భూమధ్యప్రాంతాలలో వర్షానికి ముఖ్యాధారము చెట్లేననాలి. ఆకుకి ఎన్ని సూక్ష్మాలు? చెట్టుకి ఎన్ని ఆకులు? అడవిలో ఎన్ని చెట్లు? ఈ చెట్లు కొట్టేస్తే అంతమట్టుకు నీటియావిరి తగ్గిపోతుంది. మాన్సూనులు విసిరేచోట్ల సముద్రాల నీటియావిరి వేరేవిధంగా లభించవచ్చునుగాని మధ్య ఆసియా ప్రాంతాలలోనో? కనక అడవులు కొట్టివేస్తే వర్షము తగ్గే అపాయమున్న దన్నమాట. దట్టమైన తోట రెండెకరాలమేర ఉన్నదంటే రోజుకు పలభయివేల గేలనుల నీరు సూక్ష్మాల నుంచి ఆవిరిగా వచ్చేస్తుందట! ఇదేం తక్కువ నీరా?

74. రంగు నదులా?

ఆహా. రంగు నదులే; వున్నాయి. అల్జీరియాలో ఒక నదికి రెండు ఉపనదులున్నాయి. ఒక నదిలో ఇనుప లవణాలూ, ఇంకోదానిలో గేలిక్ ఆమ్లమూ ఉన్నాయి. అంటే ఈ నదులు ప్రవహించే నేలలో ఈ రసాయనాలున్నాయన్నమాట. ఈ రెండు నదులూ చేరేచోట సిరా రంగు తయారౌతుంది.

గంగ తెల్లగా వుంటుందనీ యమున నల్లగా వుంటుందనీ ప్రతీతి. గంగనీటిలో తెల్లని మడ్డి ఉంది. త్రివేణీ సంగముదగ్గర

గంగా యమునలు కలిసేచోట నీటికి పురోగమనమే గాని ప్రక్కనడక అంతగా లేకపోడమువల్ల తెల్లని పంచా, అంచు ఉండేటంత వివరముగా రెండు నదులూ విర్పాటుగా చాలదూరము కనపడతాయి. తెల్ల నైలూ, అమెరికాదేశపు 'ఎర్ర' నదులూ, చీనాదేశపు పసుపునదీ, నీలి డాన్యూబూ, గంగలాగే వాటిలో కలిసి వుండే మడ్డిరంగునిబట్టే అలాగు పేరు పడ్డాయి.

75. పీత లెప్పుడూ బొరియల దగ్గిరే ఉంటాయేం?

అంతేకాదు నిముషానికోమాటు బొరియల్లో దూర్తూ పైకి వస్తూవుంటాయి కూడాను. పీతలకి ఊపిరితిత్తుల్లేవు. మొప్పలే వుంటాయి. కనక చేపల్లాగ నీటిలో కరిగి వుండే గాలిలోని ప్రాణవాయువుని మొప్పల సాయమువల్ల ఉపయోగించుకోగలవు కాని, గాలిలోని ప్రాణవాయువుని వాడుకోలేవు. అందుకనే నేలమీద తిరుగుతూన్నా చీటికీ మాటికీ బొరియలోదూరి మొప్పలున్న శరీరభాగాన్ని తడిచేసుకుని పైకి వస్తాయి. ఆ నీటిలోవున్న గాలిలోని ప్రాణవాయువుని మొప్పలు 'పీల్చు'కుంటాయి. పీత బొరియలో దూరకపోతే నీటిలో మునిగి చిక్కుపడిపోయిన మనిషిలాగు ఊపిరి సలపక చచ్చిపోతుంది. ★

—అయస్కాంతశక్తి ఇనుమే కాక చాలా ఇతర పదార్థాలకి కూడా ఉంది. అయితే ఇనుముకి పట్టేటంతగా నిక్కెలుకీ, కోబాల్టుకీ పట్టదు. తక్కినలోహాలకి ఇంతమాత్రమేనా పట్టదు. అయస్కాంతశక్తికి కారణము అణువుల నిర్మాణములోని ఎలక్ట్రానుల చోటులని తెలిసినది కాని, ఆ ఎలక్ట్రానులలాగు ఎందుకున్నవీ అన్న ప్రశ్న కింకా జవాబు తేలలేదు

—అన్నమూ తింటూన్నప్పుడే ఏ కొద్దియో నీరు త్రాగుటనయము. అన్నమును ద్రవరూపంలోకి తెచ్చి జీర్ణావయవాలు జీర్ణము చేయుటకీ నీరుపనికివచ్చును. అన్నము కడుపులో పడగానే జీర్ణకోశములో కొన్ని రసములూరి అన్నముతో కలిసి అన్నమును చిలికినట్లు కలిపివేయును. ఇలాగు తయారైన అన్నద్రవము నుంచి రక్తనాళికలు ఆహారమును పీల్చుకొనును. అన్నము తిన్నపిమ్మట త్రాగిన నీరు ఈ జీర్ణరసాల్ని పలచన చేస్తుంది. అన్నము తింటున్నప్పుడే మధ్యే మధ్యే పానీయము సమర్పించడమువల్ల ఎప్పటికప్పుడు ఆహారాన్ని కొంచెము పలచన చెయ్యడానికి వీలవుతుంది.

—సుమారు పదకొండుగంటలప్పుడు నోటినిండా నీరుపుక్కిలించి, గోడమీద నిలబడి సూర్యుడివైపు వీపుంచి, కిందికి 'ఫూ'అని ఆ నీటి నితుంపరలుగా చిమ్మండి. పూర్తిగా వర్తులంలాగ ఇంద్రధనుస్సు ఆతుంపరలలో కనబడుతుంది.

—మెదడుకి పైపై భాగాన్ని కార్టెక్సు అంటారు. కాఫీకి ఈ కార్టెక్సుకు కొంత పురి ఎక్కించే గుణము ఉన్నది అది కొంతకాలము అలవాటు అయితే, కార్టెక్సు ఈ ఉత్సాహాన్ని ప్రతీరోజూ కోరుతుంది. కాఫీ తాగకపోతే, రోజూ చురుకెత్తడము అలవాటయిన కార్టెక్సుకు ఆనాడు చురుకుగా ఉండదు. కార్టెక్సు తన కలవాటైన ఉత్సాహాన్ని కోరడమే "కాఫీ తలనొప్పి."

—నీటినుంచి ఉప్పూ, పాలనుంచి వెన్నా ఒకేలాగ తయారవుతాయా? నీటిని మరగబెట్టి ఆవిరిగా పంపించేస్తే, ఆ రీతిగా ఆవిరిగా మారలేని, ఉప్పు మిగిలిపోతుంది. మళ్లీ నీరుపోస్తే ఆ ఉప్పు కరగడానికి అభ్యంతరమేమిటి? పాలలోని వెన్నకణాలు పాలతో కలిశి వుంటాయి గాని కరిగి వుండవు కనక, గిలకొట్టినప్పుడు వెన్న పైకి తేలిపోతుంది. ఇంగ్లండులో నీరు కలపని 'పాదుగుదగ్గరి పాలు' సీసాలలో అమ్ముతారు. ఈ పాలమీద వెన్న తేలిపోయి కనపడుతుంది. కణము కణము వారీగా పాలతో కలిసివుండిన వెన్నని విడదీసి ముద్దచేసిన తర్వాత పాలలో ఎలాగ కరుగుతుంది? అసలు కరిగి వుండనే లేదు వెన్న!

—మబ్బులుగా ఏర్పడ్డ నీటియావిరి గాలికి ఇటూ అటూ కదలడమువల్ల గాలి రాపిడికి దానికి విద్యుదావేశము కలుగుతుంది. ఇలాగే రాపిడివల్ల విద్యుదావేశము పొందిన గాలికణాల చుట్టూ నీటియావిరి బిందువులుగా ఏర్పడి మొత్తంగా కూడినప్పుడు నల్లని నీటి మబ్బులు తయారౌతాయి. (ఈ మబ్బులకీ విద్యుదావేశము ఉంటుంది.) విద్యుదావేశము ధనావేశమూ ఋణావేశమూ అని రెండు రకాలు. ధనావేశితమైన మేఘమునుంచి ఋణావేశితమైన మేఘానికి చరక్కుమని గెంతే మెరుపే "మెఱుపు" మెరుపు పొడుగునా వేడిమీ వెల్తురూ బయల్దేరతాయి. ఇవి ధన ఋణ విద్యుత్తులు ఏకమైనప్పుడు కలుగుతాయి గాని మబ్బులు ఢీకొక్కవడమువల్ల కాదు.

ఆకాశంలో పరుచుకున్న మబ్బునిండా ఒకే రకపు విద్యుదావేశము - ధనావేశము అందాము - కూడినప్పుడు భూమిలోని ఋణావేశము కోసుగా ఉండే కట్టడాల కొసకీ, చెట్ల కొసలకీ చేరుతుంది. మేఘాల ధనవిద్యుత్తు ఒక్కదాటులో ఆ చెట్టుమీదకో ఆ ఇంటిమీదకో దిగిపోతుంది. ఇదే పిడుగు. దీని దారిపొడుగునీ త్రేతాగ్నిజ్వాల. ఒకమారు దొంతిపెట్టిన గిన్నెల అడుగులన్నీ కరిగి కలిసిపోయి చిత్రమైన పాత్రలముద్ద తయారైంది.

ఈ వేడికి చుట్టూ ఉన్న గాలి గభీమని పెరిగి దానికి చుట్టూ ఉన్న గాలికి కొట్టిన దెబ్బయే ఉరుము. ఎత్తుగా వున్న మేఘమునించి భూమిదాకా గెంతే మెఱుపుపొడూగుతా బయల్దేరిన శబ్దం దూరంగా వున్న మన చెవులకి క్రమంగా చేరడమే ఉరమడము.



మధుపర్కాలు ధరించిన కిన్నెర వధువు.

ం చే కిన్నెరలు—శ్రీ రణవీర్ శాక్సెనా రచించిన చిత్రాలు



కిన్నెర కాంత—టెజ్జీ.



మద్దెల వాయిస్తున్న కిన్నెరుడు.



కిన్నెరలు.

★



కిన్నెర కాంత.

బొమ్మరిల్లు

సూటి ప్రశ్న

శ్రీమతి ద్విభాషి కృష్ణకుమారి

సుందరయ్య మేష్టారుకు
సూరిగాడు ఒక్కకొడుకు
వయసునకు పదేండ్లవాడు
బడికి వెళ్లు యీడువాడు॥

ఒక్కనాడు వాళ్లయింటి
ప్రక్కవాళ్ళ అబ్బాయికి
పెళ్ళని మన సూరిగాడు
వెళ్లినాడు వాళ్లింటికి॥

బాజాలు భజంత్రీలు
ముత్యాలపూల పాలకీలు
చూచుసరికి సూరిగాడు
ఎంతో పొంగిపోయినాడు॥


నాన్న నాకు పెళ్లి చేస్తె
బాజాలు భజంత్రీలొస్తె
బాగుండును అనుకున్నాడు
నాన్నకడకు పరుగెత్తాడు॥

"నాన్న నాకు పెళ్ళిచెయ్యి
తొందరగా కానియ్యి"
అనగానే మేష్టారు
విరగబడీ నవ్వేరు॥

"పెళ్లి చేయడానికి మరి
పిల్లేదిర ?" అనగ సూరి
మండిపడి "నాయనమ్మ
నిచ్చైనా కానిమ్మ"॥

"తప్పురా వెధవాయి
కళ్లు రెండు పోతాయి"
అనగానే సూరిగాడు
అందుకొ నిట్లన్నాడు॥

"మీ అమ్మను నాకిచ్చి
పెళ్ళిచేస్తె తప్పామరి,
ఎందుకు మా అమ్మను నువు
పెళ్లి చేసుకొన్నావు ?"



జంతుకోటిలో మానవలక్షణాలు

(గతసంచిక తరువాయి)

జంతువు లన్నిటిలోకి తెలివైన జంతువేదో చెప్పమని మీరు ఎవరినడిగినా, కుక్క అనో పిల్లి అనో, గుర్రంఅనో ఠక్కున చెప్పేస్తారు. మనుష్యులకు బాగా మచ్చికఅయి, ఎన్నో విధాల వీళ్ల స్వార్థాలకు అవి వుపయోగపడుతున్నాయి కాబట్టే, వీటిని వుబ్బవేయటానికి మనుష్యులు అల్లా అంటారు కానీ, అందులో నిజం అంతగా లేదు. మనం యీమాట నలుగురూ వినేటట్లుగా అంటే, వీటి అభిమానులు మనమీదికి దెబ్బలాటకు వచ్చినాకూడా రావచ్చు!

సృష్టిలో వుండే ప్రతి గుర్రానికి, ప్రతి కుక్కకీ ఒక యజమాని వుంటూనే వుంటాడు. పిల్లులు కూడా అంతే! ఎవరియింటినో అంటి పెట్టుకొనే వుంటాయి. నిత్యమూ తనను ఆశ్రయించుకొని బ్రతికే యీ జీవాలలో కూడా ఏదో ఒక గొప్పదనం వున్నదని నలుగురికీ చెప్పుకొని, ఆ జంతువుల గొప్పదనంలో కొంత తనూ భాగం పంచుకోవాలనే చూస్తాడు ప్రతి మానవుడూ. మనుష్యులలో ఆ మాదిరి స్వోత్కర్ష ప్రబలంగా వున్న కారణంచేతనే, కుక్కలు, గుర్రాలు చేసిన ఘన కార్యాలను గురించిన ఎన్నో కట్టు కథలు వాడుకలోకి వచ్చాయి. ఈకథలకు తోడుగా విదేశాలనుంచీ వచ్చే స్టంటు సినిమాలు కూడా గుర్రాలకీ, కుక్కలకీ, లేనిపోని గొప్పదనం తెచ్చి పెట్టాయి.

ముందుగా కుక్కల విషయం పరిశీలిద్దాం. ఒక కుక్క కంటే మరొక కుక్క తెలివి తేటలుగా కలదిగా తోచటం అపురూపం కాకపోవచ్చు కానీ, కుక్కలు అన్నిటినీ గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు వాటిని తెలివైన జంతువులని అనటానికి వీలులేదు. కుక్కలను గురించి ఒక్క విషయం మాత్రం నిశ్శంకోచంగా చెప్పవచ్చు. మంచి మనస్సుగల ఏమనిషికైనా, కుక్క అనేది మంచి 'మిత్రుడు' కాగలదు. కాబట్టి కుక్క యొక్క మంచి తనమనేది, దాన్ని సాకుకొనే ఆ యజమాని మనస్తత్వం మీదనే ఆధారపడి వుంటుందని చెప్పవచ్చు.

కుక్కల తెలివి తేటలను గురించి ఎన్నో రకాల పరిశోధనలు చేసిన డాక్టర్ రీస్ అనే ఆయన, "అతి తేలికైన సమస్యలనే తప్ప కుక్కలు పూర్వానుభవం లేకుండా పరిష్కరించుకోలేవని" అన్నాడు. సి. జే. వార్డెన్, టి. ఎస్. జెంకిన్స్, ఎల్ హెచ్. హార్నర్ అనే ముగ్గురు మనస్తత్వ శాస్త్రవేత్తలు కొన్ని పరిశోధనలు జరిపి, ఒక పుస్తకం వ్రాస్తూ, అందులో, కుక్కల తెలివి తేటలను ఎక్కువచేసి చెప్పుకోవటం పరిపాటి అయిందేకాని, అందులో నిజం మాత్రం అంతగా లేదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఏ కుక్కకైనా అలవాటైన సమస్య కాకుండా, క్రొత్తది ఎదురైనప్పుడు వుత్త వాజమ్మలా వ్యవహరిస్తుంది. అంటే ఆ సమస్యను విడగొట్టుకోవటానికి అసలు ప్రయత్నమే చెయ్యదని కాదు;— ప్రయత్నం చేస్తుంది. గంటల తరబడి కష్టపడుతుంది. అల్లాగా గుడ్డిగా గంటలు తరబడి పెనుగు

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

లాడడం మాత్రం తెలివి తేటలకు లక్షణ మౌతుందా?-కానే కాదు. ఒక సమస్యను విడగొట్టటానికి చేస్తున్న ప్రయత్నం సరైనది కాదని తెలిపోయాక కూడా, ఆ పద్ధతిని వదిలేసి క్రొత్త మార్గాన్ని వెదుకలేక పోవటం వివేక లక్షణం కాబోదు.

సమస్యలతో కూడిన పెట్టెలు తెరిచే పరీక్ష పెట్టితే కుక్కలు ఎంతసేపటికో గాని, అతి చిన్న కిటుకు అయినా కనుక్కొనే లేవు. ఆ కనుక్కోవట మైనా బుర్ర నుపయోగించి కాదు; ఇది గింజుకోవటంలో ఏకాలో, తోకో పొరపాటున ఆమీటకు తగిలి తలుపు తెరుచుకో వాల్సిందే కాని, యిది బుద్ధిని వుపయోగించి ఆ కిటుకును కనుక్కో లేదు. పోనీ-అలా ఒకసారి అ ప్రయత్నంగా కిటుకు బయట పడినా రెండోసారి అదే పరీక్ష చేసి చూస్తే కూడా, యిందాకటి ఆ అనుభవాన్ని యిది స్ఫురణకు తెచ్చుకోనే లేదు.

ఒకసారి యిలాగే ఒక పెట్టెలో బొమిక ముక్కను పడేసి, ఆ పెట్టెకు ఒక వైపున యింత పొడుగ్గా కనుపించే ఆ యినప వూచను ఒక కుక్క ఎంత సేపటిలోపట్టి నొక్కి, పెట్టె తెరిచి, బొమికను నోట కరుచుకోగలదో పరీక్షించారట. ఎంతో సేపు తన్నుకొని తన్నుకొని చివరికి ఎలాగో ఆ వూచను నొక్కిందట.

మళ్లీ ఆ పెట్టెలో యింకొక బొమిక పడేసి, పెట్టెను కొంచెం అటువైపుకే తిప్పిపెట్టి చూశారట. అవతల ఆవూచ కళ్లకు కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వున్నా, యీ కుక్క ఎంతసేపూ ఆవూచలేని వైపే కాళ్లతో గోకిందట కానీ, అవతలికి జరిగి ఆవూచను పట్టుకోవాలన్న ఆలోచన దానికి తట్టనే లేదట. పరీక్షల్లో యిలా తప్పటడుగులు వేసే తోటి జంతుకోటిని చూస్తే చింపాంజీ తనకు అవమానమైనట్లు బాధ పడుతుంది!

సామాన్యంగా కుక్కలుగల ఆసాములు ఒక గొప్ప చెప్పకొంటూ వుంటారు. తమ ఆ జమాయిషీలో వున్న కుక్కలు పొరుగు వారి కుక్కలు చేసే ఎంతలావు గొప్ప పని అయినా, ఒక్కసారి చూస్తే, పట్టేస్తుందనీ, ఆ తరువాత సునాయాసంగా ఆపనిని చేసి పారేయ గలదనీ అంటూ వుంటారు. ఇందులో నిజం ఎంతమటుకువుందోనని శాస్త్ర వేత్తలు కొన్ని పరిశోధనలు చేసి చూశారు.

ఒక కుక్కను పట్టుకొచ్చి దానికి ఏదో గుర్తు చూపించగానే ఎదురుగుండా ఉండే పెట్టెలో దూకే అలవాటు చేశారు. అల్లా పెట్టెలోకి దూకినప్పుడల్లా దానికి చప్పరించటానికి చక్కని బొమిక ఒకటి బహూకరించే వారు కూడాను. ఈ బహుమతుల ప్రదానోత్సవం చూడటానికి మరొక కుక్కను కూడా తీసుకొచ్చి అక్కడ నిలపెట్టారట. ఈ రెండో కుక్క తను కూడా బొమికల బహుమతులు పొందాలని తెగ తొందర పడిందంటే కానీ, కాస్త వళ్లువొంచి ఆగుర్తు ఏదో చూపించినప్పుడు ఆ పెట్టెలోకి దూకితే తనకీ యీ అదృష్టం అబ్బుతుందన్న విషయం దాని బుర్రకు తట్టనే లేదట. [మనలో కూడా అంతే కదండీ! మన కళ్ల ఎదుట కష్టపడి చదివి బహుమతులు పుచ్చుకొంటున్న కుర్రాణ్ణి చూస్తూ వున్నంత సేపూ, మనం కూడా అలాగే బహుమతులు ఎప్పుడు పొందుదామా అనే వువ్విళ్లూరుతాము కానీ, వాడిలా కష్టపడి చదవటానికి మాత్రం ఓ పట్టాన ఒప్పకోలేం కదండీ!]

(ఇంకావుంది)

'కర్పూరం'

"కస్తూరి సువాసనతో కూడి ఉంటుంది. దానిని తింటే వేడి చేస్తుంది. కొంటే డబ్బు జాస్తిగా ఖర్చు అవుతుంది. ఒకప్పుడు ప్రాణాన్ని కూడా రక్షిస్తుంది. దీన్ని ప్రసవించిన వెంటనే బాలింతలకు పెడతారు" అని మాస్టారు 'కస్తూరిని' గురించిన పాఠం చెబుతున్నప్పుడు తన అమ్మకు కూడ ప్రసవించేటప్పుడు కస్తూరి పెట్టారు గామాల్ను అనుకొన్నాడు రంగనాథ్. అనుకున్నవాడు మెదలకుండా ఊరుకోవచ్చునా? ప్రక్కవాడితో చెప్పాడు - తన అమ్మకు కస్తూరి పెట్టారని. ఆమాట విన్న శంకరం ఊరుకున్నాడా! 'మా అమ్మకూడా తినే ఉంటుందిలే' అని అన్నాడు.

ప్రక్కనే కూర్చున్న మాధవం ఇది విని: 'నేను తిన్నారా మొన్న' అన్నాడు.

'నీకు వేడి పుట్టలేదూ?' రంగ డడిగాడు.

'పుట్టలేదు. నోరంతా ఏమిటో తిమ్మిరెక్కింది'

'మరైతే పంతులుగారు చెప్పేది తప్పుగదూ'

'తప్పే.........ఏమో లోపల-అంటే కడుపులోపల వేడి పుట్టిందేమో; ఎవరికి తెలుసు!'

'అసలు నీ కెక్కడిది?'

'మానాన్న దగ్గ రుంది. తెల్లగా ఉంటుంది. దేవుడికి హారతిస్తాడు మా నాన్న దాంతో!'

'హారతిస్తారని పంతులుగారు చెప్పలేదే?'

'నే చెప్పుతున్నానుగా విను. నాకు తెలుసు, దానిసంగతి. అది

శ్రీ బలభద్రపాత్రుని సుందర రామశర్మ

బజారులో అమ్ముతారు. ఒక్కొక్కప్పుడు బిళ్ళలు గాను, ఒక్కొక్కప్పుడు ముద్దగాను ఉంటుంది'

'ఊఁ-చెప్పు ఇంకా'

'ఇది బలే వాసనగా ఉంటుంది. దాంతోనే దేవునికి హారతి పడతారు. నులిపితే పొడి ఔతుంది.'

పంతులు చెప్పేపాఠం వినకుండా తమకు తెల్సిన 'కర్పూరం' సంగతి చెప్పుకొన్నారు ముగ్గురు స్నేహితులు-వాళ్ళ ఫస్టుఫారం క్లాసులో.

రంగ:-నీకివి ఎలా తెలిశాయి?

మా:-నేను చూసేనురా.

శం:-ఓరి ఇదేనా! హరికథలో డబ్బులకోసం పట్టే పళ్ళెంలో వెలుగుతూ వుంటుంది-అదే కదురా?

రం,మా:-ఔనౌను అదే అదే.

పంతులు:-స్స్......ఎవరాగోల, పాఠం వినండి.

ముగ్గురూ మెదలకుండా ఉన్నారు.

పంతులు:- ఇది చాల మంచి వాసన గలది. స్వచ్ఛమైనదీ - అసలైనదీ ఎవరికీ దొరుకదు. దీన్ని

★ 'కసూర్తం' ★

తీసుకొచ్చి అమ్మేవాళ్ళు చాల కల్తీవస్తువులు కలుపుతారు. ఈ పాఠాన్ని రేపు చదువుకురండి. ప్రశ్నలడుగుతాను' (అంటూ పంతులు కుర్చీలో కూలబడ్డాడు, —ఏవో పాఠాలు తిరగేస్తూ) (రంగనాథ్ మళ్ళీ మొదలెట్ట మన్నట్లు శంకరం వైపు చూశాడు) శం:- ఆc! మా నాన్నగారు అన్నారురా-

మా:-ఏమని?

శం:- ప్రశ్నలకి జవాబులు చెప్పేటప్పుడు మన సొంత మాటలతో చెప్పాలిట; మన తెలివితేటలు చూపించాలిట!

రం:-ఔనురోయ్ మా 'రుక్కు' న్నయ్యా అలాగే చెప్పాడు. అన్నీ మనం సొంతంగానే చెప్పాలి.

మా:-ఇకనేం మనం తెల్సుకున్నాంగా ఈ 'కస్తూరం' గురించి రేపు చెబుదామా?

రం;శం:-ఓ-రేపు అన్నీ స్వంత మాటల్లో చెప్పి మేష్టరుచేత 'భేష్' అనిపించుకోవాలి.

మా: అల్లా చేసి, మనల్ని మొద్దబ్బాయి లంటున్న పిల్లల్ని మించి పోవాలి!

రం: ఏరా; మాధవా కల్తీ! కలవంది దొరకదా?

మా: ఏమోరా? నాకు తెలీదూ పంతులుగారు చెప్పారుగా.

శం: ఏడిశాడు. మా బామ్మ బజారెళ్ళిందంటే, అంగడి వాళ్లతో పోట్లాడిలైనా సరే, అసలు సరుకు లాక్కొస్తుంది.

రం: ఔనురోయ్. వాళ్ళ బామ్మ భలే పోట్లాడుతుంది - నాకు తెలుసు. ఆ అదుగో మాస్టారు చెప్పుతున్నారు-కస్తూరం, బజార్లో అమ్ముతారుట. నువ్ చెప్పింది నిజమే రోయ్!

పంతులుగారు 'హాజరు చెప్పండిరా' బిగ్గరగా కేకవేసి, హాజరుపట్టీ తెరిచారు.

రం: పంతులుగారు పేరు పిల్చినప్పుడు మనం అందరి లాగా 'ప్రెజెంటు సార్' అనకుండా 'జైహింద్ సార్' అందామురా. మా రుక్కు-అన్నయ్య అల్లాగే

అంటాడుట!

మా: మీ రుక్కన్నయ్య చదివేది పెద్ద చదువుగా; అందుకని అంటాడు. మనం అనకూడ దేమోరా?

రం: చూస్కో - నే నంటాను.

శం: ఊఁ! నువ్వంటే నేనూ అంటాను. నీ తరువాతేగా నా పేరు!

పంతులుగారు వరసగా పేర్లు పిలుస్తున్నారు.

పం: రంగనాథ్

రం:(వెంటనే) ప్రెజెంటు సార్!

శం: ఏంరా! జైహింద్ అనలేదేం?

రం: భయమేసిందిరా. రేపు అంటాను చూస్కో!

శం: నేనూ రేపే అంటానులే!

పం: (కొందరి పేర్లు అయిన తరువాత)

'శంకరరావు'

శం: [తత్తరపాటుతో ఒకట నాల్సింది ఒకటంటూ] జై ...... ప్రె్రజె......హి......ఈఈ...... సా......ర్ [అందరూ గొల్లున నవ్వుతారు)

పం: ఎవడ్రా వాడు?

శం: 'ప్రే...ప్రె జెంటు సార్! [లేచి నిల్చుంటాడు.]

పం: తల తిరుగుతోందా? వెధవా?

శం: లేదు సార్. ఏదో అన బోయి.........


పం: ఏడిశావ్ కూర్చో. తరువాత.........

మరునాడు క్లాసులో

శం: ఒరే రంగా. ఇవాళ అనాలిరా 'జైహింద'ని

రం: ఓయస్.

పంతులుగారొచ్చారు క్లాసులోకి. కుర్చీలో కూర్చొని 'హాజరు



చెప్పండిరా' అన్నారు వరుసనే పిలుస్తూ. 'రంగనాధ్'

రం: - జైహింద్ సార్!

పం: ఎవడ్రా వాడు?

రం: [లేచి నిలబడతాడు]

పం: ఆరి వెధవా! ఏమిటా కూతలు? మామూలుగా ప్రెజెంటు అనలేవూ? జైహింద్‌ట జైహింద్! ఇటురా వెధవా.

రంగడు జంకుతూ వెళ్తే రెండు లెంపకాయ లిచ్చి పంపించారు. క్లాసులో పిల్లలంతా నవ్వారు. వాళ్ళతోపాటు మాలతికూడా నవ్వింది. రంగడికి ఏడుపూ, కోపం రెండూ ఒక్కసారే వచ్చినా బిగపట్టుకొని తన సీటులోకి వెళ్ళాడు. తరువాత హాజరు వేస్తున్నప్పుడు శంకరం మాత్రం 'జైహింద్' అని చెప్పలేదు.

పంతులు ప్రశ్నలడగటం మొదలెట్టాడు 'కస్తూరి' ని గురించి.

పం: కస్తూరి ఎచ్చట దొరుకును?

శంకరం; [తను జవాబు చెప్పి భేష్ అనిపించుకోవాలని గభాలున లేచి] మాధవం నాన్న దగ్గర దొరుకును.

(మిగిలిన అందరు నవ్వు)

పం: ఛా! నోరుమూయ్

నాకు జబ్బు చేసింది. డాక్టరు వద్దకు వెళ్లాను. నన్ను పరీక్ష చేసినందుకు అయిదు రూపాయల ఫీజు యిచ్చాను. ఎందుకంటే ఆయన బ్రతుకు తెరువుకోసం. ఆయన వ్రాసి యిచ్చిన చీటీ తీసుకొని మందుల షాపుకు వెళ్లి ఆయన చెప్పిన ధరకు ఆమందు కొన్నాను. ఎందుకంటే— ఆయన బ్రతుకు తెరువు కోసం. ఆమందు తీసుకొని యింటికి వచ్చి ఆమందు సైడు కాలవలో పారబోశాను. ఎందుకంటే— నేను బ్రతకడానికి!

—"రవి"

కస్తూరం

]తను రైటు చెప్పేటట్టుగా రంగడు లేచి నిల్చొని] బజార్లో అమ్మబడును.

పం: ఛీ! తప్పన్నర వెధవా!

మా: [తనకి పాఠం బాగా అర్థమైనట్టు లేచి] అసలైంది ఎక్కడా లభించదండీ. కావాలంటే కల్తీది దొరుకుతుంది. బజారులో వాళ్ళు కల్తీ కలుపుతారండీ.

పం: ఛీ ఛీ! వెధవల్లారా. నువ్వు చెప్పు మాలతీ!

మా: ఒక విధమగు మృగము వద్ద లభించును. దానిని 'కస్తూరి మృగ' మందురు.

పం: భేష్. (శంకరం, మాధవుడు రంగడు ఒకరి మొఖం ఒకరు చూచుకొన్నారు) పంతులుగారు ఇంకో ప్రశ్న వేశారు-'దీన్ని ఏమి జేస్తారు?' అని.

రం: [తొందరగా లేచి] దేవుడికి హారతిస్తారు సార్.

పం: ఛా వెధవ.

శం: దీన్ని హరికథలలో హారతి పళ్లెంలో వెలిగించి పెట్టి, డబ్బులు అడుక్కొంటారు సార్!

పం: ఛీ, ఛీ......మాలతీ! నువ్వు చెప్పు.

మాల: బాలింతలకిస్తారు. ఒంటికి పూసుకుంటారు.

రం; మా: ఆఁ ఆ! ఔనండి. తింటారు కూడాను.

పం: ఆఁ! తింటే ఏమౌతుంది?

మా: నోరు తిమ్మిరెక్కుతుంది. అదోలా ఉంటుంది సార్.

పం: ఓరి దరిద్రుడా అన్నీ తప్పులే. పైగా పెద్ద మొనగాడిలా మాటకు ముందు లేస్తావేరా?

రం: నే చెబుతానండి [పెద్ద తెలిసినట్టు లేచి]

పం: ఊఁ...

రం: కడుపులో కెళ్ళి అక్కడ వేడి పుట్టి, మన కడుపులో వుండే దేవుడికి హారతిస్తుందండీ.

పం: [కోపంతో] ఛా...వెధవ. ఏ వెధవ చెప్పాడురా నీకు.

శం: [లేచి] మీరేసార్! నిన్న చెప్పింది.

రం: మా అమ్మమ్మ కూడా చెప్పింది సార్ - మన కడుపులో దేవుడుంటాడని.

మా: [లేచి] మా అవ్వకూడా అట్లాగే చెప్పిందిసార్ - మన కడుపులో దేవుడుంటాడుట. (క్లాసు పిల్లలందరూ గొల్లున నవ్వుతూ వుంటారు.)

పం: మీరు నోరు మూస్తారా లేదా?

రం; శం; మా: [ఒక్కసారిగా] [వినిపించి వినిపంచకుండా] ఎవరి నోరుసార్? (క్లాసులో పిల్లలు మళ్లీ బిగ్గరగా నవ్వుతారు)

పం: ఎవరు చెబుతారు దీనికి జవాబు?

మాల: నే చెబుతానండి.

పం: ఊఁ; చెప్పు?

మాల: శరీరానికి వేడి పుడ్తుంది.

పం: దాన్నెవరికిస్తారు తింటానికి?

రం; శం; మా; [గభాలున లేచి] మన అమ్మలకు సార్.

పం: మీరు నోరు మూసుకోండిరా గాడిదల్లారా! (కిక్కురుమనకుండా కూర్చుంటారు.)

గిరీశం: బాలింతలకండి సార్.

పం: కస్తూరి ఎలా ఉంటుంది?... మాలతీ నీవు ఊరుకో - మిగతా వాళ్ళెవరైనా చెప్పండి.

మాధవుడు; [ఈసారైనా రైటు చెప్పాలని లేచి] తెల్లగా ఉండును.

శంకరం (తను వాడికంటే రైటు చెప్పాలని వెంటనే లేచి) ముద్దగా-ఒక్కొక్కప్పుడు బిళ్ళలు బిళ్ళలుగా ఉండును.

రంగడు;] వెంటనే లేచి మిగిలిన ఇద్దరూ మరిచిపోయినదాన్ని తను చెపున్నట్లు] 'కస్తూరం' నలిపితే పొడిపొడిగా మారును సార్.

పం: 'కస్తూరం' ఏమిటిరా గాడిదల్లారా?

రం: అదేసార్ - హారతి యిచ్చేది.

పం: ఓహో - కస్తూరానికి వచ్చిన తిప్పలా యిది!... కస్తూరిని గురించి పాఠం చెప్తుంటే వినక, కర్పూరం అనుకొని ఆ రెండు మాటలనీ కలిపి 'కస్తూరం' అని ఒకటి కొత్తగా సృష్టించారు— ఈ ఓనమాలు రాని వాజమ్మలు...ఊ! ఎక్కండి బెంచి ఎక్కండి.

సీరియల్

విచిత్ర వ్యక్తి



మూలం:- మార్క్ ట్వేన్

[illegible]——ఆస్ట్రియాలోని ఈ జెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడువాళ్లైఅయిన సెప్పి, నికొలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీది మా ఆట స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తివచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలుచేసి చూపించాడు. అతడు మాతో ఉన్నంతసేపూ మానవజాతిని నానాబూతులు తిట్టాడు. మానవులు తామేదో గొప్పవారమని అనుకుం టారుగాని నిజానికి వారిలో ఉన్న నైచ్యం ఇంకెక్కడా ఉండదని అన్నాడు. చివరికి మాయమైపోయాడు. మా వూళ్లో ఫాదర్ పీటర్ అని ఒక మతగురువు ఉన్నాడు. ఆయన ఏ నేరమూ చెయ్యకపోయినా, పదవినుండి తొలగించబడ్డాడు. ఆయనకి సహాయంచెద్దా మనో, ఏమో సైతాను పదకొండువందల బంగారునాణాలు ఆయనకిదొరికేట్టుచేశాడు. ఫాదర్ పీటర్‌కు విరోధియైన ఒక జ్యోతి ష్కుడు ఆ డబ్బు తన దగ్గరనుండి దొంగిలించబడిందని ఆరోపణచేశాడు. వెంటనే ఫాదర్ పీటర్‌ను జైల్లో పడేశారు. ఆయన కుటుం బానికి సైతాను మళ్లీ సహాయంచేశాడు.

6

మరుక్షణంలో మేము ఒక ఫ్రెంచిగ్రామంలో ఉన్నాము. అదేదో పెద్ద ఫ్యాక్టరీ; ఆడవాళ్లు, మగవాళ్లు, పిల్లలు చాలామంది వంచిన నడుము ఎత్త కుండా పనిచేస్తున్నారు. ఫ్యాక్టరీలోపల నిప్పులు చెరుగుతున్నంత వేడిగా వుంది; దుమ్ము, పొగ కలిసి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అంత దుర్భరమైన వాతావరణంలో పనివాళ్లు, చిరిగిన పేలికలు ధరించి, వాడిన ముఖాలతో, వంగిన శరీరాలతో, ఆకలితో నీరసించి, అలసటతో కుంగిపోయి, పనిచేస్తున్నారు. నేనూ, సైతాను అదృశ్యరూపాలతో వారిమధ్య సంచరిస్తున్నాము. సైతాను ఇలా ప్రారంభించాడు:

"చూశావా థియొడోర్! మీ మానవుల ధర్మాధర్మ విచక్షణజ్ఞానం? ఈ ఫ్యాక్టరీయజమానులు ధనవంతులు; గొప్ప దైవభక్తులు; వాళ్లు తమ తోటి మానవులైన ఈ కార్మికులకు ఇచ్చే జీతం ఎంతో తెలుసా? ఆకలికి మలమల మాడి చనిపోకుండా ఉండటానికి ఎంత అవసరమో అంతే ఇస్తారు. ఈ కార్మికులు ఇలా ఎంతసేపు పనిచేస్తారో తెలుసా? చలికాల మయేది, వేసవికాల మయేది, పిల్లలయేది, పెద్దవాళ్లయేది—రోజుకి పధ్నాలుగు గంటలు, పొద్దున ఆరంటినించి, రాత్రి ఎనిమిది గంటలదాకా పని చేస్తారు. వీళ్లు ఎలుక బొరియలలాంటి కొంపల్లో నివసిస్తారు. ఆ కొంపలనించి ఈ ఫ్యాక్టరీదాకా రానూ పోనూ ఎనిమిదిమైళ్లు, ప్రతిరోజూ, వానలో, ఎండలో, బురదలో, ధూళిలో, చలిలో, వడలో సంవత్సరాలతరబడి, బ్రతికివున్నన్నాళ్లూ, నడిచి వచ్చి ఇక్కడ శ్రమిస్తారు. వీళ్లు నిద్రపోయేది రోజుకి నాలుగ్గంటలసేపు. ఒక్కొక్క గదికి మూడేసి కుటుంబాల చొప్పున ఊహించటానికి చేతకానంత ధూళిలో, దుర్గంధంలో నివసిస్తారు. రోగాలు రాక ఏమవుతాయి? వస్తాయి; వీళ్లు ఈగలల్లాగ టపటపరాలిపోతారు. ఈశిక్ష అనుభవించటానికి వారేమైనా నేరాల్చు చేశా

అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు

విచిత్ర వ్యక్తి



కన్ను యథాస్థానంలో అమర్చాడు.

కంటావా? ఉహూ. ఏ నేరాలూ చెయ్యలేదు. మీ మూర్ఖ మానవజాతిలో పుట్టడమే వాళ్లు చేసిన నేరం! నేరం చేసినవాణ్ణి ఎంత చిత్రంగా హింసిస్తారో జైల్లో చూశావు. ఏ నేరం చెయ్యని వందలాది అమాయకులను ఎలా హింసిస్తారో ఇక్కడ చూస్తున్నావు. మీ జాతికి ఏ కోశానైనా మెదడు అనేది వుందంటావా? జైల్లో ఆ మతద్రోహి బాధకీ, ఈ కార్మికులు పడే బాధలకీ పోలిక లేదంటావా? అవును పోలిక లేదు. వీరి బాధలతో పోలిస్తే ఆ నేరస్థుని బాధ అతి స్వల్పం. అతన్ని మన మిటు వచ్చెయ్యగానే, రంపపు చక్రాల మధ్య నుంచో బెట్టి ముక్కలు ముక్కలుగా, పిండి పిండిగా చేసి ప్రాణం తీశారు. అతడు చనిపోయాడు. మీ మానవజాతినుంచి శాశ్వతంగా విముక్తుడయ్యాడు. కాని ఈ కార్మికులు—పాపం వీరు కొన్ని సంవత్సరాలుగా ప్రతిరోజూ చనిపోతూ వేవున్నారు. వీరిలో కొందరు మరికొన్నేళ్లదాకా జీవితంనుంచి విముక్తి పొందలేరు. చూశావా? ధర్మానికీ అధర్మానికీ తేడా తెలిసిన ఫ్యాక్టరీ యజమానులు చేసేపని ఇదీ. పైగా తాము కుక్కలకంటే గొప్పవారమని వారి భావన. ఎంత తెలివితక్కువజాతోయ్ మీది!"

సైతాను ఉపన్యాసం ఆపేసి మన సామ్రాజ్యాలను, యుద్ధాలను, మహారాజులను, మహారాణులను, వారి వీరగాధలను తనివితీరా వేళాకోళం చేశాడు. మనచరిత్ర తలుచుకున్న కొద్దీ అతడు చక్కిలి గింతలు పెట్టినట్లు నవ్వసాగాడు. ఆ నవ్వు ఎంత సేపటికి ఆగలేదు; వింటున్నకొద్దీ అసహ్యంవేసింది. చివరికి నవ్వు ఆపాడు. "మీ చరిత్ర ఇంత హేళన చెయ్యదగినది కాదులే. ఒక్కొక్కసారి మిమ్మల్ని, మీ అల్పత్వాన్ని తలుచుకుంటే జాలి వేస్తుంది."

ఇంతలో అన్నీ మాయమై, క్షణంసేపు శూన్యాకాశంలో తేలిపోయాను. కన్నుమూసి తెరిచేలోగా మా గ్రామంలో వున్నాను. ఇద్దరం నదివైపు నడుస్తున్నాము. చీకటి పడింది. వెనకనుంచి సంతోషపూరితస్వరం వినిపించింది; "వచ్చాడు, వచ్చాడు, అడుగో!"

ఆ కంఠం సెప్పీదని గుర్తుపట్టాను. చీకట్లో, నేనుగాని, సైతానుగాని అతని కళ్లకు కనబడకపోయినా, నాకు అనుభవమైనట్లే అతనికీ అనుభవం కలిగి సైతానుసాన్నిధ్యాన్ని గుర్తించగలిగాడు. మా దగ్గిరికి వచ్చి మా పక్కనే నడిచాడు. సైతాన్ని చూసి తన సంతోషం వెళ్లబోసుకున్నాడు. ఎంతో కాలం వియోగం అనుభవించిన ప్రియుడు ప్రియురాల్ని కలుసుకున్నట్లు ఆనందపారవశ్యంలో పరవళ్లు పెట్టాడు.

మా గ్రామంలో హాన్స్ ఆపర్ట్ అని ఒక తిరుగుబోతు ఉండేవాడు. వాణ్ణిగూర్చి చెప్పసాగాడు సెప్పీ. వాడు రెండు రోజుల్నించీ ఊళ్లో కనిపించటంలేదట. గ్రామస్థులు వాడేమయ్యాడా అని చర్చలపై చర్చలు చేస్తున్నారట. సెప్పీ ఇంకా ఇలా చెప్పాడు.

"వాడికో కుక్క వుంది. ఎప్పుడూ ఆ కుక్కని చితగ్గొడుతూవుంటాడు. రెండు రోజులకిందట ఏమొచ్చిందో ఏమో దాన్ని పట్టుకుని బాదటం మొదలెట్టాడు. నేనూ, థియొడోర్ వాణ్ణి బతిమాలాము

కొట్టవద్దని. మా మాటలు వినకపోగా, కుక్కని ఇంకా కొట్టాడు. ఆ కొట్టడంలో పాపం దాని కన్నొకటి ఊడి వచ్చేసింది. ఛీ! వాడు మనిషి కాదు. పశువు, మృగం, జంతువు..." సెప్పీకంఠం కోపంతో, కరుణతో వణికింది.

నాకు తెలుసు సైతాను ఏమంటాడో. సరిగ్గా నేనూహించినట్టే అన్నాడు: "కాదు సెప్పీ! అలా తిట్టబోకు. జంతువు లెప్పుడూ అలాటిపనులు చెయ్యవు. మానవులే చెయ్యగలరు."

"పోనీ జంతువులుకూడా చెయ్యవనుకో. ఏమయినా అది అమానుషం, రాక్షసం, పైశాచికం అంటాను."

"అదిగో మళ్లీ పొరపాటు పడుతున్నావు సెప్పీ! అది అమానుషం కాదు; మానుషమే. ముమ్మాటికీ అది మానుషకార్యమే. మానవ హృదయంలో తప్ప ఇంకెక్కడా లేని క్రూరస్వభావాన్ని ఉన్నత శ్రేణి ప్రాణులకు అంటకట్టడం అన్యాయం. మీరు జంతువులని పిలిచే ప్రాణులున్నాయే, వాటిలో వేటికీ ధర్మాధర్మ విచక్షణజ్ఞానం లేదు. సెప్పీ! మీ భాషని కొంచెం మరమ్మతుచెయ్యి. జంతువు, పశువు ఇత్యాది దూషణపదాల్ని తీసి వెయ్యి."

సైతాను కొంచెం కఠినంగానే మాట్లాడాడు. సెప్పీ ఎంతో నొచ్చుకున్నాడు. సైతానుకు కోపం తెప్పించానని బాధపడ్డాడు. కొంతసేపు ముగ్గురం నిశ్శబ్దంగా నడిచాము. ఆ నిశ్శబ్దం మరీ బాధ కలిగించింది. కాని ఇంతలో నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ ఒక సన్నని మూలుగు వినబడింది. హాన్స్ ఆపర్ట్ కుక్క కుంటుతూ మమ్మల్ని సమీపించింది. దానికన్ను ఒకటి స్థానం తొలగి వేళ్లాడుతోంది. అది సరాసరి సైతానువద్దకు పోయి ఏడుస్తున్నట్టు మూలిగింది. సైతాను కూడా మూలుగుతున్నట్టే సమాధానమిచ్చాడు. సైతానూ, ఆ కుక్కా కుక్కల భాషలో మాట్లాడుతున్నట్టు మా కర్థమైంది.

అప్పటికి చంద్రుడు ఉదయించాడు. పల్చటి తెరల్లాగ పరుచుకున్న చంద్రకాంతిలో పచ్చికమీద ముగ్గురం కూర్చున్నాము. సైతాను కుక్కను దగ్గిరికి తీసుకుని దానితల ఒళ్లో పెట్టుకున్నాడు. కన్ను యథాస్థానంలో అమర్చాడు. కుక్కకు బాధ తీరిపోయి, సంతోషంతో తోకాడించింది; సైతాను చెయ్యి పేమగా నాకింది; తనభాషలో ఏదో చెప్పింది; బహుశా తన కృతజ్ఞత తెలిపివుంటుంది. తరవాత అదీ, సైతాను కొంతసేపు ఏదో సంభాషించారు. సైతాను మాతో చెప్పాడు:

"తన యజమాని బాగా తాగి వొళ్లు తెలియక తన్ను కొట్టాడని చెబుతోంది."

"అవును. అప్పుడు బాగా తాగివున్నాడు," అన్నాము మేము.

"తన్ను కొట్టిన తరవాత అడవుల్లోకి వెళ్లి ఒక కొండ గుట్టమీంచి కిందకి దొర్లి పడిపోయాడని ఇది చెబుతున్నది. అది చూసి తను గ్రామంలోకి వెళ్లి తన యజమానిని రక్షించమని వాళ్లనీ వీళ్లనీ బతిమాలిందట. కాని ఒక్కరూ వినిపించుకోలేదట."

మాకప్పుడు జ్ఞాపకం వచ్చింది, ఈకుక్క రెండు రోజులకిందట మాదగ్గిరికి వచ్చి మూలగటం, మాకేమీ అర్థంకాక దాన్ని పొమ్మనటం.

సైతాను కుక్క చెప్పిన మాటలు తర్జుమా చేసి చెప్పాడు: "తన యజమాని ప్రమాదస్థితిలో వున్నాడని ఇతర గ్రామస్థుల సహాయం కోసం ప్రయత్నించిందట. తనే ఈ రెండు రోజుల్నించీ తిండీ, నిద్రా లేకుండా యజమానివద్ద కాపలాగా కూర్చుందిట. చూశారా, తన్ను హింసించిన యజమానిపై ఈకుక్కకెంత విశ్వాసమో? ఇప్పు డేమంటారు, మీ జాతిని గూర్చి? మీమతగురువులు చెప్పే స్వర్గానికి అర్హు లెవరు? మీరా, ఈ కుక్కా? ఈ కుక్క మీ దగ్గిర్నించి నేర్చుకోవలసిన నీతు లింకా ఏమన్నా వున్నాయా?"

ఇలా అని సైతాను కుక్కతో ఏదో మాట్లాడాడు. వెంటనే అది సంతోషంతో గంతులువేస్తూ ఏది చెబితే అది చెయ్యటానికి సిద్ధంగా వున్నట్లు కనబడింది.

"థియొడోర్! మీరిద్దరూ గ్రామంలోకి వెళ్లి కొందరు మనుషులను వెంటబెట్టుకుని రండి. హాన్స్ ఆపర్ట్ పడివున్నచోటు ఈకుక్క చూపిస్తుంది. మతగురువును కూడా అక్కడికి తీసుకువెళ్లి, ఆ తిరుగుబోతు స్వర్గానికి వెళ్ళే ఏర్పాట్లు, అవీ చేయించండి. వాడికిక ఆట్టే గడువులేదు," అన్నాడు సైతాను. వెంటనే మాతో చెప్పనైనా చెప్పకుండా అంతర్హితుడై పోయాడు.

మేము గ్రామంలోకి వెళ్లి ఫాదర్ అడాల్ఫ్‌ను,

★ విచిత్ర వ్యక్తి ★

మరికొందరిని వెంటబెట్టుకుని హాన్స్ ఆపర్ట్ ఉన్న కోటికి వెళ్లాము. మేము వెళ్లిన కాసేపటికి అతడు స్పృహ రాకుండానే ప్రాణం విడిచాడు. అతని చింపుడు కుక్క తప్ప అతనికోసం కంటతడిపెట్టిన వారు లేరు. కుక్క అతని ముఖం నాకుతూ, ఏడుస్తూ చుట్టూ తిరుగుతోంది. హాన్స్ ఆపర్ట్‌కి బంధువులూ లేరు; డబ్బూ లేదు. అందుచేత అతన్ని అక్కడే శవపేటిక వగైరాలేమీ లేకుండా గొయ్యి తవ్వి పాతిపెట్టారు మరొక గంటముందు వచ్చివుంటే అతనికై మతగురువు ప్రార్థనాదికం చెయ్యటం, అతడు స్వర్గానికి పంపించబడటం జరిగేది. ఇప్పుడా అవకాశం పోయింది. హాన్స్ ఆపర్ట్ శాశ్వతంగా నరకానికి వెళ్లిపోయాడు. లోకంలో అనేకులు వృథాగా కాలం గడిపే వారున్నారు. వారి కాలంలో ఒక్కగంట హాన్స్ ఆపర్ట్‌కు లభించివుంటే అతనికి శాశ్వత నరకం గాక శాశ్వత స్వర్గం లభించి వుండేది. అప్పుడు నాకు తెలిసి వచ్చింది, కాలం ఎంత అమూల్యమైనదో. హాన్స్ ఆపర్ట్ దుర్గతికి సెప్పీ ఎంతో విచారించాడు. మనుష్య జన్మకంటే కుక్క జన్మే నయమనీ, స్వర్గ నరకాలబాధ దానికి లేదనీ అన్నాడు. కుక్కని ఇంటికి తీసుకుపోయి పెంచుదామనుకున్నాము. ఇద్దరం దిగులుగా గృహాభిముఖంగా నడుస్తున్నాము. సెప్పీకి మంచి ఆలోచన తట్టింది. కుక్క తన యజమానిని క్షమించినట్లు కనిపిస్తున్నదనీ, కుక్కగనక క్షమిస్తే బహుశా దేవుడు కూడా క్షమిస్తాడనీ, ఆ విధంగా హాన్స్ ఆపర్ట్‌కి నరకం తప్పుతుందనీ అన్నాడు.

తరవాత వారంరోజులదాకా సైతాను రాలేదు. ఒంటరితనం దిగులుగా గడిచింది. మాకు అప్పుడప్పుడు మార్గరెట్‌ని చూడాలనిపించేది గాని, అవి వెన్నెలరాత్రులు; ఎంత రహస్యంగా ఇంటినుంచి తప్పించుకు పోదామనుకున్నా ఎవరికో ఒకరికి కంట పడక మానము. అందుచేత ఆ ప్రయత్నం మానేశాము. కాని రెండు మూడు పర్యాయాలు ఉర్సులా పిల్లిని వెంటపెట్టకుని కనిపించింది. మార్గరెట్ కులాసాగానే ఉందనీ, ఇంట్లో ఏ ఇబ్బందులూ లేవనీ ఆమె చెప్పింది. వృద్ధదాసి చక్కని కొత్త దుస్తులు ధరించి డబ్బు చేతిలో ఆడుతున్న మనిషివలెనే కనిపించింది. పిల్లి రోజుకి నాలుగు వెండి నాణాలూ ఖచ్చితంగా ఇస్తున్నదనీ, భోజనం, సారాయం మొదలైనవాటికి కూడా అదే అదనపు ఏర్పాట్లు చేస్తున్నందున రోజూ వచ్చే నాలుగు నాణాలూ నిలవలో పడుతున్నాయనీ కూడా ఉర్సులా చెప్పింది.

మార్గరెట్ ఒంటరిగా ఉంటున్నా దిగులుగా లేదనీ, అప్పుడప్పుడు విల్హెల్మ్ మీడ్లింగ్ వచ్చి పలకరించి పోతున్నాడనీ ఆమె అన్నది. ప్రతిరోజూ మార్గరెట్ తినుబండారాలు పట్టుకుని జైలుకి వెడుతోందట, జైల్లోఉన్న ఫాదర్ పీటర్ కూడా ఆరోగ్యం కోలుకున్నాడట. మేము ఫిలిప్ ట్రామ్‌ను మళ్లీ ఒకసారి తమ ఇంటికి తీసుకువస్తే బాగుండు ననుకుంటోందట. ఉర్సులా తనకు కూడా అతన్ని చూడాలని వున్నట్లు చెప్పింది. అతన్ని గూర్చి, ముఖ్యంగా అతని పినతండ్రిని గూర్చి చాలా అడిగింది. సెప్పీ, నికొలాస్ నవ్వారు. నేను వాళ్లతో అంతకుముందే చెప్పాను, సైతాను తన పినతండ్రిని గూర్చి కోతలు కోసి ఉర్సులాను ఉబ్బించాడని. ఉర్సులా ప్రశ్నలకు మేము సమాధాన మివ్వలేదు. ఇద్దామనుకున్నా నోళ్లు కట్టుపడిపోతాయిగా!

ఉర్సులా మరొక కబురుకూడా చెప్పింది. డబ్బు దండిగా ఉన్నందున, ఇంటిపనులు చేసేందుకు ఒక నౌకరుకుర్రాణ్ణి కుదుర్చుకున్నామని తెలిపింది. అది మామూలు విషయమైనట్టు నిర్లక్ష్యంగా చెప్ప జూచింది; కాని ఎంత ప్రయత్నించినా ఆమె సంతోషం ఆగలేదు. నౌకరు కుర్రాడిపేరు గాట్‌ఫ్రీడ్‌నార్ అని చెప్పింది. ఆ పేరు వినగానే మాకు మనస్సులో ఆందోళన బయలుదేరింది. మేము బాలురమైనా, ప్రపంచజ్ఞానం అట్టే లేకపోయినా కొన్ని విషయాలు గూర్చి మాకు నిశ్చితమైన పరిజ్ఞానం ఉన్నది. గాట్‌ఫ్రీడ్‌నార్ మంచి కుర్రాడే; అతనిలో ఎటువంటి దోషమూ లేదు; కొంచెం మందబుద్ధి గలవాడుతప్ప దుర్బుద్ధి అణుమాత్రమూ లేనివాడు. అయినా వాణ్ణి నౌకరుగా ఏర్పాటు చేసుకోవటం మంచిది కాదని తోచింది. ఎందుకంటే వాడి నాయనమ్మ మంత్రగత్తె అనే

ఆరోపణ మీద ఆరునెలల కిందటే భస్మీభూతం చేయబడింది. కుటుంబంలో ఒకరు మంత్రగత్తె అయినప్పుడు మిగతా వారిలో కూడా ఆదోషం కొంత గాకపోతే కొంతైనా ఉండకపోదు. పైగా ఈకాలంకూడా మంచిదికాదు. కొద్దిరోజులుగా మా పరగణాలో మంత్రగత్తెలవేట ముమ్మరంగా సాగుతున్నది. ఈవేట యాభై అరవై ఏళ్లలోగా ఎన్నడూ ఇంత ఉధృతంగా విజృంభించలేదట. మంత్రగత్తె అనే మాట వినిపిస్తే చాలు ప్రాణాలు పైనే ఎగిరిపోయేవి. పూర్వకాలంలో వృద్ధ స్త్రీలు మాత్రమే మంత్రగత్తెలుగా ఉండేవారు. ఇప్పుడలా కాదు—అన్ని వయస్సుల్లో వారూ, ఆఖరికి ఎనిమిది తొమ్మిదేళ్ల పిల్లలు కూడా మాంత్రిక శక్తులు సంపాయిస్తున్నారు. ఆడవాళ్లయేది, మగవాళ్లయేది, పిల్లలయేది, పెద్దలయేది, ఎవరు పడితే వాళ్లే సైతానుకు ఆత్మలమ్ముకోవటం, శక్తులు సంపాదించటం జరుగుతోంది. మా ప్రాంతంలో మాంత్రికులనేవాళ్లు లేకుండా నిర్మూలం చెయ్యటానికి తీవ్రమైన ఉద్యమం కొనసాగింది. కాని ఎంతమందిని తగలబెడితే అంతమంది మళ్ళీ తయారవుతున్నారు.

మావూరికి పదిమైళ్ల దూరంలోవున్న ఒకవూళ్లో ఒక సంఘటన జరిగింది. బళ్లో చదువుకుంటున్న ఒక బాలికకు వీపు ఎర్రగా దద్దుర్లతో నిండివున్నట్లు ఉపాధ్యాయులు కనిపెట్టారు. అవి సైతాను వేసిన గుర్తులని వారు అనుమానించారు. బాలిక భయపడింది. అవి దోమకాట్లనీ, తను ఏదోషం ఎరగననీ, తన్ను రక్షించవలసిందనీ మొత్తుకుంది. కాని ఉపాధ్యాయులు విడిచిపెట్టలేదు. బళ్లోవున్న బాలికలందరినీ పరీక్షించారు. యాభైమంది బాలికలకీ మొత్తం మీద వీపులు కొంచెం ఎర్రఎర్రగానే వున్నాయి; పదకొండుగురు బాలికల వీపులుమాత్రం అనుమానించదగినంత ఎర్రగా వున్నాయి. ఈ విషయం దర్యాప్తు చేయటానికి ఒక కమిటీ ఏర్పాటైంది. విచారణ చేయగా ఆ పదకొండుగురు బాలికలు తల్లుల కోసం ఏడ్చారు తప్ప, సైతానుతో తాము ఒడంబడిక చేసుకున్నట్లు ఒప్పుకోలేదు. వారిని వేర్వేరు చీకటి గదుల్లో పెట్టి పదిరోజులపాటు బంధించారు. మాడిపోయిన రొట్టె, నీళ్లుతప్ప వారికి వేరే తిండిలేదు. పదకొండో రోజుకి బాలికలంతటా నీరసంవల్ల ఏడవటం మానేశారు; జబ్బులుపడి లేచినవాళ్ళలాగ తయారయ్యారు; తిండి తినరు; పలకరు, ఉలకరు; కర్రల్లాగ బిగుసుకుపోయి కూర్చున్నారు. మళ్ళీ విచారణ చెయ్యగా వారిలో ఒకపిల్ల చేసిన పాపం చెప్పేసింది. చీపురుకట్టలమీద ఎక్కి గాలిలో తేలుతూ నిర్జన పర్వతాల్లోకి అనేకసార్లు వెళ్లామనీ, మంత్రగత్తెలు చేసుకునే ఉత్సవాల్లో పాల్గొన్నామనీ, సైతానుతో కలిసి నాట్యం చేశామనీ, మతగురువులను, దేవుణ్ణి నోటికి వచ్చినట్లు తిట్టామనీ ఆమె వాఙ్మూలం ఇచ్చింది. ఆ పిల్ల తనంతట తనే ఈ విషయాలన్నీ చెప్పిందనుకోగూడదు. ఆమెకు ఇదంతా వివరంగా జ్ఞాపకం లేనందున కమిటీసభ్యులే "జ్ఞాపకం" చేశారు. "చీపురు కట్టలమీద ఎక్కి వెళ్లారా?" అని కమిటీవారు ప్రశ్న వేస్తారు. పదిరోజుల్నించి తిండీ తిప్పలూ లేక నీరసించివున్న ఆ పిల్ల "అవును" అని సమాధానమిస్తుంది. ఆ పాయింటు జాగ్రత్తగా రికార్డు చేస్తారు. తరవాత "సైతానుతో నాట్యం చేశారా?" "దేవుణ్ణి, మతగురువులను తిట్టారా?" మొదలైన ప్రశ్నలు వరసగా వేస్తారు. అన్నిటికీ ఆపిల్ల "అవు"నని, సమాధానమిస్తుంది. ఆ పాయింట్లన్నీ ఆమె స్వయంగా చెప్పినట్టే రికార్డు చేస్తారు. ఈవిధంగా ముక్కుపచ్చలారని బాలికనుంచి వాఙ్మూలం తీసుకోబడుతుంది. కమిటీ సభ్యులకు ఏమేమి ప్రశ్నలడగాలో క్షుణ్ణంగా తెలుసు. ఎందుకంటే ఇటువంటి అవాంతరాలు వస్తాయని రెండువందల ఏళ్లకిందటే ఎవరో ఒక "ప్రశ్నావళి" తయారు చేసి వుంచారు.

తమలో ఒకపిల్ల ఒప్పేసుకుందని తెలియగానే మిగతా పదిమంది బాలికలూ కిక్కురుమనకుండా సైతానుతో తమకు సంబంధం ఉందని ఒప్పుకున్నారు. అప్పుడు వారందరినీ కట్టగట్టి కట్టెలమోపులు తగలపెట్టినట్లు తగలపెట్టారు. ఈ "అద్భుత దృశ్యం" చూట్టానికి చుట్టుపక్కల ఊళ్లనుంచి తండోపతండాలుగా ప్రజలు తరలివెళ్లారు. నేనుకూడా వెళ్ళాను. తగలబడేవారిలో ఒకపిల్ల నాకు స్నేహితురాలు. ముద్దులొలికే ఆమె చిన్నారిముఖం నేనెన్నటికీ మరవలేను. ఆమెతల్లి గుండెలు పగిలిపోయేట్లు "ఓయి నాయనో! ఓయి దేవుడో!" అని ఏడుస్తుంటే, ఆ బాలికలు కణకణ కాలిపోతుంటే, చూడలేక అవతలకు వెళ్లిపోయాను.

ఆ డాక్టరు గారు అతి మిత భాషి. కొంపకి నిప్పంటు కొన్నా రెండు మాటలకుమించి మాట్లాడని మనిషి. అల్లాంటి ఆ వైద్యుడి దగ్గరకు ఒక రోజున ఒకామె వచ్చి, యింత ఎత్తున వాచిపోయి వున్న చేతిని చూపించింది.

"కాలిందా" అని అడిగాడు డాక్టరు.

"బెణికింది" అని ఆవిడ ముక్తసరిగా సమాధానం యిచ్చింది. డాక్టరు గారు మందు వేసి పంపించాడు.

ఆవిడ మర్నాడు మళ్లీ వచ్చింది.

"తగ్గిందా?" అని డాక్టరు అడిగారు.

"ఎక్కువైంది." అని ఆవిడ సమాధానం యిచ్చింది. డాక్టరు గారు మందు మార్చి వేసి పంపించారు.

రెండు రోజుల తరువాత ఆవిడ మళ్లీ వచ్చింది.

"తగ్గిందా?" అని అడిగాడు డాక్టరు

"ఫీజు ఎంత?" అని ఆవిడ అడిగింది.

"ఏమీ అక్కర లేదు. ఇంత ముక్తసరిగా మాట్లాడే స్త్రీ అంటూ మీరొక్కరు కనిపించారు. నాకు అంతే చాలు!" అన్నాడు ఆ డాక్టరుగారు.

★

ఇక మార్గెరెట్ ఇంట్లో నౌకరుగా కుదిరిన గాట్ ఫ్రీడ్ నార్ విషయానికి వద్దాం. అతని నాయనమ్మ తల కాయ నెప్పులను తమాషాగా నయం చేసేది. తల, మెడ కొంతసేపు నిమిరేది; చేత్తో తీసేసినట్టు తలనెప్పి మాయమయ్యేది. ఇది సైతానుపనేనని ఆరోపణ చేశారు. మంత్రగత్తెల కమిటీవారు ఆమెను విచారణకు పిలిపించారు. ఆమె విచారణ అవసరం లేకుండానే ఒప్పుకున్నది. మర్నాడు ఆమెకు దహనశిక్ష జరుగుతుందని ప్రకటించారు. గ్రామ మధ్యంలో చితి ఏర్పాటైంది. పోలీసులు ఆమెను తీసుకువచ్చి, మరొక మంత్రగత్తెను తీసుకురావటానికి వెళ్లారు. ఆమె చితివద్ద కూర్చుని, అది శీతాకాలపు ఉదయం కావటంచేత వళ్లు వెచ్చబెట్టుకుంటోంది. నేను ఆమెను సమీపించి ఎవరూ చూడకుండా ఒక ఆపిల్ పండు ఇచ్చాను. ఇంతలో మరొక కొత్తవాడెవడో వచ్చాడు. ఎవరూ వినకుండా ఆమెను చూసి "అయ్యో, పాపం" అని జాలిపడ్డాడు. "నువ్వు ఒప్పుకున్న విషయం నిజమేనా?" అని అడిగాడు. ఆమె కాదన్నది. కొత్తవాడు ఆశ్చర్యపడి "అయితే ఎందుకు ఒప్పుకున్నావు?" అన్నాడు.

"నేను బీదముండని. కూలినాలి చేసుకుని పొట్ట పోసుకునేదాన్ని. వాళ్లన్నది ఒప్పుకుంటేనే మంచిదని ఒప్పుకున్నాను. ఒప్పుకోకపోతే బహుశా విడిచిపెట్టేవాళ్లేమో. కాని విడిచిపెట్టినా, నేను మంత్రగత్తెననే అనుమానం ఎవరికీ పోదు. అమీదట నాకెవరూ కూలిపని ఇవ్వరు. నన్ను చూసి దూరంగా తొలిగిపోవటమో, కుక్కలను ఉసికొలపటమో చేస్తారు. నేను మలమల మాడి చావటం తప్ప ఇంకేమీ ఉండదు. అంతకంటే ఇలా కాసేపు తగలడి చావటమే మంచిది. మీరెవరో జాలిగుండె మనిషల్లే వున్నారు. మీరాడిన మంచిమాట మరిచిపోను."

★

అని ఆ వృద్ధస్త్రీ మంటకు దగ్గరగా జరిగి కూర్చుంది. అప్పటికి జనం బాగా పోగయ్యారు. ఎవరో ఒక కోడిగుడ్డు విసిరారు. అది ఆమెకంటికి తగిలి, పగిలి, ముఖమంతా అయింది. ఈ హాస్య చేష్టకి జనం గొల్లున నవ్వి తమ ఆనందం ప్రకటించారు. తరవాత కాసేపటికి వృద్ధస్త్రీకి యథావిధిగా సజీవ దహనసంస్కారం జరిగింది.

ఒకసారి సైతానుకు మాటలసందర్భంలో పదకొండుగురు బాలికల సంగతి, వృద్ధస్త్రీసంగతి చెప్పాను. అత డేమీ చలించలేదు. "మానవజాతి స్వభావమే అంత" అన్నాడు. "మానవజాతి చర్యలు పట్టించుకోవలసినంత ముఖ్యమైనవి కా"వన్నాడు. "మానవజాతి పుట్టడం ఎరుగుదును. మానవుడు మట్టితో తయారయ్యాడని కొందరంటారు. అది అబద్ధం. బురదతో తయారయ్యాడు. కనీసం అంతా కాకపోతే కొంత భాగమైనా బురదతో తయారు చెయ్యబడ్డాడు," అన్నాడు. అతని అభిప్రాయం నాకర్థమైంది; మానవునికున్న ధర్మాధర్మ విచక్షణజ్ఞానం

(౬౬-వ పేజీ చూడండి)



అరుణా వారి "గుమాస్తా" లో పండరీబాయి.



అశోకావారి "నాచెల్లెలు"లో నాయక నాయికలు రామశర్మ, వరలక్ష్మి.


సినిమాలో రచయితల స్థానం

సినిమాలో కథ చెప్పేది రచయితా, దర్శకుడా అనే ప్రశ్న చూస్తే వస్తోంది. కొందరు రచయితేనని, కొందరు దర్శకుడేనని అభిప్రాయపడుతున్నారు. సినిమాసృష్టి అనేది ఏ ఒక్కరి వల్లనూ అయ్యేపనికాదు. సినిమాకళ మిగతాకళలలాగా కాక, ఉత్పత్తిరీత్యానూ, తత్వరీత్యానూ కూడా అచ్చగా ఇరవయ్యో శతాబ్దానికి, పారిశ్రామికయుగానికీ చెందిన కళ. అనేకమంది కార్మికులు సమష్టిగా సహకరించి పనిచేస్తేనేగాని, ఏపరిశ్రమా ఎలా నడవజాలదో, సినిమాకూడా వివిధ వ్యక్తుల సమష్టి కృషి ఉంటేనేగాని బయట పడదు.

దర్శకత్వంలో నిపుణుడైన వ్యక్తికి చక్కని కథ రాయటం, చేతగాక పోవచ్చు. అది రచనలో అనుభవమున్న రచయిత చెయ్యవలసినపని. అలాగే రచయితకు తనరాసినకథను తెరకు అనుగుణంగా ఎలా పరిణమింపజెయ్యాలో, ఏమి 'షాట్' చెయ్యాలో, ఎలా 'షాట్' చెయ్యాలో తెలియకపోవచ్చు. అది దర్శకుడు చెయ్యవలసినపని. అందుచేత సినిమాకథ చెప్పటంలో ఇద్దరికీ భాగస్వామ్యమున్నది

అసలు సినిమాలో కథ చెప్పబడదనీ, చూపించబడుతుందనీ గుర్తిస్తే ఈ సమస్య చాలవరకు తీరిపోతుంది

అనేకులు కథలు రాస్తున్నారు. వీటిలో కథాలక్షణాలన్నీ అమరిన ఏకథ నైనా తీసుకుని సినిమాతీయవచ్చు. సినిమాలకు ప్రత్యేకంగా ఒకరకమైన కథ కావాలనే నియమం లేదు. కథగా బాగున్న ఏకథ అయినా పనికొస్తుంది. అందుచేత సినిమా




కథలో సన్నివేశాల్ని గురించి ఏకాభిప్రాయానికి రావడానికి దర్శకుడు, రచయితతో లెడంత చర్చ చెయ్యాలి. అరుణావారి "గుమాస్తా"ను కెమేరామేన్ డైరెక్టరు కృష్ణస్వామి, రచయిత ఆత్రేయ తర్జనభర్జన చేసి మరీ సెల్యులాయిడుకు వెక్కిస్తుంటారు. వెనక నిలబడింది అసిస్టెంట్ వమ్మాళ్వార్.

★

★

అరుణావారి 'గుమాస్తా'లో నాగయ్యగారు "లక్ష్మీ" అని కేక పెట్టాడు. కెమేరా పక్క ... నిలబడి వున్నది, డైరెక్టర్ కృష్ణస్వామి.



సినిమాలో రచయితల స్థానం

సృష్టిలో రచయితకన్న దర్శకుడు చేయవలసినపనే ఎక్కువ ఉంటుంది.

సినిమా షూటింగ్‌కు 'షూటింగ్ స్క్రిప్టు' అనేది ఆధారం. తెరమీద మనం చూసే చిత్రంలోని ప్రతి అంశమూ ఈ స్క్రిప్టులో దర్శకుడు ముందుగా రాసుకుంటాడు. ఏ సీక్వెన్సు ఏయే సీనులుగా విభజించబడాలో, ఏ సీనులో ఎన్ని షాట్లు ఉండాలో, ఆ షాట్లు ఏ క్రమంలో రావాలో, ఒక్కొక్క షాట్‌లో నటులు నుంచునే భంగిమం, చేసేపని, కెమేరా ఏకోణంలో, ఎంతదూరంలో ఉండాలో, లైటింగ్ దేనిమీద ప్రధానంగా కేంద్రీకరించబడాలో, ఈ వివరాలన్నీ షూటింగ్ స్క్రిప్టులో రాసుకుంటాడు. (కనీసం తన చిత్రాన్ని ఉత్తమ కళాఖండంగా తయారు చెయ్యాలనుకొన్న ప్రతిదర్శకుడూ ఇలా రాసుకుంటాడు. మన సినిమారంగంలో సాధారణంగా షూటింగ్ స్క్రిప్టులే వుండవు. ఏ ఇద్దరు ముగ్గురు దర్శకుల్లో తప్ప ఇంత శ్రమతీసుకునేవారు లేరు.) రచయిత రాసినకథ సినేరియో దశలో ఎంతక్షుణ్ణంగా వున్నప్పటికి అసలు షూటింగ్ దృష్ట్యా అది ఇంకా అసమగ్రంగా ఉంటుంది. రచయిత ఉద్దేశించిన విషయాన్ని అనేక రకాలుగా తెరమీద ప్రదర్శించవచ్చు. ఇన్ని రకాలలో తెరమీద ఏది చూపిస్తే ప్రేక్షకుడిలో గరిష్ఠ శక్తివంతమైన ప్రత్యనుభూతి (*Reaction*) కలుగుతుందో దాన్నే దర్శకుడు ఎంచుకుంటాడు. పుడోవ్కిన "ఫిలిం టెక్నిక్" పుస్తకంలో రాస్తూ తను అనుసరించిన పద్ధతి చెబుతాడు. గోర్కీ రాసిన *Mother* నవలను పుడోవ్కిన్ సినిమా తీశాడు. ఆ చిత్రంలో నాయకుడు కారాగృహంలో కూర్చుని వుంటాడు. ఆ మర్నాడే అతనికి స్వేచ్ఛ లభిస్తుందని ఒక ఉత్తరం అందుతుంది. అతని సంతోషం తెరమీద చూపించవలసివచ్చింది. సంతోషం ప్రకటిస్తున్న ముఖాన్ని చూపితే ఒకరకమైన ఫలితం కలుగుతుంది. అంతకంటే మంచి ఫలితం కలగడానికని పుడోవ్కిన్ ఒకపని చేశాడు. సంతోషంతో కంపిస్తున్న అతని వేళ్ళను, చిరునవ్వుతో కొద్దిగా విప్పారిన పెదవుల చివరలను మాత్రమే పెద్దక్లోజప్‌లో ఫొటో తీశాడు. ఈ క్లోజప్ షాట్ల మధ్య పొంగి ప్రవహిస్తున్న సెలఏరు, నీటి అలలమీద తళతళ మెరిసే సూర్యకాంతి, చెరువులో స్వేచ్ఛగా ఈదులాడే పక్షులు, పసిపిల్ల నవ్వులు, మొదలైనవాటి షాట్లను కలిపాడు ఖైదీ దృశ్యాలద్వారా విడుదలకాబోతున్న ఈ సంతోషాన్ని అభివ్యక్తం చేయటానికి

ప్రయత్నించాడు. (సోవియెట్ చిత్రాలన్నిటిలోనూ ఈవిధమైన ఎడిటింగ్ వల్ల, ఒక విధమైన *Lyricism*, మనోహరమైన కావ్యగుణం కనిపిస్తాయి.) పుడోవ్కిన్ ఉపయోగించిన పద్ధతి అన్ని సందర్భాలకూ పనికిరాకపోవచ్చు. కాని ఆ పద్ధతి వెనక వున్న తత్వం (*Principle*) మాత్రం గమనించదగినది.

పైన చెప్పిన ఉదాహరణవల్ల సినేరియో రచనతో సినిమా రచన ఆగిపోదనీ, సినేరియోలో సూచించబడిన భావాలకు రూపకల్పన చేసి, నేత్రేంద్రియం ద్వారా ఆ భావాలను ప్రేక్షకుడికి అందజెయ్యవలసిన పని మిగిలివుంటుందనీ అర్థమవుతుంది. ఈ పని రచయితచేస్తే రచయితే దర్శక బిరుదానికి అర్హుడవుతాడు. అప్పుడు దర్శకుడు నిర్వహించవలసిన పని క్లాప్‌బోయ్ పనితో సమానమవుతుంది; అతనికి సృజనకార్యంలో భాగం వుండదు.

అయితే సినిమా సృష్టిలో ఒక్క రచయితే కాదు ఉండేది; కెమేరామన్, ఆర్టు డైరెక్టరు, మ్యూజిక్ డైరెక్టరు, సౌండ్ రికార్డిస్ట్ మొదలైన వివిధశాఖా నిపుణులుంటారు. ఈ శాఖల్లో ప్రతిఒక్కటీ అనంతమైన పరిధిగలది. అందుచేత సినిమా నిర్మాణంలో ఆయాశాఖల్లో ప్రత్యేక నైపుణ్యం సంపాదించినవారు ఉండటం అవసరం. ఇన్ని శాఖలవారి ప్రత్యేక నిపుణతనూ కథావసరాలకు అనుగుణంగా మలచటానికి ఒకే వ్యక్తికూడా అవసరం. ఈ అవసరాన్ని తీర్చేవాడినే దర్శకుడంటారు. ప్రతిశాఖలోనూ అనుభవం, విజ్ఞానం కలిగిన మనిషే దర్శకుడు కాగలడు. పద్యాలు రాయటానికీ, నాటకాలు రాయటానికీ ఒక టెక్నిక్ ఉన్నట్టే దర్శకత్వానికి కూడా ఒక టెక్నిక్ ఉన్నది. ఆ టెక్నిక్ జీర్ణించుకున్నవాడే దర్శకుడవుతాడు.

సినిమా స్క్రిప్టుకు సాహిత్యపు విలువ ఉన్నదా, లేదా అని మరొక ప్రశ్న ఉన్నది. సినిమాస్క్రిప్టు అనేది స్వయం సంపూర్ణమైన రచన కాదు. అది సినిమా షూటింగ్‌కు ఆధారంగా, సహాయకారిగా ఉండేందుకు చేయబడే రచన. అందుచేత సాహిత్యం కాదు. ఈ విషయంలో నాటకానికీ, సినిమా స్క్రిప్టుకు తేడా ఉన్నది. నాటకంకూడా ప్రదర్శనకోసం ఉద్దేశించి రాయబడేదే. అయినప్పటికీ నాటక రచన సాహిత్యంగా ఎందుకు పరిగణించబడుతున్నదీ? భావ వ్యక్తీకరణకు ప్రతికళా ఒక్కొక్క విలక్షణమైన సాధనం ఉపయోగించుకుంటుంది. చిత్రలేఖనం రంగులను, రేఖలను, సంగీతం రాగ, తాళబద్ధమైన ధ్వనులను ఉపయోగించుకుంటాయి. సాహిత్యం వచనంలో ఉన్నా

(50-వ పేజీ చూడండి)



సుప్రసిద్ధ నటుడు, నిర్మాత, దర్శకుడు అయిన, శ్రీ నాగయ్యగార్ని అరెస్టుచేసి పోలీసులు తీసుకుపోతున్నారు—నిజంగా కాదు, అరుణా వారి "గుమాస్తా" లో దృశ్యం యిది.

★

అరుణావారి "గుమాస్తా" షూటింగ్ దృశ్యాలు

★

షూటింగ్ మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకునేందుకు చెట్టనీడని చేరిన శ్రీ నాగయ్య, కెమేరా రహిమాన్, అసిస్టెంట్ ప్రసాదులు




జనవరిలో విడుదల
భార్యాబిడ్డలమీది మమకారంతో
స్వాభిమానాన్ని చంపుకునే
మానవత్వాన్ని సాధించిన మధ్య
తరగతి కుటుంబీకుని మహోజ్జ్వల
జీవిత గాథ.
నాగయ్య లింగమూర్తి
రామశర్మ. దొరస్వామి
రాజకుమారి. విద్య.
గిరిజ. ఛాయాదేవి
నటించిరి
ఆవరిండియా వారి
నా ఇల్లు
డైరెక్షన్.. నాగయ్య.
స్టూడియోస్
వాహిని
రేవతి
రచన
దేవులపల్లి యడవల్లి..
సంగీతం
నాగయ్య అద్దేపల్లి
నృత్యం
వెంపటి.
కెమెరా
రహిమాన్.
KRISHNA

ప్రశ్నలు - సమాధానాలు

పూటుకూరి సీతారామయ్యగుప్త—చీరాల
ధరించే పాత్రలనుబట్టి మన స్వభావాలు మారడానికి వీలుందా?

—మారే అవకాశం లేదు. నటనకీ సహజప్రవర్తనకీ చాలా తేడా ఉన్నది. నటన అనేది ఒక కళ. సహజ ప్రవర్తన కళ కాదు. మామూలుగా మంచి స్వభావం గల వ్యక్తి దుష్టునిపాత్ర ధరించి నటించవచ్చు. అంతమాత్రాన ఆ నటుని స్వభావంలో మార్పురాదు.

*　　*　　*

ఎస్. సి. రావు—తెనాలి
ఆడియోగ్రఫీ, స్టిల్ ఫొటోగ్రఫీ అంటే ఏమిటి? ఆడియోగ్రఫీకి, స్టిల్ ఫొటోగ్రఫీకి, సినిమా ఫొటోగ్రఫీకి గల తేడా లేమిటి?

—సౌండ్ రికార్డింగ్‌నే - ఆడియోగ్రఫీ అంటారు.

—మనుషులు గాని వస్తువులుగాని కదులుతున్నప్పుడు ఆ కదలికను పొడుగాటిఫిలిం మీద అనేక ఫ్రేములరూపంలో ఎక్కించటానికి ఉపయోగించబడేది సినిమా కెమేరా. శాస్త్రపరిభాషలో గాక మామూలుగా చెప్పాలంటే కదలికను ఫొటోగ్రాఫ్ చేసేది సినిమా ఫొటోగ్రఫీ. కదలికను కాకుండా ఒక భంగిమనుమాత్రమే ఫొటోగ్రాఫ్ చేసేది స్టిల్ ఫొటోగ్రఫీ.

ఎడిటరు నిర్మాత, దర్శకులు చెప్పిన రీతిగా ఎడిటింగు చేయవలెనా? లేక తన ఇష్టము వచ్చినట్టుగా (అనగా కథకు అనవసరమైనటువంటివి) ఎడిటింగు చేయవచ్చునా?

—కథకు ఏదో విధంగా ఉపయోగపడని షాట్లను కలపటానికి వీలేదు. ఎడిటరు స్క్రిప్టు ననుసరించే ఎడిట్ చేస్తాడు. ఒకవేళ దర్శకుడు షాట్లక్రమాన్ని మార్చమంటే మారుస్తాడు.

*　　*　　*

వి. వేణుగోపాల్ రెడ్డి—ముత్తుకూరు.
కెమేరామన్ వి. యన్. రెడ్డి రాజా ప్రొడక్షన్స్‌ను వదలివెళ్లుటకు కారణ మేమిటండి?

—వారికీ వీరికీ అభిప్రాయభేదాలు రావడంవల్ల.

*　　*　　*

దావలి నమశ్శివయ్య—వీరపల్లి
ప్రస్తుతం సినిమా పరిశ్రమకి తుపాను వంటి దెబ్బ తగిలిపోతోందంటున్నారు? అది సినీఆర్టిస్టుల అసమర్థతవల్లా? లేక ప్రజల నిరాదరణవల్లా?

—ఆర్థికమాంద్యం, పన్నుల భారం, చెత్తచిత్రాలు తయారవటం మొదలైన అనేక సినిమా పరిశ్రమ ప్రస్తుతస్థితిలో పడింది; సినిమా ఆర్టిస్టుల అసమర్థతవల్ల కాదు.

*　　*　　*

హెచ్. శ్రీనివాసరావు—నెల్లూరు.
వివాదానికి, విమర్శకు తావు లేనటువంటి ఉత్తమచిత్రాన్ని మీరు చూచారా?

—ఎంత ఉత్తమచిత్రంలోనైనా విమర్శకుని దృష్టికోణాన్ని బట్టి వివాదాస్పదవిషయాలుంటాయి. క్వాలిటీ విషయంలో ఇంకా మనచిత్రాలు ఇతర దేశ చిత్రాలు అందుకున్నస్థాయి అందుకో లేదని మా అభిప్రాయం.

ఉత్తమచిత్రాల కుండవలసిన లక్షణా లేమిటో తెలపండి

—మా సినిమా శీర్షికలో గడచిన రెండువారాలుగా ప్రకటించబడుతున్న వ్యాసాలు చదవండి

*　　*　　*

తోట వెంకటేశ్వరరావు—మదనపల్లి
సంఘ సమస్యలను, జీవిత సమస్యలను చూపించని కళ నిరర్థకమంటాను. మీ రేమంటారు?

—విభేదిస్తాను.



ధనాశకు లొంగిపోయి అభమూ శుభమూ ఎరగని ఒక అమాయకుణ్ణి వంచించి చివరకు పశ్చాత్తాపం పొందిన ఉంపుడుగత్తె లీల. అవ ఇండియావారి "నాయిల్లు"లో విద్యావతి.



భాస్కర్ ప్రొడక్షన్సువారి "బ్రతుకుతెరువు"లో నాగేశ్వర రావు. దువ్వూరి అన్నపూర్ణ.

సినిమాలో రచయితలస్థానం

(47-వ పేజీ తరువాయి)

పద్యంలో ఉన్నా మాటలద్వారా భావం ప్రకటిస్తుంది నాటకంకూడా అంతే నాటకాలలో, సంభాషణలే ప్రధాన సాధనం నటీనటులు నాటకాన్ని నటన ద్వారా ప్రదర్శించినప్పటికీ మాటల సహాయం లేనిదే వారి నటన పరిపూర్ణం కాదు. నాటకరంగస్థలం పరిమితమైనది నాటకం తెలియజేసే ప్రపంచం విశాలమైనది, బహు సూక్ష్మమైనది కూడాను ఈ ప్రపంచాన్ని నాటకరంగంమీద పరిపూర్ణంగా ప్రదర్శించటానికి వీలులేదు ఉదాహరణకి, యుద్ధదృశ్యాన్ని నాటక రంగంమీద ప్రదర్శించటం అసాధ్యం వేలకొలది సైనికులు పాల్గొనే యుద్ధపు దృశ్యాన్ని ప్రేక్షకులకు అందజేయ్యాలంటే నాటక కర్త యథార్థ ప్రదర్శన ద్వారా కాక ఇతర సాధనాలద్వారా అందజేస్తాడు. నాటక కర్తకు అనువైన సాధనం మాటలే భవభూతి ఉత్తరరామ చరిత్రంలో యుద్ధదృశ్యం వచ్చినప్పుడు వరసగా శ్లోకాలు రాసి యుద్ధం వర్ణిస్తాడు యుద్ధాన్ని రంగస్థలంమీదికి తీసుకురాలేక పోటమే దీనికి కారణం ఇలాగే మరొక ఉదాహరణ ఒక పాత్ర దుఃఖంలో ఉంటుంది రంగస్థలంమీద ఆ దుఃఖాన్ని ఎలా ప్రదర్శించాలి? "ఓయి నాయనోయ్" అని గుండెలు బాదుకుని ఏడవటానికి వీల్లేదు అది వికృతంగా వుంటుంది ఆమె కనుకొలకులనుంచి జొటజొట కన్నీరు కారినంత మాత్రాన దుఃఖం ప్రకటితం కాదు ఎంత కాంతిని కేంద్రీకరించినా కన్నీళ్లు ప్రేక్షకుడికి కనిపించే అవకాశం లేదు అందుచేత సముచితమైన మాటల ద్వారా ఆ పాత్ర తన దుఃఖం వెల్లడించవలసి వుంటుంది నాటకరంగం అనేదానికి టెక్నికల్‌గా ఇన్ని ఇబ్బందులుండటం మూలంగా నాటకకర్త తను చెప్పదలచిన దంతా సంభాషణలుగానో, స్వగతాలుగానో చెబుతాడు అవి ఎంత శక్తివంతంగా ఉంటే ఆ నాటకం అంత మంచి ఫలితాలు సాధించగలుగుతుంది, అంత ఉత్తమ సారస్వతం కాగలుగుతుంది

ఇక సినిమాస్క్రిప్టువిషయం చూద్దాం ఇందులో కూడా సంభాషణ లుంటాయి కాని స్క్రిప్టుకు అవే ప్రధానం కాదు ఎందుచేత? నాటకరంగస్థానికి కొన్ని ఇబ్బందు లున్నాయ న్నాము ఈ ఇబ్బందులు సినిమాలో తీరిపోతాయి కథారచయిత ఎంత ప్రపంచాన్ని చూపదలచుకున్నాడో అంత ప్రపంచాన్నీ సినిమాలో చూపించటానికి వీలున్నది బ్రహ్మాండమైన యుద్ధదృశ్యాలను, సమూహ దృశ్యాలను, కొండలు, అడవులు మొదలైనవాటిని యథాతథంగా సెల్యులాయిడ్ మీదికి ఎక్కించవచ్చు అలాగే పాత్ర ముఖంమీది ప్రతి కన్నీటి బిందువును, ప్రతి కదలికను క్లోజప్ ద్వారా ప్రేక్షకునికి చూపించవచ్చు అంతే కాక స్వగతాలు వగైరాలు అక్కర్లేకుండా పాత్ర మనస్సులో మెదిలే భావాలనుకూడా సూపర్ ఇంపోజిషన్ మొదలైన సాధనాల ద్వారా అద్భుతంగా చిత్రీకరించవచ్చు ఈ సులువు లుండటంవల్ల సినిమాకు సంభాషణలు అప్రధానం సంభాషణలు ప్రధానంగా వున్న చలనచిత్రం ఫోటో తియ్యబడిన నాటక మనిపించుకుంటుంది గాని సినిమా అనిపించుకోదు సినిమటోగ్రఫీ అనే సాధనంద్వారా ఎంతో విశాలమైన యాథార్థ్యాన్ని (*Reality*) ప్రదర్శించగల అవకాశం ఉన్నప్పుడు దాన్ని నాటకపు టెక్నిక్‌కు బానిసగా చెయ్యటం

సినిమాకళను ఖూనీ చెయ్యటం అవుతుంది. ఈ విషయాన్ని ముఖ్యంగా మన తెలుగు నిర్మాతలు ఎంత తొందరగా గ్రహిస్తే అంత తొందరగా మంచి చిత్రాలు తయారవుతాయి.

పైన చెప్పిన కారణాలవల్ల సినిమా స్క్రిప్టుకు సాహిత్యంగా విలువ ఉండదని తెలుతున్నది. ఒకవేళ ఏ సినిమాలోని సంభాషణలనైనా పుస్తకంగా ప్రకటించినా దానికి సాహిత్యగౌరవం రాదు. ఆ సంభాషణలలో కంటిన్యూయిటీ ఉండదు కనుక అవి ఎవడికీ అర్థంకావు. అలా కాక షూటింగ్ స్క్రిప్టునే పుస్తకంగా ప్రకటిస్తారనుకోండి. దాన్నిండా లాంగ్‌షాట్, మిడ్‌షాట్, క్లోజ్‌షాట్, ఫేడిన్, ఫేడవుట్ వగైరా టెక్నికల్ పరిభాష ఉండి పఠనయోగ్యం కాకుండా పోతుంది. ఒక ఇంజినీరు తను కట్టబోయే వంతెనకు కాగితంమీద ప్లాను వేస్తాడనుకోండి. ఆ ప్లాను బొమ్మలకు చిత్రలేఖన గౌరవం రాదు. ఒక మ్యూజిక్ డైరక్టరు తను చేసిన రాగకల్పనకు స్వరాలన్నీ కాగితంమీద రాస్తాడనుకోండి. ఆ స్వరాల అక్షరాలు సాహిత్యంగాని సంగీతంగాని కాజాలవు. సంగీతం అనేది పాడుతున్నప్పుడే ఉద్భవిస్తుంది. అలాగే సినిమా స్క్రిప్టుకూడా చలనచిత్రాల రూపంలో తెరమీద కనిపించినప్పుడే దాని లక్ష్యం, ప్రయోజనం సిద్ధిస్తుంది. అందుచేత దానికి సాహిత్యపు విలువ ఉందనటం, దాన్ని పుస్తకంలో చదువుతున్నప్పటికీ సంతృప్తి కలుగుతుందనటం హాస్యాస్పదం. ఒకవేళ ఎవరైనా స్క్రిప్టును పుస్తకంగా ప్రకటిస్తే స్క్రిప్టు స్వరూపం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే కుతూహలం గలవారు చదువుకోవలిసిందేతప్ప సాహిత్యంకోసం ఎవరూ చదవరు.

అయితే సినిమాలో రచయిత చేసేది మెకానికల్ వర్క్ అని ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు. సినిమా రచన ప్రయోజనం షూటింగ్‌కు ఉపయోగపడటమే నసీ, ఆ ప్రయోజనం సాధించటానికి రచయిత చేసే కృషికూడా సృజనాత్మకమైనదే (*Creative*) నసీ ఈ వ్యాసం ఉద్దేశ్యం. కథ పేలవమై, పాత్రలు నిర్జీవంగా ఉండి, కథలో డ్రమెటిక్ సన్నివేశాలు లేకపోతే ఎంత తెలివిగల డైరెక్టరూ ఏమీ చెయ్యలేడు. రచయిత స్వతహాగా సారస్వతంలో మునిగి తేలినవాడై ఉండాలి. ★

—(ఎన్నార్.)



రాజా ప్రొడక్షన్స్‌వారి "పుట్టిల్లు"లో సూర్యశ్రీ.

సినిమా వార్తలు

అశోకా ఫిలిమ్స్‌వారు కొంతకాలం క్రిందట తమిళంలో విడుదలచేసిన "ఎన్ తంగై" చిత్రం కథనే అనుసరించి తెలుగులో తిరిగి "నా చెల్లెలు" అనే చిత్రం నిర్మించారు. ఈ చిత్రం పూర్తయినట్లయితే, సంక్రాంతినాడు విడుదల చేయగలగవని తెలుస్తున్నది. జి. వరలక్ష్మి, రామశర్మ, అమరనాథ్, సూర్యకళ, అనసూయ, బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, చలం మున్నగువారు ఈ చిత్రంలో నటించారు. దర్శకుడు చిత్రపు నారాయణమూర్తి; సంభాషణలు సదాశివరాం; పాటలు ప్రయాగ; సంగీతం సాంబు.

* * *

సెసిల్. బి. డి మిల్ తీసిన "శామ్సన్ ఎండ్ డెలీలా" బాక్సాఫీస్ హిట్ కావటంతో మన నిర్మాతలకు ఆ కథమీదికి మోజు మళ్ళింది. వర్మాఫిలిమ్స్ అనే సంస్థవారు "ఔరత్" అనే పేరుతో ఈ కథపై ఫిలిం తీస్తున్నారు. బీనారాయ్ డెలీలాగాను, ఆమె భర్త ప్రేమ్‌నాథ్ శామ్సన్‌గాను నటిస్తున్నారు. ఈ చిత్రానికి భగవాన్‌దాస్ వర్మ దర్శకుడు; శంకర్, జైకిషన్ సంగీత దర్శకులు.

* * *

రమేశ్ సైగల్ తీస్తున్న "షికస్త్" అనే చిత్రంలో దిలీప్‌కుమార్, నళినీజయవంత్ మొదటిసారిగా కలిసి నటిస్తున్నారు. దు న్నే నాకి ఘోష్ అనే నినాదంమీద అల్లబడిన కథ ఈ చిత్రానికి ఆధారమట.

* * *

అశోక్‌కుమార్ స్వయంగా నిర్మిస్తున్న "పరిణీత" (శరత్ కథ) లో నాయికగా మీనాకుమారి, నాయకుడుగా అశోక్‌కుమార్ నటిస్తున్నారట. నాయకుని తమ్ముని పాత్ర అసిత్ బరన్ నటిస్తున్నాడట. ★

(11-వ పేజీ తరువాయి)

పోసుకో ... ఫో ... నవమాసాలూ మోసి కన్న, తల్లితీపునీ కేం తెలుస్తుంది?...ఫో.. ఇక నీకు నేభార్యనీకాదు-నువు నాభర్తవీ కాదు...ఫో యిక్కణ్ణుంచి ... (మీదబడి జుట్టు పీకుతూ) ఫోతావా-ఫోవా...

రా : (వదిలించుకుని) పోతాను...పోయి యేంచెయ్యాను?...నన్నిమ్మనా కొనేవాళ్లు లేరు. (మెల్లగా నడుస్తున్నాడు)

బం : (చరచరా వెళ్లి, బిడ్డనెత్తుకుని పొత్తిలిలో దాచుకుంటూ; భర్తవైపు యముని చూచినట్టు చూస్తుంది) ఇటురాకు ...నా కీ బిడ్డనన్నా దక్కనియ్...ఫో రాక్షసుడా...ఫో దూరంగా...

రా : ఆకలితో పగిలిన గుండెలు నీవి... మెల్లిగా మాట్లాడు...

బం : నీ తీపికబుర్లు నాకొద్దు..ఫోతావా ఫోవా (కోపం).

రా : పోతున్నాను ... ఏ గొయ్యిలో - నుయ్యిలో...(ఏడ్పును దిగమింగుకుంటూ వెళ్లిపోతాడు.)

బం: (ఆవేశంతో వివశయై బిడ్డను గుండెలకు హత్తుకునే, పడిపోతుంది.)

[క్షణంసేపు పూర్తిగా నిశ్శబ్దం...పసిబిడ్డ చలన రహితంగా వుంటుంది. బంగారం చేతులు పట్టుదప్పి, బిడ్డమీదినుంచీ ప్రక్కలకు జారతాయ్. బిడ్డ బెండులాగా జారి ప్రక్కనే పడివుంటుంది...రంగం ముందువైపున్న లైటుకాంతిఅడ్డబడుతుంది. తెల్లతెర స్పష్టమౌతుంది ... వెనుకవైపు లైట్లు వెలుగుతయ్. ఛాయాదృశ్యం మొదలౌతుంది...అభాగ్యులు కొందరు ఆకలిగీతం పాడుతూ, నీరసంగా ఒకవైపునుంచి మరోవైపుకు నడుస్తూ వెళ్లిపోతారు. ఇదే ఛాయాదృశ్య ప్రారంభ భాగం.]

[నేపథ్యగీతం-బృందగానంగా ఒక స్త్రీ ఒక పురుషుడూ కలసి పాడాలి. ప్రతీ చరణంలోని భావమూ ఛాయాదృశ్యంలో కనిపింపజేయాలి. ప్రతీచరణమూ చివరపెద్ద బ్రాకెట్లలోగల మాటలు పదిమందీ సమూహంగా గానంచెయ్యాలి.]

-ఛాయాదృశ్య-గీతం-

1. ఆకలితో, - ఆకలితో-
అణగారిన మానవులం;
ఆకలితో అహర్నిశలు-
అలమటించుమానవులం॥
ఆకలిదుశ్శాసనుండు -
అందరమూ ద్రౌపదులం;
మానం, అభిమానమ్ములు-
మాసిపోయె ఆకలితో॥
[ఆకలితో; ఆకలితో-
అలమటించు మానవులం]

2. విన్నారా అన్నలార-
అన్నాతుర ఆవేదన;
కన్నారా ఎన్నడైన-
కడుపుకొరకు కక్కుర్తులు?
బంధుమిత్ర ప్రేమలన్ని-
పటాపంచలైపోయెను,
దొరికినంత తనేతినుట-
దరిద్రునకు ధ్యేయమయ్యె॥
[ఆకలితో; ఆకలితో-
అణగారినమానవులం]

3. కనిపెంచినతల్లి, తండ్రి-
తనయునకే భారమైరి;
సతీపతుల యెడబాటులు,-
సహోదరులకొట్లాటలు;
గుప్పెడు మెతుకులకోసం-
గుండెల్లోబాకుపోట్లు;
పరులపిసరు ముట్టవెరచు-
పుణ్యాత్ములె దొంగలైరి॥
[ఆకలితో ఆకలితో-
అలమటించుమానవులం]

4. కడుపును కుంపటిలాగా-
కాల్చేఆకలికోసం-
బిడ్డనమ్మె తల్లిఅదిగో;-
భామికల్దిను పురుషుడడుగో;
యుగయుగాలు కొనియాడిన -
యువిదల పాతివ్రత్యం
ఎంగిలి మెతుకులకోసం -
భంగమాయె నడుగడుగో!॥
[ఆకలితో, ఆకలితో-
అణగారిన మానవులం]

5. ఆకలికోరలకు జిక్కి -
అన్నివెతలు గుడిచినాము;
ఆకలి మా హృదయాలను -
అగ్నిగుండములుగ జేసె;
ఆకలితో అలమటింత -
అరులకైన వలదు బాబు;
ఆకలి చేయించలేని -
అఘాయిత్యమేదీ లేదు॥
[ఆకలితో, ఆకలితో -
అలమటించు మానవులం]

[ఛాయాదృశ్యం ముగిసింది. పైన 4 వ చరణంలో - గౌరి, ఒక టోపీ మనిషి రొట్టె తింటూ, ముక్క చూపించగా చెయిజాపడం; అతడు కౌగిలించడం; ఆమె మొదట విడిపించుకొని, మరల రొట్టెకోసం ముద్దిచ్చి లోబడడం ఛాయాదృశ్యంలో కనిపించాలి......ఇప్పుడు రంగం ముందున్న లైటు బాగా వెలుగుతుంది......బంగారం పూర్వస్థితిలోనే వుంటుంది...రెండు నిముషాల తర్వాత ఒక ముసలిస్త్రీ, ఒక బిడ్డనెత్తుకువచ్చి, జిల్లేడు చెట్టువైపు వెళుతుంది ...అటూ యిటూ చూస్తూంది.]

బంగారం : (మెల్లగా లేచికూచ్చుంది.. పెదిమలు తడుపుకుని యిటూ అటూ చూస్తుంది) ఏమిటదీ?

స్త్రీ : ఈ చెట్టుకోసం ఎంతదూరం నుంచో వెతుక్కుంటూ వచ్చానమ్మా.

బం : జిల్లేడాకు లెందుకూ?

స్త్రీ : (జిల్లేడాకులు తుంపి, పాలు బిడ్డ కండ్లలో పిండుతూ) ఇందుకే నమ్మా.

బం : (నిలచి, చరచరా వెళ్లి, ఆకులు లాగి పారవేశి, బిడ్డకళ్లు తుడుస్తూ) అయ్యో-అదేంపని? - బిడ్డకళ్లు.

స్త్రీ : నీ కెందుకు నువ్వూరుకో మాతల్లి! మా నోటికాడ కూడు పడగొట్టకమ్మ ... (మళ్ళీ ఆకులు తుంపుతుంది.)

బం : (కోపంగా) బిడ్డకంటో జిల్లేడు పాలు పొడుస్తూ; నోటికాడ కూడంటావేమిటే?

స్త్రీ : కళ్లు లేని పిల్లలగ్గాని - బిచ్చం దొరకదమ్మా.

బం : అందుకని, కన్నబిడ్డ కళ్లు చేతులారా పొగొడతావా? నువ్వు తల్లివా, గొడ్డుమోతువా??

స్త్రీ : (ఏడ్పు నాపుకుంటూ) గొడ్డుమోతును కాదమ్మా - పదిమందిని కన్నదాన్నే ... మా రాతలే గొడ్డుమోతులైపోయినయ్...పొట్టకోసం యిట్టాచెయ్యక తప్పలేదు.

బంగా : ఛీ - నీమొఖంచూస్తే నరకం కూడాను - ఫో... (వెళ్ళి తనబిడ్డను ఎత్తుకుంటుంది.)

స్త్రీ : (జిల్లేడుపాలు తన పిల్లకళ్ళలో పిండుతూనే నిష్క్రమిస్తుంది.)

★ కాలక్షేపం ★

5-వ పేజీ తరువాయి)

కాక్షు ! ఎందుకిట్లా కల్పించావు ? అని స్మరించాలి. కాని, ఆక్లాసులోఒక కొంటె పిల్లవాడు యీ కుంటి మాష్టరు గారిని చూచినప్పుడు పుండరీ కాక్షు ! పుండరీ కాక్షు ! అనే గురునామస్మరణకూడా చేసే వాడుకాడు. ఆయన క్లాసులోనుంచి వెళ్ళగానే మిగిలిన పిల్లలందరూ చూచి నవ్వడానికి, ఆ మాష్టరుగారి మాదిరిగానే అనుకరిస్తూ కాలుఎగురవేస్తూ, వక్రంగానడిచేవాడు. అంతసహజంగా వాడుఆవిధంగా అనుకరించడం చూచి ఆనందించి మిగిలిన పిల్లలందరూ "వన్సుమోర్!" అని హర్షధ్వానులు చేస్తూఉండేవారు. తన ప్రజ్ఞకు మిగిలిన క్లాసు పిల్ల లందరూ అంతగా మెచ్చుకుంటున్నారనే గర్వంచేత ఆ కొంటె కుర్రవాడు ఆ కుంటి నడకనే యింకా, యింకా సాధకం చేశాడు. చిట్టచివరకు వానికి ఆ నడక అభ్యాసమైంది. పుట్టుకతో లేని కుంటి నడక, పట్టుదలగా సాధకం చేయడంవల్ల స్థిరలక్షణమైంది.

మంచి విషయంలోనే యీ సాధకం చేసినట్లయితే ఆ మంచిగుణమే అభ్యాసం అయ్యేది. గురుభక్తి లేకపోయినా, తన తల వంచి రాములవారికిఅంజనేయులవారు నమస్కారం చేసినట్లుగా, అభక్తిభంగిమనే పూర్తిగా అనుకరించి సాధకంచేస్తే, ఆ నమస్కృతి సాధకంవల్ల నమ్రత అనే సుగుణం కూడా క్రమేణ ఏర్పడుటకు అవకాశం ఉంది. భక్తి లేకపోయినా తులసి తొవళములను తిప్పుతూ పెరియాళ్వారు అంతవాణ్ని కావాలనే ఆశయంతో, లేదాబడాయిలో, సాధకంచేస్తే, ఆరీతిగా సాధకంచేసిన సాధకులలో కొందరైనా ఉత్తీర్ణు లవుతారు. ఉత్తీర్ణులు కాకపోయినా, చేసిన సాధకం వల్ల యథాశక్తిగా అది సార్థకం అవుతుంది. పరీక్ష ఫెయిలయినా చదివిన చదువు వ్యర్థం కాదు. సాధకానికి తగిన సంస్కారం కలుగక తప్పదు.

దీనినే ఉపాసనాబలం అని నిర్వచించవచ్చు — ద్రోణాచార్యులవారే తనకుగురువు అని ఏకలవ్యుడు అనే బోయవాడు మనస్సులో ఊహించుకొని, "ఆయన ప్రతిమ ఇది" అని సంకల్పించుకొని, ఒక మట్టిబొమ్మచేసి, దానిని తనకెదురుగా పెట్టుకొని, ఆద్రోణాచార్యులవారే తనకు విద్య నేర్పుచున్నారని స్మరించుకొని, విలువిద్యను విరామం లేకుండా సాధకంచేశాడు. గురితప్పితే గురువు దండిస్తాడన్న భయభక్తులతో సాధకంచేశాడు. ఆవిధంగా సాధకం చేసిన ఏకలవ్యుడు గొప్ప విలువిద్యా ప్రవీణుడై సిద్ధహస్తుడైనాడు.

ఈ ఉపాసన అనేది ఉపాధ్యాయుడు లేకుండానే విద్య సాధించడానికి సాధనభూతమవుతుంది. కొంతకాలానికి ఆ విగ్రహం చూచినప్పుడే, స్మరించినప్పుడే, ధ్యానించినప్పుడే,ఆప్రజ్ఞఅతనిలోప్రజ్వలిస్తుంది

అయితే, యీఉపాసన అనేది ఒకఆత్మప్రబోధసాధనం. మోటారులో పెట్రోలు పోసినట్లుగా, ఈ ఉపాసనాబలంవల్ల ఆత్మప్రజ్ఞగాని, ఆత్మవికాసంగాని సిద్ధిస్తుంది. అయితే అందుకు అనుకూలంగా మోటారుయొక్క యంత్రనిర్మాణం అదివరకే ఏర్పడి ఉంది. త్యాగరాజులవారిని స్మరించుకొని, వారిని ఆరాధన చేసికొని, వీణ చేతబట్టిన పాటకుడు పరవశుడై రాళ్లు కరగించే రాగాలాపన చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ త్యాగబ్రహ్మోపాసన చేయకుండా, మరొకమూర్తిని అనగా, ఏ లక్ష్మీ విగ్రహాన్నో ఎదుట పెట్టుకొని ధ్యానం చేసినట్లయితే అతని స్వరస్థానాలు అంత ఉచ్ఛస్థాయిలో స్వచ్ఛస్థాయిలో హాయిగా పల్కవు. శాస్త్రాధ్యయనంలో కంటె, కళాసాధనయందు యీ విషయం ఎక్కువ స్పష్టంగా అనుభవ సిద్ధమవుతుంది.

పూర్వ మొకసారి సింధురాష్ట్రం నుంచి ఒక చిన్న పిల్లవాడు ఆంధ్రదేశానికి వచ్చాడు. అతడు బాలుడైనప్పటికీ చాలా హాయిగా అనేక సంగీతవాద్య యంత్రాలమీద వాయించేవాడు — జలతరంగిణి, లోహతరంగిని, వేణు, వీణ, ఫిడేల్ సితార్, హార్మోనియం, బుల్ బుల్ తరంగా, పియానో, హార్మోనియం, ఇత్యాది అనేక రకాల వాద్యాలతో చక్కని సంగీతం వినిపించేవాడు—అతడు తెనుగుదేశానికి వచ్చి చాలా ఊళ్లల్లో సభలుచేసి సన్మానాలు పొందాడు. పిల్లవాడు చాలా సొగసుగా చూడ సొంపుగా ఉండేవాడు. అటువంటి పిల్లవాడే, ఆ యీడుపిల్లవాడే మరొకడు మాఊళ్లో కన్పిస్తూఉండేవాడు. అతని పేరు జగన్మోహనరావు. రైలుస్టేషనులో ప్లాటుఫారంమీదకు వచ్చి, రైలుబండి నిలిచే చోట, అందులో ముఖ్యంగా ఆడవాళ్ల పెట్టె నిలిచే చోట తిరుగుతూ ఉండేవాడు. ఆడవాళ్ల పెట్టెలో కూర్చున్నట్టి ఆడవాళ్ళవంక సరదాగా చూస్తూ ఉండేవాడు. వాళ్ళు కూడా వినోదంగా యీ షోకైన పిల్లవాని వంకచూచి, యితడే ఆసింధురాష్ట్రపు సర్వవాద్య సందోహ సంగీతవిద్వాంసుడైన బాలుడని భ్రమించి దగ్గరగా గుసగుసలాడుతూ ఆడవాళ్లు తమలో తాము చెప్పుకునేవాళ్లు. ఇదంతా అతడు విన్నాడు. అతనికి అంతటి ఖ్యాతి రావాలనే ఆశ అప్పుడు కలిగింది. మరునాటినుంచీ ఒక్కొక్క సంగీత వాద్యమునే సాధకం చేయడం ప్రారంభించాడు. తాను సింధీ బాలగాయకుని అంతవాడు కావాలనే ఆశతో ఆ వాద్యయంత్రాలలోఅనేకం సాధకం చేశాడు. చివరకతని జీవితం సంగీతమయమైంది. రైలుస్టేషనుప్లాటుఫారంమీద తిరిగినప్పుడు మొదట, "మృగాక్షులయందు ప్రగల్భభావం" అతనికి ఏర్పడింది. అది కళాప్రవీణులకు ఉండే లక్షణం. అతడు మొదట కళాప్రవీణుడు కాకపోయినా, "మృగాక్షులయందు ప్రగల్భభావం" అభినయించి, తద్వారా కళాప్రవీణుడైనాడు. ★

★ ఆకలితో ★

బంగా : అబ్బా! ఆకలి ఎంతెంత పనులు చేయిస్తుంది?...మనుషులే రాక్షసులవుతున్నారు...మనుషుల్నికూడా పీక్కుతింటారేమో - యిక...(భయంతో ఆలోచించి) నా చిట్టి నమ్మెకారు...వంగానికి మిగిలింది యీ వలుసు (చేతుల్లోని బిడ్డను ఘట్టిగా గుండెలకు అణచుకుని - లేపి ముఖంలోకి చూస్తుంది) అయ్యో - నాబిడ్డ! నా బిడ్డా నన్నన్యాయం చేసింది-అయ్యో. [పెద్దగా అరచి స్పృహదప్పి పడిపోతుంది. ముందే చనిపోయిన బిడ్డ బెండులా పడివుంటుంది.]

గా : [చేత్తో అన్నపుపొట్లం పట్టుకుని పరుగెత్తుకువస్తుంది. భయం, అసహ్యం ఆవరించినముఖం. జుట్టురేగి ముఖంమీద పడుతూంది. వదినెదగ్గరకెళ్ళి గభాలున మీదబడి] వదినే...యిదుగో, అన్నం...తెచ్చగన్నం....(వదిన్ని తొందరతుంది) వదినే ...అన్నం తెచ్చా, నీకోసమే. (తడిమి, గుండెలుచూచి) వదినా! (బిడ్డచావును కూడా గుర్తించి)పాపా!! (తల మోదుకుని) అయ్యో...మీకీ గతిలేని చావా?...మీరు బదికితే చాలని, నేనెంతపనిచేశా నొదినా?- మీరు బదికి బాగుంటే, అదే నాకు పదివేలనుకున్నాను...నా సర్వస్వం ధారపోశాను ...ఒక్కరూపాయికోసం; పొట్లంఅన్నం-కోసం భారతస్త్రీకి, స్వర్గంకంటే విలువైన దాన్ని కూడా పాడుజేసుకున్నాను వదినా ...వదినా - పతితనైపోయాను - అయినా నిన్ను బతికించుకోలేకపోయాను - ఎందుకిదంతా (పొట్లం విసిరేస్తుంది) ఎందుకీ బతుకు? (గుండెలు బాదుకుని వదినెపై పడి ఏడుస్తూంది).

[తెర - త్వరగ]

(అయిపోయింది.) ★

★ నిత్యశంకితుడు ★

(7-వ పేజీ తరువాయి)

సైరం: ఊరోక్రా, ఆయన్ని ఎక్సైట్ చెయ్యబాకు అయితే బ్లడ్ ప్రెషరు రైజౌతుంది. మేం వెళ్తున్నాము నాన్నగారూ మీరు కొంత విశ్రాంతితీసుకోండి. రా, రా, మనం బయటికి పోదాం, నాన్నగారిని నిద్రపోనీ—(బూట్లచప్పుడు)

రామ: క్రిమివిశేషాలు తెలిసిన ఆడపిల్ల కనకనే వెళ్ళమనకుండా బయటికివెళ్ళింది. ఏమీ తెలియని మొగనేథవ గనక వాడు వెళ్ళమన్నా వెళ్ళడు. అదే దానికి వాడికీ భేదం. హరీహరీ. (గుర్రు పెడతాడు)

(మళ్ళీ మెల్లిగా బూట్ల చప్పుడు)

సైరంధ్రి: నాన్నగారికి నిద్రపట్టింది. అట్లా మాట్లాడుతూ మాట్లాడుతూనే నిద్రపట్టే లక్షణాలూ ఎడ్ కొ ఫెలయిటెస్ అనే వ్యాధికి వుంటుంది.

దామో: సైరంధ్రి (Pathlogy) నీపాథాలజీకి నీకూ ఒక నమస్కారం, కదిలినా మెదిలినా వ్యాధులపేర్లు పెట్టబోకు;

సైరంధ్రి: నేను పెట్టాలని పెడుతున్నానా ఏమిట్రా?

దామో: ఘట్టిగా మాట్లాడకు, వినబడు న్నారో నిద్ర పట్టించుకున్నారు.

సైరంధ్రి: అది నిద్రేనా అని;

(ఇంతసేపూ గుర్రుపెడుతున్న రామదాసు ఓ హో హో ఆఁ ఆఁ ఆఁ అమ్మ, అమ్మ అని ఒణుకుతాడు]

దామో: అదేమిటి నాన్నగారూ; నాన్నగారూ; అయ్యో, అమ్మ ఊటీకి వెళ్ళిందే.

సైరంధ్రి: నేం చెప్పలేదూ. దుమ్ము చెప్పులతో లోపలికి వచ్చావు ఆయనకు టెటనస్ వచ్చేసింది.

దామో: టెటనస్, నిజంగానే, అయ్యో, పొన్నుస్వామి పిళ్లెగారికి ఫోన్ చెయ్యనా?

సైరంధ్రి: పొన్నుస్వామిపిళ్లె ఫిజీషియన్. టెటనస్ సర్జికల్ డిపార్టుమెంటుకు సంబంధించింది. రమేష్‌రావుకు ఫోన్ చెయ్యి, నే నీలోగా నాన్నగార్ని పరీక్షచేసి కేస్‌షీట్ రాసి పెడతాను.

దామో: (లోపలినుంచి దామోదరం కంఠం) హల్లో రమేష్ రావుగారేనా మా నాన్నగారికి టెటనస్ వచ్చిందండి దయచేసి వెంటనే రావాలండి...నేనే నండీ దామోదరాన్ని, ఏ దామోదర మంటారా బ్రహ్మాండం రామదాసు గార బ్బాయిని, వస్తున్నారుగారూ, థాంక్స్..

సైరంధ్రి: పక్కా టెటనస్ రా; ప్రోగ్నొసిస్ చాలా గ్రేవే;

దామో: ప్రోగ్నొసిస్ అంటే.

సైరంధ్రి: రోగం భవిష్యత్తు.

దామో: అయితే నాన్నగారు బ్రతకరా? నాన్నగారూ! నాన్నగారూ! (ఏడుస్తాడు)

సై: అదేమిట్రా; అంతా వెక్కిరిస్తున్నారని ఆడవాళ్లు ఏడవడం మానుకుంటే నువ్విలా ఏడవడం, ఏడవడానికే చిన్నతనం సైంటిఫిక్‌గా ఇన్వెస్టిగేట్ చెయ్యాలిగాని ఏడిస్తే ఏం లాభం.

(బయట కారాగిన చప్పుడు. బూట్ల చప్పుడు)

సై: కమిన్ సార్, మా ఫాదర్‌కి టెటనస్ వచ్చిందండి.

రమేష్: టెటనసా? ఆయనకు టెటనసేమిటి?

రామ: ఎవరది? ఎవరో కొత్త డాక్టరుగా వున్నాడే. ఆయనకు టెటనస్సేమిటంటాడేమిటి. నేనా వ్యాధి రాతగ్గవాణ్ణి కానంటావా? అందుకు నాకన్న తగినవాడెవడు యీ పట్టణంలో? కొంత మర్యాద యిచ్చి మాట్లాడండి.

రమే: ఐ సీ!

దామో: ఏమిటండీ మా నాన్నకు జబ్బు ప్రమాదం లేదుగదా?

రమే: అసలేం జరిగిందో చెప్పండి.

దామో: పొన్నుస్వామి పిళ్లెగార్ని పిలుచుకు రమ్మని నాన్నగారు పంపేరండి. వెళ్లివచ్చేటప్పటికి ధూళికమ్మిన బూట్లతో యిక్కడికి వచ్చానని మా చెల్లెలు కోప్పడది.

రమే: ఎందుకు?

రామ: నా కూతురు పాటి కూడా నీకు తెలియదల్లే వుందే; నువ్వేం డాక్టరివయ్యా నీకు తెలియకపోతే ఇంకెవ్వరైనా తెలిసిన వాణ్ణి పిలిపించు. ముందా చెప్పులు విడిచి మాట్లాడు.

రమే: పిలిపిస్తాను, మీరు పడుకోండి. (ధాటీగా) తరవాత.

దామో: రోడ్డుదుమ్ములో టెటనస్ క్రిము లుంటవిటగా. ఆ మాట వినడంతోటే నాన్నగారు ఆ వ్యాధిని గురించి చెప్పమన్నారు. మా చెల్లెలు చిలవలు పలవలుగా చెప్పింది. విని పడుకున్నారు. నిద్రలో యీ వ్యాధి వచ్చింది.

రమే: వచ్చి ఏం చేశారు?

రామ: ఏం చేస్తారు! ధనుర్వాతం వస్తే ఏం చేస్తారో అదే చేశారు. అమ్మ!

రమే: అరే విల్లంబులాగా వొంగిపోయారే; ఉండండి పరీక్ష చేద్దాము. కాలెత్తండి చాలు. ఊపిరి తియ్యండి. చాలు... ఆ...

సై: టెటనసే కాదండి.

రమే: టెటనస్ కాదు ఇది. ఆటో సజెషన్‌తో వచ్చిన మనోవిభ్రమం. ఎవర్నయినా మానసికవ్యాధుల నిపుణుణ్ణి పిలిపించండి.

దామో: అమ్మయ్యా; చాలా థ్యాంక్సండీ......

రామ: ఎవర్నీ పిలిపించ నక్కర్లేదు. నాకు మనోవ్యాధేమిటి? ఇది క్రిమివ్యాధి, అవాకులూ చవాకులూ వాగుతున్నావు.

రమేష్: రామదాసు గారూ; మీకు నిజంగా మనోవ్యాధి ఏర్పడిందనే అనుమానం లేకపోతే యీ అమర్యాదకు తగిన శాస్తి చేసివుందును.

రామ: మీకా అనుమానమేమి అక్కర్లేదు. ఏంచేస్తారో చెయ్యండి.

రమేష్: సైరంధ్రీ; వచ్చీ రాని చదువుతో వైద్యం ప్రారంభం చెయ్యకు. మిస్టర్ దామోదరం, మీ నాన్నకుమర్యాద నేర్చుకోమని చెప్పు, వస్తున్నాను.

దామో: ఫీజ్ పుచ్చుకుని వెళ్లండి.

రమేష్: ఆత్మగౌరవం లేని చోట ఫీజెందుకు. అది నాకు తృణప్రాయం.

రామ: ఆఁ డాక్టర్లకి కూడా ఆత్మగౌరవం వుంటుందా?

రమేష్: ఉండదనుకోడం మనోవ్యాధికి లక్షణం...గుడ్ బై;...

రామ: మంచిశాస్తి చేశాడు. రోగం తంగిన కుదిర్చిపోయినాడు. చూస్తారేం, నాకే వ్యాధీలేదు. వెళ్లండి. పోరేం. పొండి.

సైరంధ్రి: } పోతున్నాము; నాన్న
దామో: } గారూ; పోతున్నాము.

రామ: క్రిమివ్యాధికంటే మనోవ్యాధే మంచిది. మనోవ్యాధికి మందు లేదు. మందు లేనప్పుడు వైద్యులు లేరు. కళ్లుమూసుకు పడుకోడమే మందు. (గుర్రుపెట్టె నిద్ర) ★

(43-వ పేజీ తరువాయి)

బురద అని అతని అభిప్రాయం. నేను గ్రహించినట్లు తెలుసుకొని సైతాను నవ్వాడు. పచ్చిక మేస్తున్న ఎద్దునొకదాన్ని చూపించి, దాన్ని నిమిరి, దానితో ఏదో మాట్లాడాడు. తరవాత నాతో ఇలాగన్నాడు :

“ఇదుగో— ఈ ఎద్దు చూడు. అమాయికలైన బాలికలను పదిరోజులు ఆకలితో మాడ్చి, భయపెట్టి, వారు చెయ్యని పాపాలను వారిచేత ఒప్పింపజెయ్యటం, ఈ ఎద్దు చెయ్యగలదంటావా ? నిరుపేద వృద్ధస్త్రీలు తోడిమానవులకు సహాయం చేస్తుంటే సహించలేక కాల్చి చంపటం, కాల్చబోయేముందు కోడిగుడ్లు విసిరి అవమానించటం, ఈ ఎద్దు చెయ్యగలదంటావా ? ఊహు. చెయ్యలేదు. దానికి ధర్మాధర్మ విచక్షణ జ్ఞానం లేదు గనక అధర్మం చెయ్యలేదు. అందుకనే అది మా దేవతలతో సమానమైనది.

సైతాను ఒక్కొక్కసారి ఎంత తియ్యగా మాట్లాడుతాడో, మరొకొక్క సారి అంత క్రూరంగా మాట్లాడుతాడు. ముఖ్యంగా మానవజాతిప్రసక్తి వస్తే చాలు అతని కంఠంలో కాఠిన్యం ఉట్టిపడుతుంది.

మళ్లీ కథలోకి వద్దాం. గాట్ ఫ్రీడ్ నార్‌ను నౌకరుగా ఏర్పాటు చేసుకోవటం క్షేమం కాదని మాకు అనిపించింది. మేము అనుమానించినట్టే జరిగింది. మంత్రగత్తె అని తగలపెట్టబడిన స్త్రీ మనమడు ఫలానా మార్గరెట్ వద్ద నౌకరుగా ఉంటున్నాడనే విషయం నలుగురిలోనూ పాక్కింది. కొందరు మండిపడ్డారు. పైగా ఆ ఇంట్లో మార్గరెట్‌కూ, ఉర్సులాకే లేదే? నౌకర్ను పెట్టుకుని వాడికి జీతమిచ్చి పోషించటానికెక్కడుంది? అని గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఈ రహస్యం ఛేదించటానికి కొందరు నడుం బిగించి తీవ్ర కృషి చేశారు. గాట్ ఫ్రీడ్ నార్ నిపిస్తే వాడిమీద ఇంతవరకూ ఉమ్మేసే మహానుభావులు, ఇప్పుడు వాణ్ణి మెల్లిగా దువ్వసాగారు. వాడు అనలే మేధకుడు గనక వారు పన్నిన వల చూసుకోకుండా, వారు తనతో మాట్లాడిందే భాగ్యమనుకుని, సంతోషించాడు. చల్లగా ఉన్నదున్నట్టు చెప్పేశాడు.

“డబ్బా? వెధవ డబ్బు! మార్గరెట్‌గారి దగ్గర చచ్చేంత డబ్బుంది. నాకు ముప్పూటా మూడు కంచాల తిండి పెట్టడమే గాక వారానికి రెండు వెండి నాణాలు జీత మిస్తున్నారు. వాళ్ల భోజనం బల్ల ఎల్లా వుంటుందో తెలుసా? మహారాజులు కూడా జన్మలో తిని ఎరగని పదార్థాలు ఇంట్లో ఎక్కడ చూసినా మూలుగుతూంటాయి,” అన్నాడు.

గాట్ ఫ్రీడ్ నార్ ఇలా వర్ణించే సరికి గ్రామస్థులకి మూర్ఛ పర్యంతం అయింది. ఆశ్చర్యం, భయం ముంచుకొచ్చాయి. కొందరు వెంటనే వెళ్లి జ్యోతిష్కుడితో చెప్పారు. ఆయనకి ఈ మాటలు విని కాళ్లు చేతులు చల్లపడ్డాయి. తక్షణంపోయి ఫాదర్ అడాల్ఫ్‌కు చేరవేశా డీ కబురు. ఆయనక్కూడా కాళ్లూ చేతులూ ఆడలేదు. దీర్ఘంగా ఆలోచించి, “ఇదేదో చూడాల్సిందే. దీని అంతు నేనో, నా అంతుఅదో కనుక్కోవాలి,” అని ఫాదర్ అడాల్ఫ్ నిశ్చయించాడు.

మార్గరెట్‌కు తిరిగి సిరిసంపదలు లభించడానికి ఏవో మంత్రశక్తులే కారణమైవుండాలని ఫాదర్ అడాల్ఫ్ భావించాడు. మార్గరెట్ ఇంటికి తరుచు వస్తూపోతూ ఉండాలని, ఏమీ ఎరగనట్టు నటిస్తూ అంతా కనిపెట్టాలనీ, గ్రామస్థులకు రహస్యంగా హెచ్చరిక చేశాడు. గ్రామస్థులు మొదట సందేహించారు, మంత్రశక్తులతో నిండిన మార్గరెట్ ఇల్లు ప్రవేశించటానికి. కాని తన ప్రభావంవల్ల ఎవరికీ ఏ అపాయమూ రాకుండా చేస్తానని ఫాదర్ అడాల్ఫ్ అభయం ఇచ్చాడు. ‘మంత్రించిన నీళ్ళు, అవి దగ్గర పెట్టుకుని ఉండమని సలహా ఇచ్చాడు. అప్పుడు గ్రామస్థులకు భయం తొలిగి మార్గరెట్ ఇంటికి పోవటానికి అంగీకరించారు. ఆమెపై అసూయ, ద్వేషం ఉన్న కొందరు ఆమెఇంటికి వెళ్ళటానికి సంబరపడ్డారుకూడాను.

ఈవిధంగా మార్గరెట్ ఇల్లు మళ్ళీ కలకలలాడసాగింద. తన ఇంటికి గ్రామస్థులు రాకపోకలు జరుపుతున్నందుకు ఆమె సంతోషించింది.

మేము ముగ్గురం కూడా నిరభ్యంతరంగా మార్గరెట్ ఇంటికి వెళ్ళసాగాము. మా తలిదండ్రులు కూడా రోజూ ఒకసారైనా ఆ ఇంటికి వెళ్లేవారు. ఉర్సులా పెంపుడుపిల్లి ఎంతమంది వచ్చినా షడ్రసోపేతమైన విందు ఏర్పాటుచేసేది. రకరకాల రుచ్య పదార్థాలు, పానీయాలు, ఫలాలు సప్లయిచేసేది. మహారాజులకు తగిన ఈ భోజ్యవిశేషాలు ఆరగించి గ్రామస్థులు విపరీతమైన ఆశ్చర్యంతో ఇళ్లకు తిరిగి పోయేవారు. అంత ఖరీదైన పదార్థాలు ఎక్కణ్నుంచి వస్తున్నాయో ఎవరికీ తెలీదు. (ఇంకా వుంది.)

రెండు మహానగరాలు

(25-వ పేజీ తరువాయి)

తాలూ మీదగ్గిర భద్రంగా వుంచండి. ఇలాంటి ప్యాసుపోర్టు ఆయన సంపాదించుకుని వుంటాడని నేను యిదివరకే అనుకున్నాను. అయితే ఒకటీ—దీన్ని వాళ్ళు రద్దుచేసి పారెయ్యకుండా వుండాలి—వెంటనే రద్దుచేసేస్తారేమోననే నా భయం—అలా అనుకోవటానికి కారణాలు వున్నయ్‌లెండి.'—

'వాళ్లు మరేం ప్రమాదావస్థలో లేరు గద'—

'ప్రమాదావస్థ అని నెమ్మదిగా అంటా రేవిటి? ప్రాణాపాయస్థితిలో వున్నారు. మాడమ్ డిఫార్జ్ తండ్రీ కూతుళ్లిద్దరి మీదా స్వయంగా నేరారోపణ చేయబోతోంది. ఈమాట ఆ ఆడపులి అరుస్తుంటే స్వయంగా విన్నాను. అది ఇంకా చాలా సంగతులు మాట్లాడింది; వాళ్ళకు ప్రమాదస్థితి కలగబోతున్నదన్నమాట మాత్రం నిజం. అప్పటినుంచీ నేను క్షణమైనా వ్యర్థం చెయ్యలేదు. గూఢచారిని కూడా కలుసుకుని భోగట్టా తీశాను. అతను కూడా యీ సంగతి నిజమే నన్నాడు. జైలుగోడ ప్రక్కనున్న కట్టెల డిపోలో కట్టెగొట్టేవాడొకడున్నాట్ట; వాడిచేత మాడమ్ డిఫార్జ్ రీహార్సల్ చేయిస్తోందట. లూసీ జైలుగోడక్రింద నిల్చుని పైనున్న కిటికీవంక చూసి సంజ్ఞ చేస్తుండగా తాను చూసినట్టు వాడిచేత సాక్ష్యం చెప్పించబోతున్నారు. జైల్లో వున్న ఖైదీలతో కలిసి కుట్రబన్నుతున్నట్టు నేరారోపణ చెయ్యబోతున్నారన్నమాట. లూసీతోపాటు లూసీ బిడ్డా, తండ్రీ కూడా వుండటం వాడు చూశాట్ట—అంటే యిది ముగ్గుర్నీ మెడ తుంచుకు పోబోతోందన్నమాట—అలా కంగారు పడకండి—మీరు వాళ్ళ ప్రాణాలు కాపాడాలి'—

'భగవంతుడు నాకు అలాంటి అవకాశాన్ని ప్రసాదించటం కంటే యింకేం కావాలి—కాని ఎలా?'

'నేను చెబుతున్నాగా—ఇప్పుడు యిదంతా మీ ఒక్కరి మీద ఆధారపడివుంది. ఈ నేరారోపణ చెయ్యటానికి యింకా రెండుమూడురోజులు అవధి వుండి తీరుతుంది. ఎందుకంటే ఇది ప్రభుత్వ విద్రోహ నేరంచూడండి!—ప్రభుత్వం తల గొట్టించిన నేరస్థుడి కోసం దుఃఖించటంకూడా ఒక నేరం. డార్నే కోసం లూసీ, డాక్టరూ యేడవటం ఎలాగో సహజం—ఆ యేడవటం మాడమ్ డిఫార్జ్ మోపబోతున్న అభియోగానికి మరింత బలం; అందుచేత ఆ సంఘటనకూడా పూర్తి అయేవరకూ వ్యవధి తీసుకుంటుంది—సరీగా వింటున్నారా? ఇదంతా మీకు బాగా అర్థమాతోందా?'

'చాలా జాగ్రత్తగా వింటున్నాను'

'మీదగ్గర డబ్బుందిగదూ—ఓడరేవుకు వెళ్ళిపోవటానికి వెంటనే ప్రయాణపు ఏర్పాట్లుచెయ్యండి. రేపు ఉదయానికే గుర్రపు బగ్గీ సిద్ధం చెయ్యండి; ఏదిఏమైనాసరే రేపుమధ్యాహ్నం రెండుగంటలయేసరికి టంచన్‌గా బయలుదేరి వెళ్లిపోయే సన్నాహమంతా సిద్ధంకావాలి.

'ఓ తప్పకుండా చేస్తాను.'—

'ఈ రాత్రే లూసీకి చెప్పండి—తనకే కాకుండా తన తండ్రికీ బిడ్డకీ కూడా పీకలమీదికి వస్తుందని చెప్పండి ఆసంగతి ఎలా నచ్చచెప్పి ఒప్పిస్తారో! ఇది తన భర్తచేసిన తుది యేర్పాటుగా ఆవిడతో చెప్పండి. తాను ఊహించగలిగిన దానికంటే—తాను ఆశించినదానికంటే మరింత ప్రయోజనం సాధించటానికి యిందువల్ల అవకాశం కలుగుతుందని చెప్పండి.' ఈ స్థితిలో కూడా, డాక్టర్, కుమార్తె ఎలా చెపితే అలా వింటాడనుకుంటాను.'

'ఓ! తప్పకుండా వింటాడు.'

'సన్నాహమంతా ఈ ప్రహరీ గోడలోపలే చేసెయ్యండి—అంతా బండిలోఎక్కి కూర్చోవటందాకా — నేను రాగానే తక్షణం నన్నుకూడా ఎక్కించుకుని బండి తోలించెయ్యండి.'

'అంటే పరిస్థితులు ఎలావున్నా నువ్వు తిరిగివచ్చేవరకూ నిరీక్షించుతూ వుండమనేగా నువ్వు చెబుతున్నది'—


'అందరి ప్యాసుపోర్టులతో పాటు నా ప్యాసుపోర్టు కూడా మీదగ్గిర వుంటుందిగా—అంటే నాకోసం సీటు ఉంచుతారన్నమాట; ఆ సీటులోకి మనిషి భర్తీకాగానే బండి బయలుదేరదీస్తారూ ఇందులో ఏముంది'—

లారీ అమితోత్సాహంగా కార్టన్ చెయ్యిబట్టుకున్నాడు: 'ఇదంతా ముసలివాణ్ణి నాఒక్కడివల్లా ఏమాతుంది—చురుకైన యువకు డెవడేనా ప్రక్కను లేకపోతే'

'భగవంతుడి కృపవల్ల మీకు అలాంటిది లభించి తీరుతుంది—మీరుమటుకు ఒకటి వాగ్దానం చెయ్యాలి—ఆరు నూరైనా సరే, నూరు ఆరైనాసరే మన మనుకున్న పద్ధతిలో అణుమాత్రంకూడా వ్యత్యాసం రాకుండా మీరు నిర్వహించాలి.'


'అణుమాత్రం కూడా వ్యత్యాసం రాదు కార్టన్! భగవంతుడి ముఖంచూసి వాగ్దానం చేస్తున్నాను'

'సరే మీబాధ్యత మీరు నిర్వహించండి—నేను చెయ్యగలిగిందేమిటో నేను చేస్తాను—నమస్తే వెళ్ళొస్తాను. ★




నేపియర్స్ బ్రిడ్జి, మద్రాసు— ఫోటో: శ్రీ జి. యస్. భూషణ్.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madra.



పల్లవులచే నిర్మించబడిన వెంకటరమణస్వామి దేవాలయం- తాడిపత్రి.

—ఫొటో శ్రీ పి రాఘవరావు.


డిసెంబరు 19వ తేది
విశాలాంధ్రలో
విడుదల....
మోడరన్ థియేటర్సు వారి
సవతిపోరు
పూర్ణా రిలీజ్
డైరెక్షన్: T.R.సుందరం & మస్తాన్